thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 75 కరీంనగర్ ఆదివారం, 25 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇండిగో పైలట్ అభ్యర్థనను తిరస్కరించిన పాక్

న్యూఢిల్లీ : ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఇండిగో విమానం ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా శ్రీనగర్‌లో ఎమర్జెన్సీగా ల్యాండయిన ఘటనపై డీజీసీఏ విచారణ ప్రారంభించింది. అమృత్‌సర్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం తీవ్రమైన తుఫానును ఎదుర్కొంది. దానిని నివారించేందుకు విమానాన్ని పాక్ గగనతలంలోకి మళ్లించేందుకు పైలట్ లాహోర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)ని అనుమతి కోరాడు. అయితే పాక్ ఏటీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించినట్లు సమాచారం. ఆ విమానంలో తృనముల్ కాంగ్రెసకు చెందిన ఎంపీలు సహా మొత్తం 220 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. గాల్లో తుఫాను కారణంగా పైలట్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి, శ్రీనగర్ ఏటీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో విమానం శ్రీనగర్‌లో ల్యాండ్ అయింది.




## నంబాల కేశవరావుతో సహా మావోయిస్టుల మృత దేహాల్ని అప్పగించండి

ఇటీవల ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాల అప్పగింతపై సందిగ్ధత వీడింది. ఈ నేపథ్యంలో మావోయిస్టుల బంధువులకు తాజాగా కాస్త ఊరట కలిగింది. మావోయిస్టు పార్టీ కేంద్రం కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా మావోయిస్టుల మృత దేహాల్ని వారి బంధువులకు అప్పగించాలని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు అలియాస్ నవీన్ మృతదేహాలను తమకు అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు శుక్రవారం హైకోర్టులో హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు.

# ఫ్యూచర్ సిటీ పేరు మార్పు..?



## నేషనల్, ఇంటర్నేషనల్ ఫీల్ వచ్చేలా కొత్త పేరు ఇదేనా..!

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో తెలంగాణలో ఫోర్త్ సిటీ అభివృద్ధి అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఫ్యూర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) శరవేగంగా అడుగులు వేస్తోంది. అయితే, ప్రస్తుతం ఫ్యూచర్ సిటీగా ఉన్న పేరును మార్పుచేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఆమన్ గల్, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, యాచారం, మంచాల్ ఏడు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలు ఎఫ్ సీడీఏ పరిధిలోకి తీసుకొచ్చారు. గతంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి అథారిటీ (హెచ్ఎండీఏ), స్థానిక సంస్థల పరిధిలో వాణిజ్య క్రయ విక్రయాలకు అనుమతులు పొందాల్సి ఉండేది. తాజాగా.. హెచ్ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏ కమిషనర్ కు అధికారాలు బదిలీ చేశారు. దీంతో జూన్ నుంచి ఎఫ్‌సీడీఏ కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఫ్యూచ్ సిటీలో ఓపెన్ ప్లాట్ లేఔట్లు, నివాస, వాణిజ్య భవన నిర్మాణాల అనుమతులతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఎఫ్‌సీడీఏ అనుమతులు మంజూరు చేయనుంది. వీటితోపాటు పరిశ్రమలు, ఐటీ, ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్టులకు భూ కేటాయింపుల బాధ్యత కూడా ఎఫ్‌సీడీఏనే నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ పేరును మార్పు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా పోలీసు స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనిర్శిటీల పేర్ల తరహాలోనే ఫ్యూచర్ సిటీకి కూడా జాతీయ స్థాయిలో గౌరవం పొందేలా ఫ్యూచర్ సిటీని 'భారత్ ఫ్యూచర్ సిటీ'గా పేరు మార్పు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. దీంతో జాతీయ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా ఆ ప్రాంతం మారుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.




## ఆ ఫ్యామిలీలో అసలేం జరుగుతోంది..

## కవిత కోపానికి కారణాలివేనా.!!

కేసీఆర్ ఫ్యామిలీలో చీలిక, కేసీఆర్కు కవిత బిగ్ షాక్, కవిత కొత్త పార్టీ ఈ మధ్య ఏ న్యూస్ ఛానల్ చూసినా.. యూట్యూబ్ థబ్నెయిల్ చూసినా ఇదే హెడ్డింగ్. వీటికి ఆజ్యం పోసినట్లుగా వరంగల్ పార్టీ మీటింగ్లో జరిగిన తప్పులను లేవనెత్తుతూ కవిత రాసిన ఆరు పేజీల లేఖ గురువారం బయటకు రావడం. ఇవన్నీ చూస్తుంటే తెలంగాణ రాజకీయాల్లో ఏదో పెద్ద పరిణామం చోటుచేసుకుంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అది కొత్త పార్టీ ఏనా..? బీఆర్ఎస్కు కవిత్ అడ్డం తిరుగనున్నారా? అనే అనుమానాలు ఇప్పుడు వస్తున్నాయి. వీటన్నీటికీ కారణాలు కూడా లేకపోలేదు. బీఆర్ఎస్ కవిత తీరు కూడా అలాగే ఉంది. ఆమె చేసే వ్యాఖ్యలు, పార్టీ నాయకులను కలవడం వంటివి అన్నీ పరిశీలిస్తే బీఆర్ఎస్ పార్టీలో ఏదో జరగబోతుందని అర్థమవుతుంది. లిక్కర్ స్కామ్లో అరెస్ట్ అయిన కవిత జైలు నుంచి బెయిల్పై బయటకు రాగానే కొన్ని నెలలపాటు యాక్టీవ్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తర్వాత ఆమె తీరులో కొంచెం తేడా కొట్టొచ్చినట్లు కనిపించింది. తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా ఏర్పడినా.. సామాజికంగా సమానత్వం ఇంకా రాలేదని కవిత మేడే వేడుకల్లో అన్నారు. అంటే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై అసంతృప్తిని చెప్పకనే చెప్పేసింది. జైలు జీవితం తర్వాత చాలా రోజుల పాటు సైలెంట్గా ఉంది. బీసీల రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ అంశాలపై కవిత పోరాటం. ఆయా విషయాల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చింది. కవిత వరుసగా బీఆర్ఎస్ పార్టీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాల నిర్వహించింది. లిక్కర్ స్కామ్ కేసులో జైలుకు వెళ్లి వచ్చినా.. పార్టీ నుంచి కవితకు పెద్ద ఎత్తున మద్దతు లభించింది. కవిత జిల్లాల పర్యటనలో కనిపించని మొదటి శ్రేణి నాయకులు, ఆమె వెళ్లిన ప్రతీచోట ద్వితీయ శ్రేణి నాయకులనే కలిసింది. ఇటీవల కాలంలో ద్వితీయ శ్రేణి నాయకులు, ఉద్యమకారులతో మంతనాలు జరిపింది. బీఆర్ఎస్ పార్టీలో చాలా కాలంగా ఉన్న పాత నాయకుల ఇంటికి వెళ్లి మరీ కవిత పరామర్శించింది. ప్రభుత్వం మారిన తర్వాత అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని కవిత ఆమె గళం వినిపించింది. తెలంగాణ జాగృతి కమిటీలను కవిత మళ్లీ యాక్టీవ్ చేసింది. నాపై కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు, సమయం వచ్చినపుడు అన్నీ బయటకు వస్తాయని ఆమె పలు మార్లు అన్నారు. అది స్వంత పార్టీ వాళ్లేనా అనేది ఇప్పుడు అనుమానం రేకెత్తిస్తోంది. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తాను, నాపై జరుగుతున్న దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందనుకుంటున్నా అంటూ ఇటీవల చిట్ చాట్ కవిత అన్నారు. అంతేకాదు దాదాపు.. రెండు మూడు వారాలుగా కవిత కొత్త పార్టీ పెడుతున్నట్లు వార్తలు వస్తున్నా ఆమె వాటిపై స్పందించకపోవడం అనుమానంగా ఉంది. చాలామంది బీఆర్ఎస్ కార్యకర్తలు కవిత నిజంగానే కొత్త పార్టీ పెడుతుందా అన్న సందేహాలు, చర్చలు జరుగుతున్నాయి. ఈ వార్తలపై స్పందించకుండా ఎమ్మెల్సీ కవిత ఇంకా ఎక్కవగా సోషల్ మీడియా, టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వడం స్టార్ట్ చేసింది. బీఆర్ఎస్లోని లోపాలు.. వైఫల్యాలు.. తనకు పార్టీలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ కవిత ఇటీవల కేసీఆర్కు లేఖ రాశారని వారం క్రితం కాంగ్రెస్ నేత సామా రామ్మోహన్ రెడ్డి మీడియాతో అన్నారు. ఆయన చెప్పినట్లుగానే గురువారం కవిత లేఖ బయటకు వచ్చింది. వరంగల్ బహిరంగ సమావేశంలో జరిగిన తప్పులను కవిత లేఖలో లేవనెత్తారు.

# ఒక్కొక్కటిగా బయటపడుతున్న...

# 'పహల్గాం' గుట్టు!

## పాక్ చేతికి కీలక సమాచారం..




## కశ్మీర్ టు కన్యాకుమారి గూఢచర్య నెట్‌వర్క్!

**పహల్గాం ఘటనపై భయంకర నిజాలు బయటపడుతున్నాయి. పాకిస్తాన్‌కు కీలక సమాచారం చేరవేసేందుకు ఇండియాలో కశ్మీర్ టు కన్యాకుమారి గూఢచర్య నెట్‌వర్క్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 16 మందిని అరెస్ట్ చేయగా మరికొంతమందిని అదుపులోకి తీసుకోనున్నారు.**

**నార్త్ ఇండియానుంచే ఎక్కువ..** ఈ మేరకు పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారతదేశంలో పాకిస్తాన్ గూఢచర్య నెట్ వర్క్ గుట్టు బయటపడుతోంది. ముఖ్యంగా నార్త్ ఇండియా నుంచే పాక్ కోసం చాలామంది పనిచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియా ఇన్ఫ్ యెన్సర్లు, సెక్యూరిటీ గార్డులు, టూరిస్టులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ రెండు వారాల్లోనే దాదాపు 16 మందిని అరెస్ట్ చేశారు. ఈ నిందితులంతా భారత సున్నితమైన సమాచారాన్ని పాక్ ఇంటెలిజెన్స్ అధికారులకు అందించినట్లు విచారణలో బయటపడింది. ఇందులో ప్రధానంగా పంజాబ్‌లో 6, హరియాణాలో 5, ఉత్తర్‌ప్రదేశ్ ఒక్కరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇందులో ఇద్దరు మహిళలు కూడా ఉండటం విశేషం.

**ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుని..** ఇక హరియాణాకు చెందిన మహిళా యూట్యూబర్‌కు జ్యోతి మల్హోత్రాకు ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో సన్నిహిత సంబంధాలు ఉడటం సంచలన రేపుతోంది. రహీంను దేశంనుంచి బహిష్కరించారు. పంజాబ్ అజ్నాలాకు చెందిన ఫలక్షేర్ మసిహ్, సూరజ్ మసిహ్ సరిహద్దు జిల్లాలోని ఆర్మీ కంటోన్మెంట్ సమాచారం, ఫొటోలు పాక్ అధికారులకు ఇచ్చినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే పంజాబ్ మలేర్‌కోట్లాకు చెందిన గుజాలా, యమీన్ మహ్మద్ పాకిస్తాన్‌కు సైనిక రహస్యాలను అందించి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేశారు.

**గూఢచారుల అరెస్టులు..** ఇక పంజాబ్‌కు చెందిన సుఖ్‌ప్రీత్‌సింగ్, కరన్‌బీర్‌సింగ్ 'ఆపరేషన్ సిందూర్', సైనిక కదలికలు, కీలక ప్రాంతాల సమాచారాన్ని ISIకి అందించినట్లు నిర్ధారించి అరెస్ట్ చేశారు. హరియాణా పానిపట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నౌమన్ ఇలాహికి ISIతో సంబంధాలున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. కైథల్ జిల్లా గుహ్లాలో పీజీ విద్యార్థి దేవేందర్ సింగ్ భారత ఆయుధాల ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయగా ఇతన్ని అరెస్ట్ చేశారు. నుహ్ జిల్లాకు చెందిన 26 ఏళ్ల అర్మాన్ సైనిక సమాచారాన్ని పాక్ హైకమిషన్ ఉద్యోగికి పంపించడంతో అతన్ని అరెస్ట్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ బార్డర్ లో అక్రమ రవాణాకు పాల్పడుతున్న షాజాద్.. పాక్ వెళ్లి సమాచారం అందించినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. ఇతను సిమ్‌కార్డ్‌లు కొనుగోలు చేసి ISI ఏజంట్లకు అందించినట్లు గుర్తించారు.




## అంతర్గత విషయాలు.. అంతర్గతంగా మాట్లాడితేనే మంచిది: కేటీఆర్

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, భారాస అధ్యక్షుడు కేసీఆర్‌కు కవిత లేఖ రాయడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. పార్టీ అధినేతకు లేఖ రాయడం తప్పేమీ కాదన్నారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, పార్టీ అధినేతకు సూచనలు చేయాలంటే లేఖలు రాయొచ్చని తెలిపారు. “అంతర్గత విషయాలు.. అంతర్గతంగా మాట్లాడితేనే మంచిది. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు. సమయం వచ్చినప్పుడు కోవర్టులు వారంతట వారే బయటపడతారు”అని అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. అధిష్ఠానానికి డబ్బులు ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి పదవిని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి మాటల సీఎం కాదని, మూటల సీఎం అని విమర్శించారు. “రేవంత్‌రెడ్డికి దిల్లీలో ఇద్దరు బాస్‌లున్నారు. ఒకరు రాహుల్ గాంధీ, మరొకరు మోదీ. ఈడీ ఛార్జిషీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు ఉంది. దీనిపై రేవంత్, రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించట్లేదు? ఈడీ ఛార్జిషీట్‌లో పేరున్న రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలి.

గతంలో ఆరోపణలు వచ్చిన సీఎంలు, కేంద్రమంత్రులు పదవుల నుంచి తప్పుకొన్నారు. గత మేలో తెలంగాణలో ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్ నడుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. మరి దానిపై విచారణ ఎందుకు చేయట్లేదు? సీఎం రేవంత్‌రెడ్డిని కాపాడుతున్నది కేంద్ర ప్రభుత్వమే. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా చేసిన అప్పులు ఎక్కడికి వెళ్తున్నాయి?”అని ప్రశ్నించారు.




ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ నాయకత్వంలోని బృందం ప్రపంచదేశాలకు బయల్దేరింది. ఈసందర్భంగా దేశం తరఫున గళం విప్పేందుకు వెళ్తున్నామంటూ ఆయన ఓ వీడియోను పంచుకున్నారు. దీన్ని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ‘నేను గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, అమెరికాకు వెళ్లే అఖిలపక్ష బృందానికి నాయకత్వం వహిస్తున్నా. దేశం తరఫున గళం విప్పేందుకు వెళ్తున్నాం. ఉగ్రవాదులు పేట్రేగిపోతుంటే భారత్ మౌనంగా ఉండదనే సందేశం ప్రపంచానికి ఇస్తాం. ఇది మా బాధ్యత. వాస్తవానికి దూరంగా ఎలాంటి ప్రకటనలు చేయం. ప్రపంచంలో శాంతి, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛకి తప్ప ద్వేషం, ఉగ్రవాదానికి చోటు లేదని భారత్ విశ్వసిస్తోంది. ఇది ప్రపంచానికి తెలియచేడమే మా లక్ష్యం. జై హింద్’ అని శశిథరూర్ పేర్కొన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత బలగాలు ‘ఆపరేషన్ సిందూర్’ రూపంలో ఉగ్రస్థావరాలపై ఉక్కుపాదం మోపాయి. పీఓకే, పాక్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశాయి. తర్వాత పాక్ రెచ్చగొట్టే చర్యలను మన బలగాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయి. ఈనేపథ్యంలోనే కేంద్రం ఈ దౌత్య యుద్ధాన్ని ప్రారంభించింది. అందులోభాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. మొత్తం ఏడు బృందాలను ఏర్పాటుచేయగా.. వాటిలో మూడు బృందాలు ఇప్పటికే పలు దేశాలకు వెళ్లాయి. మిగిలిన నాలుగు బృందాలు విదేశాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఈక్రమంలో విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఆ నాలుగు బృందాలతో సమావేశమయ్యారు. అందులో శశిథరూర్ బృందంతో పాటు భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్, ఎన్సీపీ(ఎస్పీ) నేత సుప్రియా సూలే, భాజపా నేత బై జయంత్ పాండా నేతృత్వం వహిస్తున్న బృందాలు ఉన్నాయి. ఆయా బృందాల సభ్యులకు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిణామాల గురించి మిస్రీ వివరించారు.

## సిస్టర్ స్ట్రోక్‌తో కేటీఆర్ చిన్నమెదడు చితికిపోయింది : మంత్రి సీతక్క



తండ్రికి లేఖ రాసి.. సిస్టర్ కవిత ఇచ్చిన స్ట్రోక్‌తో కేటీఆర్ చిన్నమెదడు చితికిపోయిందని మంత్రి సీతక్క విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన కామెంట్స్ పై సోషల్ మీడియా వేదికగా స్పందించిన మంత్రి సీతక్క.. గోబెల్స్ ప్రచారంలో ఆయన్ను మించినవారే లేరని ఎద్దేవా చేశారు. కవిత చెప్పిన దెయ్యం కేటీఆరే కావొచ్చని, రాహుల్ గాంధీపై మాట్లాడే స్థాయి కేటీఆర్ కు లేదన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్ర ఎలా ఉంటుందో కేటీఆర్ మర్చిపోయారన్న సీతక్క.. స్వాతంత్ర్యం కోసం పోరాడిన పత్రికకు సహాయపడటం తప్పా? అని ప్రశ్నించారు. గులాబీ కూలీల రూపంలో బీఆర్ఎస్ దోచుకుందని విమర్శించారు. కాళేశ్వరం విషయంలో కమీషన్లు తీసుకున్నప్పుడు లేని భయం.. నేడు కమిషన్ ముందుకు రావడానికి భయపడుతున్నారన్నారు. దానిని కప్పి పుచ్చుకునేందుకు ఈనాడు కాళేశ్వరానికి కాంగ్రెస్ బాంబులు పెట్టిందని అబద్ధాలు చెప్తున్నారన్నారు. అబద్ధానికి ప్రతినిధి గోబెల్స్ ఉంటే.. దానిని మించి అబద్ధాల పునాదులపై పార్టీని నడిపిస్తున్నారని, బెస్ట్ అవార్డు వస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉండేందుకు, ప్రజల కోసం పనిచేసేందుకు కేటీఆర్ లాంటి నాయకుడు పనికిరారని అసహనం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై ఒకలా, ఈడీపై ఒకలా విమర్శలు చేస్తున్నారని, కవిత అన్న దెయ్యం కేటీఆరే అయి ఉండొచ్చన్నారు.




మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగిపోవడంతో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. 427 మంది రోహింగ్యాలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

మే 9, 10వ తేదీల్లో ఈ ఘోర ప్రమాదాలు జరిగినట్లు ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఈ విషయం నిర్ధరణ అయితే ‘సముద్రంలో చోటుచేసుకున్న అత్యంత విషాదకర ఘటన’గా ఇది మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తంచేసింది. ఓడల ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నట్లు ఐరాస అనుబంధ శరణార్థి విభాగం అంచనా వేస్తోంది. తొలి ప్రమాదం మే 9న చోటుచేసుకోగా 267 మందిలో 66 మంది బతికి బయటపడినట్లు ప్రాథమికంగా వెల్లడించింది. మే 10న రెండో నౌక ప్రమాదానికి గురికాగా.. 21 మంది బతికి బయటపడినట్లు సమాచారం. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌లో నివసిస్తుంటారు. కానీ, సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకుగానూ లక్షలాది రోహింగ్యాలు 2017లో బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. మయన్మార్‌లో గతేడాది సైనిక తిరుగుబాటు అనంతరం.. వారి వలసలు మరింత పెరిగాయి.

దీంతో దక్షిణ బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వారంతా.. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

## సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తజనం.. 8 కి.మీ మేర ట్రాఫిక్ జామ్





కాళేశ్వరం: సరస్వతి పుష్కరాలకు జనం పోటెత్తారు. దీంతో శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని మద్దులపల్లి– కాళేశ్వరం మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కాళేశ్వరానికి సమీపంలో 8 కి.మీ మేర వాహనాలు స్తంభించాయి. 4గంటలుగా ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్‌లో స్తంభించడంతో కొంతమంది ప్రయాణికులు కాలినడకన పుష్కర ఘాట్లకు చేరుకుంటున్నారు.




హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్ సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ)ల నుంచి తీసుకున్న అప్పులలో సుమారు రూ.10 వేల కోట్లు రీషెడ్యూల్ అయినట్లు తెలిసింది. ఈ రీషెడ్యూల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా దాదాపు రూ.550 కోట్ల వడ్డీ భారం తగ్గుతుందని అంచనా. దీర్ఘకాలంలో అంటే పదేళ్ల వ్యవధిలో రాష్ట్ర ఖజానాకు రూ.5,500 కోట్ల దాకా ఆదా కానుంది. తెలంగాణ ప్రభుత్వం మొత్తం రూ.50 వేల కోట్ల రుణాలను రీషెడ్యూల్ చేయాలని కేంద్రాన్ని కోరగా, ప్రస్తుతం రూ.10 వేల కోట్లతో సరిపెట్టినట్లు సమాచారం. ఇది కూడా గడిచిన ఆర్థిక సంవత్సరమే చేసినట్లు తెలిసింది. ఈ రీషెడ్యూల్ తో కొంత ఉపశమనమే లభిస్తుంది. అయితే దీర్ఘకాలికంగా అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులను నియంత్రించడం, ఆదాయ మార్గాలను పెంచుకోవడం, ఇంకా రుణాల రీషెడ్యూల్ కోసం కేంద్రాన్ని మరింత ఒప్పించడం వంటి చర్యలు చేపట్టాలని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు.

**అధిక వడ్డీ రేట్లే సమస్య...** గత ప్రభుత్వం కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వంటి భారీ ప్రాజెక్టుల కోసం పీఎఫ్‌సీ, ఆర్ఈసీల నుండి రూ. వేల కోట్ల రుణాలు తీసుకుంది. ఈ రుణాలపై వడ్డీ రేట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. కొన్ని రుణాలపై వడ్డీ రేటు ఏకంగా 10.75% నుండి 11.25% వరకు ఉంది. ఈ అధిక వడ్డీ రేట్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెను భారాన్ని మోపుతున్నాయి. అందుకే, రాష్ట్ర ప్రభుత్వం ఈ అధిక వడ్డీ రుణాలను రీషెడ్యూల్ చేయడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు 2023 వరకు పదేళ్లలో పీఎఫ్?సీ రూ.1,10,000 కోట్లు, ఆర్?ఈసీ రూ.1,57,306 కోట్ల రుణాలను తెలంగాణకు ఆమోదించాయి. ఇందులో పీఎఫ్?సీ రూ.91,000 కోట్లు, ఆర్ఈసీ రూ.1,37,606 కోట్లు ఇప్పటికే విడుదల చేశాయి. ఇందులో కొంత మొత్తం చెల్లింపులు పూర్తి చేశారు. ఈ భారీ రుణాలపై వడ్డీ చెల్లింపులు తెలంగాణ బడ్జెట్‌లో పెద్ద వాటాను కైవసం చేసుకుంటున్నాయి. డిస్కంలకు గతంలో ఉదయ్ పథకం కింద ఆర్ఈసీ, పీఎఫ్‌సీలు వడ్డీ రేట్లను12% నుండి 9.95%కి తగ్గించడం వల్ల కూడా కొంత ఉపశమనం కలిగింది.

**రీషెడ్యూల్ అంటే..?...** రుణాల రీషెడ్యూల్ అంటే, తీసుకున్న అప్పు చెల్లింపు నిబంధనలను మార్చడం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు లేదా వడ్డీ రేట్ల తగ్గింపు కోసం రీషెడ్యూల్ చేసుకుంటుంది. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం రుణాలు ఇచ్చిన పీఎఫ్?సీ, ఆర్ఈసీ వంటి ఆర్థిక సంస్థలను సంప్రదిస్తుంది. రాష్ట్రం, ఆర్థిక సంస్థల మధ్య చర్చలు జరిగాక కొత్త నిబంధనలకు (తక్కువ వడ్డీ రేటు, ఎక్కువ చెల్లింపు వ్యవధి వంటివి) కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి వడ్డీ భారం తగ్గి, ఏటా వందల కోట్లు ఆదా అవుతాయి. తెలంగాణ సర్కారు కూడా రూ.10 వేల కోట్ల రుణాలకు ఇలాగే రీషెడ్యూల్ పొందింది.




యాదాద్రిభువనగిరి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రికి శనివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగియనుండటంతో స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. స్వామిని దర్శించుకునేందుకు క్యూ కాంప్లెక్స్‌లో బారులు తీరారు. ధర్మదర్శనానికి 3 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు సమయం పడుతోంది. కొండకింద ఆధ్యాత్మికవాడలోని పుష్కరిణి ప్రాంగణం, వాహనాల పార్కింగ్, వ్రత మండపము భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయంలో పలు ఆర్జిత పూజల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.




భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాదితో చేసుకున్న సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయాలని న్యూదిల్లీ నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. దీనిపై పాక్ నేతలు స్పందిస్తూ పలుమార్లు భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తాజాగా పాకిస్థాన్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి మాట్లాడుతూ భారత్‌పై ప్రేలాపనలు పేలారు.

పాక్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అహ్మద్ షరీఫ్ ప్రసంగిస్తూ..“భారత్ మాకు వచ్చే నీటిని అడ్డుకుంటే అక్కడి ప్రజల ఊపిరి ఆపేస్తాం. సింధూ నదిలో జలాలకు బదులుగా వారి రక్తం పారుతుంది” అని అన్నారు. ఆయన వ్యాఖ్యలను అఫ్గాన్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మరియం సోలైమాంఖిల్ తీవ్రంగా ఖండించారు. దేశానికి చెందిన ఓ సైనికాధికారి ఇలా మాట్లాడటం సరైన చర్య కాదని అన్నారు. లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ సింధూ నది గురించి మాట్లాడుతూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అన్నారు. “కశ్మీర్‌లో డ్యాం నిర్మించడం ద్వారా పాక్‌కు నీళ్లు ఆపేస్తామని మీరంటున్నారు. పాక్‌ను నాశనం చేయాలని, చైనా–పాకిస్థాన్ ఆర్థిక నడవా ప్రణాళికలను విఫలం చేయాలని కోరుకుంటున్నారు.

కానీ మీరు నీళ్లు ఆపేస్తే.. నదుల్లో మళ్లీ రక్తం పారుతుంది” అని అతడు అన్నాడని గుర్తు చేశారు. పాక్ అధికారులు అక్కడి ఉగ్రవాదుల స్క్రిప్ట్‌ను చదువుతున్నట్లు ఉందని పేర్కొన్నారు.

**పహల్గాం ఘటన.. మళ్లీ నోరు పారేసుకున్న పాక్ ప్రధాని!...** 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూదిల్లీ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. దీంతో పాక్ నేతలు భారత్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

పాక్ మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టో , పాక్ రక్షణ మంత్రి సైతం ఇటీవల ఈ విషయంలో భారత్‌పై నోరు పారేసుకున్నారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. గతంలో లష్కరే తయ్యిబా ఉగ్రవాది సైతం ఇవే వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

చురకలు



# ఇది పాన్ హైవే.. 30 వేల కిలోమీటర్ల..

## 14 దేశాలను కలిపే ప్రపంచంలోనే అతి పొడవైన రహదారి!



ప్రస్తుతం అంతా పాన్ ఇండియా సినిమాలు, పాన్ వరల్డ్ సినిమాలంటూ ఇప్పటి వరకు పెద్ద ఎత్తున చర్చ జరుగుతుందిగా.. అయితే వీటన్నింటికంటే డిఫరెంటుగా ఎప్పుడైనా పాన్ హైవే గురించి విన్నారా? లేకపోతే ఈ కథనాన్ని పూర్తిగా చదవండి. ఈ హైవే అమెరికాలో ఉంది. ఈ రోడ్డు మార్గం ఎంత పొడవుందో తెలుసా? ఏకంగా 30 వేల 600 కిలోమీటర్లు. అంటే దాదాపు 19 వేల మైళ్ళు. ఇది 14 దేశాలను కలుపుకుంటూ పోతుంది. అందుకే దీన్ని పాన్ అమెరికా హైవే అని పిలుస్తారు. ఈ స్పెషల్ రోడ్డు గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం. ప్రపంచవ్యాప్తంగా రోడ్లు, హైవేలు మనుషులను, ఊర్లని, సంస్కృతులను కలుపుతూ ఉంటాయి. ఒక దేశం బాగా డెవలప్ అవ్వాలంటే అక్కడి రోడ్డు వ్యవస్థ బాగుండాలి. అందుకే అమెరికాలో ప్రపంచంలోనే అతి పొడవైన రోడ్డు మార్గాన్నిఏర్పాటు చేశారు. దీంతో ఈ పాన్ అమెరికా హైవే రికార్డుల్లోకి ఎక్కింది.

**30 వేల 600 కిలోమీటర్ల పొడవు...** పాన్ అమెరికన్ హైవే అలాస్కాలో మొదలై అర్జెంటీనాలో ఎండ్ అవుతుంది. ఇది ఉత్తర అమెరికాను, దక్షిణ అమెరికాను కలుపుతుంది. ఈ రోడ్డు మార్గం దాదాపు 30,600 కిలోమీటర్ల దాకా ఉంది. ప్రపంచంలోనే అతి పొడవైన డ్రైవింగ్ చేసే రోడ్డుగా ఇది రికార్డు నెలకొల్పింది. కానీ ఒక చిన్న సమస్య ఏంటంటే.. పనామాకి, కొలంబియాకి మధ్యలో ఒక 100 కిలోమీటర్ల దట్టమైన అడవి ఉంది. దాని వల్ల ఈ రోడ్డు మొత్తం కనెక్ట్ కాలేదు. ఆ ప్లేస్‌లో వెళ్లాలంటే పడవలోనో, ఫ్లైట్‌లోనో వెళ్లాలి. పాన్–అమెరికన్ హైవే ఉత్తర, మధ్య, దక్షిణ అమెరికా ఖండాల్లో ఒకదానికొకటి కనెక్ట్ అయిన చాలా రోడ్ల సిస్టమ్. ఇది ప్రపంచంలోనే చాలా స్ట్రెయిట్‌గా ఉండే రోడ్లలో ఒకటి. పెద్దగా టర్నింగులు లేకుండా సూటిగా పోతుంది. ఈ రోడ్డు ఒక చివర నుంచి ఇంకో చివరకు వెళ్లాలంటే దాదాపు 60 రోజులు పడుతుంది. రోజుకు కనీసం 500 కిలోమీటర్లు డ్రైవ్ చేస్తే గమ్యానికి చేరుకోవచ్చు.

**14 దేశాలను కలుపుతూ...** పాన్ అమెరికా రోడ్డు ఏకంగా 14 దేశాలను కలుపుకుంటూ పోతుంది. అవేంటంటే కెనడా, అమెరికా, మెక్సికో, గ్వాటెమాల, ఎల్ సాల్వడార్, హోండురాస్, నికరాగ్వా, కోస్టా రికా, పనామా, కొలంబియా, ఈక్వెడార్, పెరూ, చిలీ, అర్జెంటీనా. ఇది జస్ట్ ఒక రోడ్డు మాత్రమే కాదు. ఈ రోడ్డు మీద ప్రయాణం చేస్తుంటే చాలా వింతలు, మంచి మంచి ప్రకృతి దృశ్యాలు, వేర్వేరు సంస్కృతులు, పాత చరిత్రలు తెలుసుకోవచ్చు. ఈ హైవే ఎడారులు, కొండలు, పెద్ద అడవులు, సముద్ర తీరాల లాంటి చాలా రకాల వాతావరణాలు ఉన్న ప్లేసుల గుండా వెళ్తుంది. ఈ రోడ్డు కట్టడం గురించి 1920లో మొదటిసారి చర్చలు జరిగాయి. తర్వాత 1937లో 14 దేశాలు పాన్ అమెరికన్ హైవే కన్వెన్షన్‌పై సంతకాలు చేశాయి. మొత్తానికి 1960లో ఈ రోడ్డు రెడీ అయి, వెహికల్స్ తిరగడానికి ఓపెన్ చేశారు. ఇప్పుడు ఈ రోడ్డు మీద ట్రాఫిక్ గట్రా ఏమీ లేకుండా హాయిగా వెళ్లొచ్చు. లాంగ్ డ్రైవ్‌లు అంటే ఇష్టం ఉన్నవాళ్లు ఈ రూట్‌లో వెళ్లడానికి చాలా ఇంట్రెస్ట్ చూపిస్తారు.

# 3 రోజులు.. 6 షరతులు.. హార్వర్డ్ వర్సిటీ పై ట్రంప్ షాకింగ్ నిర్ణయం!



హార్వర్డ్ యూనివర్శిటీ అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని నిషేధిస్తూ ట్రంప్ సర్కార్ ఓ షాకింగ్ నిర్ణయం తీసుకొంది. యూనివర్సిటీలో డిపార్ట్ మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ కొనసాగిస్తోన్న దర్యాప్తులో భాగంగా ఈ నిర్ణయమని తెలిపింది. దీంతో.. ఈ నిర్ణయం ఇక్కడ అడ్మిషన్స్ పొందిన భారతీయులతో సహా విదేశీ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. అవును... రెండోసారి ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ విదేశీ ఉద్యోగులతో పాటు అంతర్జాతీయ విద్యార్థులను టార్గెట్ చేసి పాలన సాగిస్తున్నారు ట్రంప్! ఇప్పటికే చదువుకుంటూ పార్ట్ టైమ్ జాబ్స్ చేసుకునే విదేశీయులైన మధ్యతరగతి విద్యార్థులను టార్గెట్ చేసి, బహిష్కరణ నిర్ణయాల వరకూ వెళ్లిన ట్రంప్.. తాజాగా హార్వర్డ్ యూనివర్సిటీ విషయంలో ఓ షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా.. ఈ వర్సిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేశారు! ఈ మేరకు హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టి నోయెమ్.. వర్సిటీకి లేఖ పంపారు. దీంతో... హార్వర్డ్స్ లో అడ్మిషన్స్ పొందిన భారతీయులు సహా, విదేశీ విద్యార్థులు మరో వర్సిటీకి బదిలీకావాల్సి ఉంటుంది. అలాకానిపక్షంలో.. అమెరికాలో చట్టపరమైన హోదా కోల్పోయే ప్రమాదం ఉంది.

**వేల మంది విద్యార్థులపై తీవ్ర ప్రభావం!:** అగ్రరాజ్యం అనే అహంకారంతో తీసుకున్నారా.. లేక, తీసుకుంటున్న ప్రతీ నిర్ణయానికీ 'అమెరికా ఫస్ట్' అనే ట్యాగ్ లైన్ తగిలిస్తూ తనను తాను స్థానికంగా సమర్థించుకునే ప్రక్రియలో భాగంగా ఈ ఆలోచన చేశారా అనే సంగతి అలా ఉంచితే... ట్రంప్ సర్కార్ తాజా నిర్ణయంతో వేలాది మంది విదేశీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. ప్రస్తుత ఏడాది హార్వర్డ్స్ లో 6,800 మంది విదేశీ విద్యార్థులు నమోదు చేసుకున్నారు. అంటే.. యూనివర్శిటీలోని మొత్తం విద్యార్థుల్లో ఈ సంఖ్య 27%. వీరిలో ఎక్కువమంది గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ ఉన్నారు.

ఇక వీరిలో భారతీయ విద్యార్థుల సంఖ్య 788 అని హార్వర్డ్స్ వెబ్ సైట్ ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో.. ట్రంప్ తాజా నిర్ణయంతో వీరి భవితవ్యం గందరగోళంలో పడింది! అంటే.. ఈ సెమిస్టర్ తో డిగ్రీలు పూర్తి చేసిన విదేశీ విద్యార్థులు గ్రాడ్యుయేట్ గా బయటకు రావాల్సి ఉండటంతో పాటు... చదువు మధ్యలో ఉన్నవారు అయితే తప్పనిసరిగా మరో ఇనిస్టిట్యూట్ కు మారాల్సి ఉంటుంది. లేదంటే.. ట్రంప్ రూల్స్ ప్రకారం వారు అమెరికాలో చట్టపరమైన హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది!

**3 రోజులు.. 6 షరతులు:** తాజాగా హార్వర్డ్స్ కు డిపార్ట్ మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ రాసిన లేఖలో.. ఈ హోదాను పునరుద్ధరించుకునేందుకు ఓ అవకాశం కల్పించారు! దీనికోసం 72 గంటల వ్యవధిలో అడిగిన సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు. అవేమిటనేవి ఇప్పుడు చూద్దామ్..! గత ఐదేళ్లలో హార్వర్డ్స్ లో చదువుతున్న విద్యార్థుల్లో క్యాంపస్ లోపల.. లేదా, వెలుపల జరిపిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులు సమర్పించాలి. గత ఐదేళ్లలో నాన్ ఇమిగ్రెంట్ స్టూడెంట్స్ పాల్పడిన హింసాత్మక చర్యలకు సంబంధించిన రికార్డులను అందించాలి. ఇదే సమయంలో... ఇతర విద్యార్థులు లేదా యూనివర్సిటీ సిబ్బందిని ఎవరైనా నాన్ ఇమిగ్రెంట్ స్టూడెంట్స్ బెదిరించి ఉంటే.. ఆ వివరాలు ఇవ్వాలి. వలసేతర విద్యార్థులు క్యాంపస్ లో కానీ బయట కానీ ఇతర హక్కులను హరించిన ఘటనలు చోటు చేసుకుంటే ఆ రికార్డులూ అందించాలి. గత ఐదేళ్లలో ఈ యూనివర్సిటీలోని వలసేతర విద్యార్థుల క్రమశిక్షణ రికార్డులను సమర్పించాలి. హార్వర్డ్స్ లోని వలసేతర విద్యార్థులు ఏదైనా ఆందోళనల్లో పాల్గొంటే.. ఆ ఆడియో, వీడియో ఫుటేజ్ లను ప్రభుత్వానికి సమర్పించాలి.

**స్పందించిన యూనివర్సిటీ!:** ట్రంప్ సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంపై యూనివర్సిటీ స్పందించింది. ఇది ప్రభుత్వం తీసుకున్న చట్టవిరుద్ధ చర్య అని అభివర్ణించింది.

140 కంటే ఎక్కువ దేశాల నుంచి వచ్చిన అంతర్జాతీయ విద్యార్థులు, ప్రొఫెసర్లకు ఆతిథ్యం ఇచ్చే హార్వర్డ్స్ సామర్థ్యాన్ని కొనసాగించడానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని.. యూనివర్సిటీని అపరిమితంగా సుసంపన్నం చేస్తామని ఓ ప్రకటనలో తెలిపింది.

# హైదరాబాద్ ఫ్యాన్స్‌కు షాక్..

## స్విగ్గీ అవార్డ్స్‌లో బెస్ట్ బిర్యానీ ఎవరిదో తెలిస్తే ఆశ్చర్యపోతారు!

ఏళ్ల తరబడి సాగుతున్న బిర్యానీ పంచాయితీకి స్విగ్గీ ఫుల్‌స్టాప్ పెట్టేసింది. ఇండియాలో అసలు సిసలైన బిర్యానీ ఏది? హైదరాబాద్ బిర్యానీనా? లేక కోల్‌కతానా ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే ఫుడ్ లవర్స్‌కు స్విగ్గీ రెస్టారెంట్ అవార్డ్స్ 2025 ఒక కొత్త విజేతను పరిచయం చేసింది. దేశవ్యాప్తంగా జరిగిన భారీ ఓటింగ్‌లో ఢిల్లీకి చెందిన బిక్కగణే బిర్యానీ 'బెస్ట్ బిర్యానీ'గా అవతరించింది. ఏకంగా 60 లక్షల మంది ఫుడ్ లవర్స్ తమ ఓటు వేసి మరీ ఈ బిర్యానీని గెలిపించారు. స్విగ్గీ రెస్టారెంట్ అవార్డ్స్ అంటే కేవలం టేస్ట్ మాత్రమే కాదు.. క్వాలిటీ, కస్టమర్ల సంతృప్తి వంటి ఎన్నో అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డులు ఇస్తారు. డెలివరీ అయినా, డైనింగ్ అయినా సరే.. ప్రతిసారీ ఒకే రుచిని అందిస్తూ అందరినీ మెప్పించిన రెస్టారెంట్లకు ఈ గౌరవం దక్కింది.

**బిర్యానీతో పాటు ఇతర కేటగిరీల్లో విజేతలు వీరే...** స్విగ్గీ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలు ఎక్కువగా ఇష్టపడే ఇతర రుచులు కూడా కొన్ని వెల్లడయ్యాయి. నార్త్ ఇండియన్ వంటకాల్లో చుల్హా చౌకీ దా డాబా, సౌత్ ఇండియన్‌లో A2B – అడయార్ ఆనంద భవన్, ఫాస్ట్ ఫుడ్‌లో డొమినోస్ పిజ్జా (పిజ్జా), మెక్‌డొనాల్డ్స్ (బర్గర్), చైనీస్‌లో చౌమాన్, డెజర్ట్స్‌లో థియోబ్రోమా టాప్‌లో నిలిచాయి. ఇక ఫాస్ట్ డెలివరీకి



%ఖఖీజ%, బెస్ట్ ఐస్ క్రీమ్‌కు బాస్కిన్ రాబిన్స్ అవార్డులు గెలుచుకున్నాయి. డైనింగ్ విషయానికొస్తే.. బెస్ట్ కేఫ్‌గా రోస్టరీ కాఫీ హౌస్, రొమాంటిక్ ప్లేస్‌గా మైకోస్ క్రాఫ్ట్ కిచెన్ అండ్ బార్, ఔట్‌డోర్ డైనింగ్‌కు టిక్ టిక్, బార్స్ అండ్ లాంజ్‌లో వేర్‌హౌస్ బార్ అండ్ కిచెన్, ప్యూర్ వెజ్‌లో తాన్–సుఖ్ బై కన్వా, ఇన్‌స్టాగ్రామ్ ఫేవరెట్‌గా జుగ్ను నిలిచాయి. నార్త్ ఇండియన్ డైనింగ్‌లో శాండోజ్, బఫేలో బార్బెక్యూ నేషన్, సౌత్ ఇండియన్ డైనింగ్‌లో దోసక – టేస్ట్ ఆఫ్ సౌత్ బెస్ట్ అనిపించుకున్నాయి.

**నగరాల వారీగా ఫేవరెట్స్..** స్విగ్గీ కేవలం జాతీయ స్థాయిలోనే కాకుండా నగరాల వారీగా కూడా ప్రజల అభిమాన రుచులను గుర్తించింది. బెంగళూరులో ట్రఫల్స్, నందన ప్యాలెస్, నమస్తే డెలివరీలోనూ, BLR బ్రూయింగ్ కో, ఐరన్‌హిల్ డైనింగ్‌లోనూ టాప్. హైదరాబాద్‌లో బిర్యానీకి పిస్తా హౌస్, బఫేలకు ఫ్లెచాజో ఫేవరెట్‌గా నిలిచాయి. ముంబైలో మెరాకి, జిమిస్ బర్గర్, చేతక్ స్వీట్ పాయింట్ డెలివరీలోనూ, ముల్క్, క్రీమ్ సెంటర్ డైనింగ్‌లోనూ బెస్ట్. చెన్నైలో నందన ప్యాలెస్, A2B డెలివరీలోనూ, పామ్‌షోర్, ది లివింగ్ రూమ్ డైనింగ్‌లోనూ టాప్ ప్లేస్‌లో ఉన్నాయి. ఢిల్లీలో బల్లోచ్, పెంట్‌హౌస్ డ్యూటీ ఫ్రీ డైనింగ్ లిస్ట్‌లో ఉన్నాయి.

# షాదీ డాట్ కామ్ స్కామ్..

## విచారణలో షాకిచ్చే నిజాలు!

పెళ్లి కాని బ్యాచిలర్ల అవసరాన్ని ఆసరాగా చేసుకుని పెళ్లిళ్లు జరిపించేందుకు చాలా వెబ్ సైట్లు పుట్టుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆన్ లైన్ లో ప్రొఫైల్స్ వెతుక్కుని పెళ్లాడే వారికి కొన్ని ఫేక్ ప్రొఫైల్స్ తో ముప్పు తిప్పలు తప్పడం లేదు. కొందరు ప్రముఖులు ఆన్ లైన్ ఫేక్ ప్రొఫైల్స్ కారణంగా భారీగా డబ్బును కోల్పోతున్న ఘటనలు బయటపడుతున్నాయి. అలాంటి ఒక స్కామ్ గురించి ఇప్పుడు ఏపీ, తెలంగాణలో విస్తృతంగా చర్చ సాగుతోంది. నకిలీ ప్రొఫైల్ స్కామ్ లో ఇటీవల తెలంగాణ హై కోర్టు షాదీ డాట్ కామ్ కి తాఖీదులు జారీ చేసింది. ఈ కేసులో జూబ్లీహిల్స్ కి చెందిన ప్రముఖ మహిళా డాక్టర్ తాను ఫేక్ ప్రొఫైల్ కారణంగా మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేసారు. వంశీ కృష్ణ అనే వ్యక్తి ఏపీలోని యానాంకు చెందిన ఒక ఎమ్మెల్యే ఫోటోను ఉపయోగించుకుని తాను విదేశాల్లో ఉన్న డాక్టర్ కొడుకుని అని ప్రొఫైల్ క్రియేట్ చేసాడు. తాను రాజమండ్రికి చెందిన చెరుకూరి హర్షగా మహిళా డాక్టర్ కు పరిచయం చేసుకున్నాడు. అటుపై వధువు అతడిని పూర్తిగా నమ్మాక, తనకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయని 11లక్షలు వసూలు చేసాడు.




అయితే కొంత కాలానికి మహిళా డాక్టర్ తన డబ్బు తనకు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేయడంతో అసలు భండారం బట్టబయలైంది. అతడు బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. మహిళా డాక్టర్ ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆన్ లైన్ లో పోస్ట్ చేస్తానని, మరో 10లక్షలు చెల్లించాలని అదనంగా బెదిరించాడు. అయితే ఈ కేసును సీరియస్ గా తీసుకున్న జూబ్లీ పోలీసులు ఇటీవల నకిలీ వరుడు హర్ష అలియాస్ జోగడ వంశీకృష్ణను మార్చిలో పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజా పరిణామంలో షాదీ డాట్ కామ్ తమ ప్రతినిధులపై నమోదైన ఎఫ్.ఐ.ఆర్ ను రద్దు చేయాల్సిందిగా కోర్టులో ప్రయత్నించగా, దీనికి కోర్టు నిరాకరించింది. ఇరువైపులా వాదనల్లో షాదీ డాట్ కామ్ లొసుగుల్ని ప్రత్యర్థి అడ్వొకేట్ బయటపెట్టారు. పోలీసులు తమ విచారణలో మ్యాట్రిమోనియల్ వెబ్ సైట్ ఎలాంటి వెరిఫికేషన్ లేకుండానే ఫేక్ ప్రొఫైల్స్ ని అప్ లోడ్ చేస్తున్నాయని కనుగొన్నారు. చీటింగ్ కేసులో ప్రస్తుతం షాదీ డాట్ కామ్ యజమానులు సహా ఎగ్జిక్యూటివ్ లపై విచారణ కొనసాగుతోంది. తాజా కేసును పరిశీలించాక యువతరం పెళ్లిళ్ల వెబ్ సైట్ల వ్యవహారంలో జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

# ఇదీ భారత్ అంటే.. ఒకే వేదికపై

## హిందూ – ముస్లిం జంట పెళ్లి వేడుక

అవును.. మీరు చదివే ఈ ఉదంతం ఏ కొత్త సినిమాలోని సన్నివేశం కాదు. అలా ఎందుకు చెబుతున్నారు? అని మీరు అడగొచ్చు. అందులో తప్పేం లేదు. ఎందుకంటే.. ఇలాంటి ఘటనలు జరుగుతాయా? అన్న సందేహం రావొచ్చు. కానీ.. భారతదేశంలో హిందూ – ముస్లింల మధ్య ఉన్న అద్భుతమైన మత సామరస్యానికి ఇదో ఉదాహరణగా చెప్పాలి. అసలు విషయంలోకి వెళితే.. పూణెలోని వాన్ వాడీ ప్రాంతంలో ఉన్న అలంకారణ్ లాన్స్ లో రెండు వివాహ వేదికలు ఉన్నాయి. తాజాగా ఓపెన్ గ్రౌండ్ లో హిందూ మతానికి చెందిన కొత్త జంట పెళ్లి వేడుక జరుగుతోంది. ఇదే ప్రాంగణంలోని బ్యాంకెట్ హాల్ లో ముస్లిం జంట రిసెప్షన్ జరుగుతోంది. ఓపెన్ గ్రౌండ్ లో పెళ్లి వేడుకకు అన్ని సిద్ధం చేయగా.. సరిగ్గా ముహూర్తం వేళకు కాస్త ముందుగా భారీ వాన మొదలైంది. దీంతో అక్కడ ఉన్న వారికి ఏం చేయాలో తోచని పరిస్థితి. కాసేపు వెయిట్ చేసిన తర్వాత పెళ్లి వేడుక చేద్దామని భావించినా.. వర్షం మాత్రం ఆగని పరిస్థితి. ఇలాంటి వేళ.. తమ పెళ్లిని బ్యాంకెట్ హాల్ లో చేసుకునేందుకు అనుమతి ఇవ్వమని హిందూ జంట కుటుంబ సభ్యులు ముస్లిం జంట ఫ్యామిలీని కోరగా వారు సానుకూలంగా స్పందించారు. రిసెప్షన్



జరుగుతున్న వేదికను ఖాళీ చేసి ఇవ్వటమే కాదు.. హిందూ జంట పెళ్లి వేడుకకు అవసరమైన ఏర్పాట్లకు సాయం చేశారు. దీంతో.. రెండు కుటుంబాల వారి వివాహ వేడుకలు అనుకున్న సమయానికి అనుకున్నట్లుగా సంప్రదాయాల ప్రకారం పూర్తయ్యాయి. ఇక్కడే మరో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఇరు కుటుంబాలు కలిసి విందును అస్వాదించటంతో పాటు.. కొత్త జంటలు కూడా ఒకే స్టేజ్ మీద కలిసి ఫోటోలు దిగారు. ఈ సన్నివేశాన్ని చూసిన రెండు కుటుంబాలు మాత్రమే కాదు.. రెండు పెళ్లిళ్లకు వచ్చిన బంధువులు.. స్నేహితులు సైతం సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒకే పెళ్లి మండపం మీద.. అప్పటివరకు ఏ మాత్రం పరిచయం లేని హిందూ – ముస్లిం కుటుంబాలు కలిసి పెళ్లి చేసుకునేలా అడ్జెస్టు కావటమే కాదు.. వేర్వేరు పెళ్లి వేడుకల్ని ఒకే టైంలో పూర్తి చేయటం చూస్తే.. ఇలాంటివి భారత్ లో మాత్రమే జరుగుతాయని చెప్పకతప్పదు. మతసామరస్యానికి నిలువెత్తు రూపంగా ఈ పెళ్లి వేడుకను చెప్పకతప్పదు. వీలైతే.. ఈ రెండు జంటల్ని.. కుటుంబాల్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి పిలిపించుకొని అభినందించాల్సిన అవసరం ఉంది. వీలైతే..ప్రధాని మోడీ తన మన్ కీ బాత్ లో ప్రస్తావించేందుకు అర్హత ఉన్న అంశంగా దీన్ని చెప్పొచ్చు. మరేం జరుగుతుందో చూడాలి.

# బెడిసి కొట్టిన రోజా ప్రచారం..

## టీటీడీ ఘాటు కామెంట్లు!

వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా.. తనను తాను గొప్పగా ప్రచారం చేసుకునే ప్రయత్నంలో భారీ ఎదురు దెబ్బ తగిలింది. ముఖ్యంగా రెండు రకాల వ్యూహాలతో రోజా చేసుకున్న ప్రచారానికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఘాటుగా బుద్ధి చెప్పారు. రోజా రాజకీయంగా యాక్టివ్‌గా ఉంటున్న విషయం తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం పోయినా.. ఆమె దూకుడు మాత్రం తగ్గలేదు. రాజకీయాలు చేయొచ్చు. కానీ, వాటిని కూటమి ప్రభుత్వానికి సెగ పెట్టేలా చేయాలని అనుకోవడంలోనే రోజా మైనస్ అవుతున్నారు. తాజాగా ఆమె తిరుమల పర్యటనకు వచ్చారు. శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత.. ఆమెకు ఆలయ అధికారులు శ్రీవారి ప్రసాదాలను, శేష వస్త్రాన్ని కూడా అందించారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఇదీ.. జరిగింది. అయితే.. దీనిపై రోజా ప్రచారం వేరేగా ఉంది. తాను తిరుమలకు వెళ్తే.. నేరుగా.. ఆలయన డిప్యూటీ ఈవో వెంకయ్య చౌదరి ఆహ్వానం పలికి.. తనకు ప్రసాదాలు అందించారని.. తమ ప్రభుత్వం మారినా..



తిరుమలకు తాము చేసిన సేవలకు... తమ హవా ఏమాత్రం తగ్గలేదన్నట్టుగా రోజా కొన్ని ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తద్వారా కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పడేలా చేయాలని వ్యూహం పన్నారు. కానీ, దీనిపై టీటీడీ అధి కారులు ఘాటుగా స్పందించారు. రోజాకు ఎలాంటి ప్రొటోకాల్ దర్శనం ఇవ్వలేదని.. ఆమె నేరుగా సేవా టికెట్లు కొనుగోలు చేసి అందరిలాగానే లైన్‌లో వచ్చి స్వామిని దర్శించుకున్నారని చెప్పారు. దీనికి సంబంధించిన ఓ టికెట్‌ను కూడా వారు పోస్టు చేశారు. అంతేకాదు.. రోజా చెబుతున్నట్టుగా.. వెంకయ్య చౌదరి వెళ్లి.. ఆమెకు ప్రసాదాలు అందించలేదని.. ఆ స్థానంలో ఆలయ పత్తేదార్(సెక్రటరీ) తీర్థ ప్రసాదాలు అందించారని ఫొటోలతో పాటు వివరించారు. సో.. దీంతో రోజా చేసుకున్న వ్యక్తిగత ప్రచారం బెడిసి కొట్టింది. అంతేకాదు.. ఎవరు సేవా టికెట్లు కొనుగోలు చేసి వచ్చినా.. వారికి ఇదే విధంగా దర్శనం లభిస్తుందని.. తీర్థ ప్రసాదాలు కూడా అందుతాయని అధికారులు స్పష్టం చేశారు. దీనిలో రోజాకు ప్రత్యేకత ఏమీ లేదని చెప్పారు. దీంతో రోజాకు శృంగ భంగం అయింది.

చురకలు

## సంపాదకీయం

### ఏపీ, తెలంగాణ ముందు పాక్ ఎంత..

# వారి 'లెక్క' ఎంత?

1958 నుంచి అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) దగ్గర ఇప్పటివరకూ సుమారు 25 సార్లు ఆర్థిక సహాయం పొంది.. తాజాగా ఈ ఏడాది 1.02 బిలియన్ డాలర్లు పొంది.. అప్పులతో నెట్టుకొస్తోన్న పాక్ ఆర్థిక పరిస్థితి గురించి ఓ ఆసక్తికర విషయం చర్చకొచ్చింది. 2023-24 మధ్య ఉమ్మడి ఏపీ జీఎస్డీపీతో పోలిస్తే పాక్ జీడీపీ చాలా తక్కువ కావడం గమనార్హం! అవును... 2014-15 రాష్ట్ర విభజన నాటికి తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లు కాగా.. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి ఆ రాష్ట్ర జీఎస్డీపీ రూ.15.2 లక్షల కోట్లు (సుమారు 180 బిలియన్ డాలర్లు). అంటే.. సుమారు దశాబ్ధంలో దాదాపు 197% వృద్ధిని సాధించింది! ఇదే క్రమంలో... 2014-15 రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లు కాగా.. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి ఆ రాష్ట్ర జీఎస్డీపీ రూ. 15.4 లక్షల కోట్లు (సుమారు 180 బిలియన్ డాలర్లు). అంటే.. సుమారు దశాబ్ధంలో దాదాపు 197% కంటే వృద్ధిని సాధించింది! ఆ సంగతి అలా ఉంటే... ప్రపంచ బ్యాంక్ డేటా ప్రకారం 2023 సంవత్సరానికి పాకిస్థాన్ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) 338.37 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. ఇదే జీడీపీ 2022 లో సుమారు 368.82 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే.. 2022తో పోలిస్తే 2023లో 9.7% తగ్గిందన్నమాట! అంటే... పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు సుమారు 338 బిలియన్ డాలర్లుగా ఉండగా.. రెండు తెలుగు రాష్ట్రాల (ఉమ్మడి ఏపీ) జీఎస్డీపీ 360 బిలియన్ డాలర్లుగా ఉందన్నమాట. అంటే.. రెండు తెలుగు రాష్ట్రాల జీఎస్డీపీ కంటే పాకిస్థాన్ దేశం మొత్తం జీడీపీ తక్కువగా ఉంది. కాకపోతే పాక్ జనాభా మాత్రం సుమారు 24.7 కోట్లు కావడం గమనార్హం. ఇదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని జనాభా మొత్తం సుమారు 9.3 (దాదాపు ఏపీ 5.3 కోట్లు, తెలంగాణ 4 కోట్లు) అనుకుంటే.. ఇక్కడ తలసరి ఆదాయం 3,000 డాలర్లుగా ఉండగా.. పాకిస్థాన్ లో 1,616 డాలర్లుగా మాత్రమే ఉంది. ఇదే సమయంలో... భారతదేశ ఆర్థిక రాజధాని ముంబై నగరం ఉన్న మహారాష్ట్ర విషయానికొస్తే పాకిస్థాన్ చాలా వెనుకబడి ఉండటం గమనార్హం. ఇందులో భాగంగా... ప్రస్తుతం పాకిస్థాన్ జీడీపీ 338 బిలియన్ డాలర్లుగా ఉండగా.. మహారాష్ట్ర జీఎస్డీపీ 490 బిలియన్లుగా ఉంది. అంటే.. పాక్ జీడీపీ మహారాష్ట్ర జీఎస్డీపీలో 69% మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తోంది.


# ప్రకృతి వైపరీత్యాల పట్ల అవగాహన అవసరం



ప్రపంచ వ్యాప్తంగా అనేకానేక దేశాల్లో ప్రకృతి విపత్తులు విరుచుకు పడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఈ సందర్భంగా ప్రకృతి వైపరీత్యాల గురించి అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరం. సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలే విపత్తులు. విపత్తు అనే పదాన్ని ఇంగ్లిష్‌లో "డిజాస్టర్" అంటారు. ఇది మధ్యయుగం నాటి ఫ్రెంచి పదం. దీన్ని మూడు భాషా పదజాలల నుంచి గ్రహించారు. అవి..1) డస్, ఆస్టర్ అనే గ్రీకు పదాలు. 2) డెస్, ఆస్ట్రే అనే ఫ్రెంచ్ పదాలు. 3) డిస్, ఆస్ట్రో అనే లాటిన్ పదాలు గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే 'దుష్ట నక్షత్రం' అని అర్థం. అలానే విపత్తు అనే పదాన్ని ఇంగ్లీషులో డిసాస్టర్ అంటారు. విపత్తు ఒక భయంకర పరిస్థితి. దీంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. పర్యావరణ స్థితి విచ్ఛిన్నం అవుతుంది. భూమి కంపించడం వలన జరిగే వైపరీత్యాలు, జల వైపరీత్యాలు, వడగాలి, అగ్ని, మహమ్మారులు, అంతరిక్షం ప్రభావాల సంఘటనలు , సౌర జ్వాలలు తదితరాల ప్రభావం మానవ జీవితంపై అధికంగా ఉంది. విపత్తుల వల్ల 1) వరదలు - 30 శాతంబీ 2) తుపానులు - 21 శాతంబీ 3) కరవు- 19 శాతంబీ 4) మహమ్మారి వ్యాధులు - 15 శాతంబీ 5) భూకంపాలు, సునామీలు - 8 శాతంబీ 6) భూతాపాలు - 4 శాతం 7) హిమపాతాలు - 11 శాతంబీ 8) అగ్ని పర్వతాలు - 1 శాతంబీ 9) కీటక దాడులు - 1 శాతంబీ నష్టాలు సంభవిస్తున్నాయి. డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్టుల ప్రకారం దేశంలోని 29 రాష్ట్రాలు ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏదో ఒక విపత్తుకు తరచు గురవు తున్నాయి. దేశంలోని తీర ప్రాంతాలు విశిష్టమైన ప్రకృతి వనరులు, జీవ వైవిధ్యానికి ప్రతీకలు. దేశ ఆర్థిక పరిపుష్టి లో విశేషమైన పాత్ర ఇవి పోషిస్తున్నాయి.13 రాష్ట్రాల్లోని 84 జిల్లాలు, అండమాన్, లక్షద్వీప్ కేంద్రపాలిత రాష్ట్రాల్లో 7,500 కిలోమీటర్లలో సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. వీటిల్లో గుజరాత్ (1,214 కి.మీ.) ఆంధ్రప్రదేశ్ లో (7 కి.మీ.) రాష్ట్రాల్లో అధికంగా తీరప్రాంతం ఉంది. అడవులు, చిత్తడి నేలలు, పగడపు దిబ్బలు, ఉప్పునీటి కయ్యలు, ఇసుక నేలలు వంటి జీవ వైవిధ్యం తీరప్రాంతాల్లో ఉంటాయి. తీరంలోని యాభై కిలోమీటర్ల లోపు రమారమి ముప్పై కోట్ల మేర జనాభా నివసిస్తుంది. పర్యావరణ సమ తుల్యత లోపించడం వాతావరణంలో పెనుమార్పులు విపత్తులకు మూలకారణం పెరుగుతున్న జనాభా, నగరీకరణ, తీర నియంత్రణ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలు, పరిశ్రమలు, ఓడరేవుల విస్తరణ తీరంలోని జీవ వైవిధ్యానికి చేటు తెస్తూ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం.. భారత దేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. 'ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్' రిపోర్ట్ ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి ద్వారా సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీటి ప్రభావానికి గురయ్యారు. సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ఇవి ఇప్పటి వరకు భారత దేశంలో, ప్రపంచంలోనూ ఎక్కువసార్లు సంభవించిన విపత్తు 'వరదలు'గా ఆ నివేదిక పేర్కొంది. ప్రకృతి విపత్తులకు భారత్ అంతులేని మూల్యాన్ని చెల్లిస్తోందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక కుండ బద్దలు కొట్టింది. 20 ఏళ్లలో విపత్తుల కారణంగా దేశం 7,950 కోట్ల డాలర్లు (సుమారు రూ.5.91 లక్షల కోట్లు) నష్టపోయింది. ఆర్థిక నష్టాలు, పేదరికం, విపత్తుల పేరిట 2017 ఆగస్టులో విడుదలైన నివేదికలో వివిధ, దేశాలు నష్టపోయిన మొత్తం విలువ 2.9 లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. అంతకుముందు 20 ఏళ్ల వ్యవధి నష్టాల కంటే ఇది రెట్టింపు. ప్రపంచంలో విపత్తుల వల్ల నష్ట పోతున్న వారి సంఖ్య 211 మిలియన్లు. విపత్తుల వల్ల భారత్ లో ఏటా 10 బిలియన్ల డాలర్ల నష్టం నష్టం జరుగుతోంది. మన దేశంలో భూమి వరదలకు 12శాతం ( 8శాతం) గురవుతోంది. ప్రకృతి వైపరీత్యాలైన తుపానులు, వరదల్లో మృతి చెందేవారికి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ఇస్తోంది. ప్రకృతి విపత్తులు, బీమా రంగం తన పాత్రను ఎక్కువగా నిర్వర్తిస్తూ వస్తూంది. ఈ రంగం, కొన్ని నష్టాలను పూడ్చుటకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తుంది. హారికేన్లు, దావాలనాలు, ఇతర విపత్తులు సంభవించి నపుడు ఈ బీమా రంగం సాయం అందిస్తున్నది. పర్యావరణ పరిరక్షణ చట్టం(1986)కు అనుబంధంగా తీరప్రాంత నియంత్రణ నిబంధనల పేరిట కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్ జెడ్) నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 1991లో అమలులోకి తీసుకొచ్చింది. కొన్ని వర్గాల కార్యకలాపాలకు అడ్డుగా ఉన్న ఈ నిబంధనలను అమలు చేయడంలో ప్రభుత్వ వ్యవస్థ విఫలమయింది. విదేశీ నౌకా నియంత్రణ, పర్యా వరణ పరిరక్షణ, ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక చట్టాలు తీరప్రాంత పరిరక్షణతో ముడివడి ఉన్నాయి. 1991 నాటి నిబంధనల్లో తీరాన్ని మూడు విభాగాలు(సీఆర్ జెడ్-1,2,3)గా విభజించారు. ఆయా ప్రాంతాల్లో వివిధ నిర్మాణాలు చేపట్టడానికి నియంత్రణలు విధించాలి. అయితే పలు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ఇవి అడ్డుగా ఉన్నాయన్న ఉద్దేశంతో నిబంధనల్లో సవరణలు తీసుకొచ్చారు తప్పితే, నోటిఫికేషన్ లక్ష్యాలకు అనుగుణంగా నియమాలు అమలు చేసిన దాఖలాలు తక్కువ. సీఆర్జెడ్ నిబంధనలను 1991 మధ్య కాలంలో 12సార్లు సవరించి వివిధ అభివృద్ధి కార్యక్రమాల విస్తరణకు అనుమతించారు. ఈ నోటిఫికేషన్ అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదే. అయితే నిబంధనల అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నియంత్రించి ప్రకృతి వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అభివృద్ధి పనుల పేరిట మడ అడవులు, హరితవనాలను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విపత్తుల యాజమాన్య ప్రణాళికల అమలు మొక్కుబడిగా మారాయి. 2011 నుంచి కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మించ తలపెట్టిన బహుళ ప్రయోజక దశాబ్దాల క్రితంనాటి తుపాను షెల్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రకృతి వైపరీత్యాల నివారణకై, ప్రణాళికలను బడ్జెట్లో ప్రత్యేకంగా పొందు పరచాల్సిన అవసరం ఉంది. నష్టం అంచనాలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగ స్వాములను చేయాలి. ప్రకృతి వ్యవస్థలకు హాని కలగకుండా, గొలుసుకట్టు హరిత వనాల పెంపకానికి, మడ అడవుల పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ వనీకరణ నిధులను సమకూర్చాలి. వైపరీత్యాలకు దారి తీయకుండా తీరప్రాంత వనరుల వినియోగం జరిగేలా చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేయాలి. క్షేత్రస్థాయి నుంచి పైదాకా ప్రభుత్వ వ్యవస్థల స్పందన బట్టి బాధిత ప్రజలకు భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కోగలమనే ధైర్యం కలిగించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# మసక బారుతున్న కౌటుంబిక సంబంధాలు



భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. ఆ వ్యవస్థ మూలాలే నేడు ఆధారాలను కోల్పోతున్నాయి. రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు, సమైక్యత, సంఘటిత సమిష్టి జీవన విధానం గురించి ఈ కాలంలో పట్టింపులు లేకుండా పోతున్నాయి. కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందుపరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లింది. మనదేశంలో ఉమ్మడి కుటుంబాలు సిరిసంపదలతో తూలతూగాయనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండే వంటే ముచ్చటేస్తుంది. తల్లిదండ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు ఆప్యాయతలు ప్రేమానురాగాలకు నిలయాలు. పిల్లలు చిన్నవయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉద్భవిస్తున్నాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించి నప్పటికీ వంశవృక్షపు వేళ్లు మాత్రం మొదటి కుటుంబం వద్దే ఊనుకుని ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్‌లోనో, మొబైల్‌లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీద తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం చిక్కడం లేదంటే మన కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరునాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం. కుటుంబ దౌర్జన్యం చట్టం 498-ఎ ను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉంటుందని విజ్ఞులు, అనుభవజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# థైరాయిడ్ రుగ్మతలతో 42 మిలియన్ల భారతీయులు - మే 25.. 'ప్రపంచ థైరాయిడ్ దినం'




25 మే 1965న ఏర్పడిన 'యూరోపియన్ థైరాయిడ్ అసోసియేషన్'కు గుర్తుగా ప్రతి ఏటా 25 మే రోజున 'ప్రపంచ థైరాయిడ్ దినం' నిర్వహిస్తూ, థైరాయిడ్ రుగ్మతలకు గల కారణాలను, నివారణ మార్గాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరుగుతున్నది. 25 నుంచి 31 మే వరకు ప్రతి ఏట 'అంతర్జాతీయ థైరాయిడ్ అవగాహన వారం' కూడా నిర్వహించడం అనవాయితీగా మారింది. 25 మే 2008 నుండి ప్రారంభమైన ప్రపంచ థైరాయిడ్ దినం వేదికగా థైరాయిడ్ రుగ్మతలు, జాగ్రత్తల పట్ల ప్రజల్లో అవగాహన కోసం ప్రసార మాధ్యమాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమ వేదికలు, సభలు, సమావేశాలు, చర్చలు, విద్యాలయాల్లో పోటీలు లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. సీతాకోక చిలుక ఆకారంలో ఉన్న థైరాయిడ్ వినాళ గ్రంథి మానవ మెడ కింది భాగంలో ఉంటుంది. ఎండోక్రైన్ వ్యవస్థలో భాగమైన థైరాయిడ్ గ్రంథిలో రెండు రెక్కల్లాంటి ఆకారాలను 'లోచ్చి అని, వాటిని కలిపే కణజాలాన్ని 'థైరాయిడ్ ఇస్తుమన్' అని అంటారు. శరీరంలో జరిగే జీవక్రియలను నియంత్రించే 64 (థైరాక్సిన్), టి3 (ట్రై అయొడోథైరోనిన్) మరియు పెప్టైడ్ హార్మోన్ అనబడే కాల్సిటోనిన్ హార్మోన్లను స్రవిస్తుంది. థైరాయిడ్ హార్మోన్లతో సక్రమ జీవ క్రియ రేటు, గుండె పనితనం, మహిళల్లో రుతు చక్ర నియంత్రణ, కండర మరియు జీర్ణ క్రియ విధులు, మెదడు అభివృద్ధి, ఎముకల పటిష్టత, ప్రోటీన్ సంశ్లేషణం, పిల్లల శారీరక అభివృద్ధి లాంటి ముఖ్య విధులను నిర్వహిస్తాయి. మెదడు కింది భాగాన ఉన్న పిట్యూటరీ గ్లాండ్ స్రవించే క్రియాశీలత ఆధారపడి ఉంటుంది. థైరాయిడ్ హార్మోన్లు అవసరం కన్న అధికంగా లేదా తక్కువగా స్రవించడం వల్ల పలు రుగ్మతలు కలుగుతాయి. అయోడిన్ లోపంతో థైరాయిడ్ వాపు (థైరాయిడిటిస్), గాయిటర్ (థైరాయిడ్ ఎన్లార్జ్ మెంట్), థైరాయిడ్ నోడూల్స్, కాన్సరస్ ట్యూమర్, థైరాయిడ్ సర్జరీ, జెనెటిక్ ప్రీడిస్పొజిషన్, ఆటో ఇమ్యున్ గ్రేవ్స్ డిసీజ్, కాంజెనిటల్ సమస్యలు, థైరాయిడ్ స్టార్మ్ లాంటివి థైరాయిడ్ రుగ్మతలకు కారణం అవుతాయి. థైరాయిడ్ గ్రంధి అతి చురుకుగా పని చేసినప్పుడు 'హైపర్ థైరాయిడిజమ్' రుగ్మత కలిగి చెమట పట్టడం, ఆందోళనలు, రుతు స్రావం తగ్గడం, ఆకలి పెరగడం లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. థైరాయిడ్ గ్రంధి చురుకుదనం అతిగా తగ్గితే ఆహారం, పాల ఉత్పత్తులు, అయొనైజ్డ్ 'హైపోథైరాయిడిజమ్' రుగ్మత కలిగి బరువు తగ్గడం, ఒత్తిడి పెరగడం అతిగా రుతుస్రావం లాంటి లక్షణాలు కలుగుతాయి. ఆకలి పెరగడం లాంటి రోగ లక్షణాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. భారత దేశ జనాభాలో 42మిలియన్ల ప్రజలు థైరాయిడ్ రుగ్మతలతో బాధ పడుతున్నారు. థైరాయిడ్ రుగ్మతల్లో హైపర్ థైరాయిడిజమ్, హైపో థైరాయిడిజమ్, గాయిటర్, థైరాయిడ్ కాన్సర్, థైరాయిడిటిస్ లాంటి రుగ్మతలు ముఖ్యమైనవి. థైరాయిడ్ రుగ్మత ఉందని తెలియని ప్రజలు కూడా అసంఖ్యాకంగా ఉండటం విచారకరం. ఉత్తర భారతంలో హైపో థైరాయిడిజమ్ రుగ్మత అధికంగా బయట పడుతున్నది. ప్రతి 8మంది మహిళల్లో ఒకరికి థైరాయిడ్ సమస్య టి ఎస్ హెచ్ ఉందని అంచనా... అయోడిన్ లోపం వల్ల గాయిటర్ వ్యాధి 200 మిలియన్ ప్రజల్లో ఉందని తేలింది. థైరాయిడ్ సంబంధ వ్యాధి నిర్ధారణకు టి3, టి4 మరియు టియసాచ్ హార్మోన్ల స్థాయిని నిర్ధారిస్తారు. కాల్సిటోనిన్ స్థాయిని బట్టి థైరాయిడ్ కాన్సరు నిర్ణయిస్తారు. థైరాయిడ్ రుగ్మతలకు చికిత్సలుగా థైరాయిడ్ సర్జరీ, మెడికేషన్, రేడియో ఆక్టివ్ అయోడిన్, రేడి యేషన్, హార్మోన్ పిల్స్, రీకాంబినంట్ హుమన్ టియస్ హెచ్ విధానాలను వాడతారు. థైరాయిడ్ సమస్యలకు విరుగుడుగా ప్రోటీన్, కాల్సియమ్, అయోడిన్, మెగ్నీసియం మరియు విటమిన్ల ఆహారాన్ని తీసుకునేలా జీవన శైలిని అలవర్చుకోవాలి. అయోడిన్ లోపం ప్రధాన కారణంగా గుర్తించి థైరాయిడ్ సమస్యలకు పిల్లలు లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సమగ్ర ఆహారం, పాల ఉత్పత్తులు, అయోడైజ్డ్ ఉప్పు, లాంటివి థైరాయిడ్ గ్రంథికి ఆరోగ్యాన్ని సమకూర్చుతాయి. సులభంగా నివారించగల థైరాయిడ్ రుగ్మతల పట్ల లోతైన అవగాహన కలిగి, తరుచుగా పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యకర థైరాయిడ్ వినాళ గ్రంధిని నిర్మించుకుందాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నాడి పట్టేవారిలో.. నకిలీగాళ్లు

నల్గొండ : తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీలు చేసి వైద్యులపై పోలీస్ స్టేషన్లలో కేసులు మాత్రమే నమోదు చేయించింది. వాస్తవానికి ఈ అర్హతలేని వైద్యశాలను మూసివేయాల్సిన అధికారం జిల్లావైద్యారోగ్య శాఖకు ఉంది. డీఎంహెచ్‌వో కార్యాలయా నికి కూతవేటు దూరంలో ఉన్నా.. సదరు అధికారి ఈ నకిలీ వైద్యులు, వైద్యశాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కనీస విద్యార్హతలు లేకుండా వైద్యం చేస్తూ అమాయక ప్రజల ఆయువు తీస్తున్న నకిలీ డాక్టర్లపై కేసులు నమోదు కావడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లూ.. వైద్యారోగ్యశాఖలో ఉన్నతాధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు 'అందరికి తాయిలాలు' ఇచ్చి యథేచ్ఛగా క్లీనిక్‌లను నిర్వహిస్తున్న సదరు అక్రమ వైద్యులపై హైదరాబాద్‌లోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కొరడా ఝులిపించేవరకు జిల్లా వైద్యారోగ్యశాఖ మొద్దునిద్ర పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా నల్గొండ జిల్లాలో వరసగా దాడులు చేస్తుండటంతో 'శంకర్‌దాదా ఎంబీబీఎస్'లు(వైద్యార్హత లేనివాళ్ల) గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా గతంలో కంపౌండర్లుగా, నర్సులుగా పనిచేసిన అనుభవం, ఆర్ఎంపీలుగా దశాబ్దాలు పనిచేసిన వారు వైద్యుల వేషధార



ణలో ప్రజలను మోసం చేస్తున్నారు. నేషనల్ మెడికల్ మిషన్(ఎన్ఎంసీ), టీఎస్ఎంపీఆర్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై తెలంగాణ వైద్యుల సంఘం నాయకులు డా.లాలయ్య కుమార్, ఛైర్మన్ డాక్టర్ కె.మహేశ్‌కుమార్‌ల బృందం తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసింది. ఆ బృందం ఆధ్వర్యంలో ఇటీవల నల్గొండ, తిప్పర్తి, మునుగోడు ఠాణాల్లో 14 మందిపై కేసులు నమోదు చేశారు. వైద్యార్హత లేకుండా వీరు చేసిన అక్రమ వైద్యంపై గరిష్ఠంగా ఒక సంవత్సరం వరకు జైలుశిక్ష, రూ.5లక్షల జరిమానా కూడా విధించే అవకాశాలున్నాయి.

జ్వరం, జలుబు, ఒంటినొప్పులు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు వచ్చినా తమకు తాము వైద్యులమని చెబుతూ యథేచ్ఛగా యాంటీబయాటిక్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ సూదిమందులను ఎడాపెడా రోగులకు ఇస్తూ వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు.

జిల్లా వైద్యారోగ్యంతో పాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అనుమతులు పొందిన ప్రైవేటు ఆసుపత్రులు మొత్తం 672 ఉన్నాయి. ఇందులో 218 డయాగ్నోస్టిక్ సెంటర్లు, 197 ఆసుపత్రులు, 49 ప్రసూతి కేంద్రాలు, 30 కంటి, 20 చిన్నారులు, 8 ఈఎన్‌టీ, 64 దంత, 52 ప్రైవేట్ క్లీనిక్స్, 11 నర్సింగ్ హోమ్స్, 23 ఫిజియోథెరపీ క్లీనిక్‌లున్నాయి. అనధికారికంగా నల్గొండ పురపాలిక పరిధిలో ఉన్న 48 వార్డుల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 6 నియోజకవర్గాల మండల కేంద్రాల్లోనూ ఇబ్బడిముబ్బడిగా నకిలీ వైద్యశాలలు వెలుస్తూనే ఉన్నాయి.

# ధనసిరి వరించె..

గరిడేపల్లి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ధాన్యం దిగుబడులు ఆశించిన కంటే అధికంగా వచ్చాయి. గతంతో పోల్చితే నూతన సాంకేతిక పద్ధతులు, హరితవిప్లవం మాదిరిగా అధిక దిగుబడినిచ్చే స్వల్పకాలిక వంగడాలు ఇందుకు కారణమయ్యాయి. తెలంగాణలో ఎక్కువ వరి పండించే జిల్లాల్లో నల్గొండ ప్రథమ స్థానంలో ఉంటుంది. నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట తర్వాత సూర్యాపేట జిల్లా తర్వాతి స్థానంలో ఉంది. గతంలో సూర్యాపేట రెండో స్థానంలోనే ఉండేది. ఇప్పుడు సిద్దిపేట, నిజామాబాద్, కరీంనగర్ ఆ స్థానం ఆక్రమించాయి. సన్నాల సాగు సైతం భారీగా పెరిగింది. బోనస్ వస్తుందని రైతుల్లో నమ్మకం ఏర్పడటంతో దొడ్డు రకాలు సాగుచేసే రైతులు సైతం సన్నాల వైపు మొగ్గు చూపారు. గతంలోనూ నిజామాబాద్, కరీంనగర్ నుంచి సన్న ధాన్యం మిర్యాలగూడ మార్కెట్‌కు ఇబ్బడిముబ్బడిగా వచ్చేది. ప్రస్తుతం అది రెట్టింపు అయింది.



**వంగడాల ప్రభావం..**

ప్రధానంగా గత ఐదేళ్ల నుంచి నూతన సాంకేతిక పద్ధతులు, అధిక దిగుబడినిచ్చే ప్రైవేటు విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. పొలంలో సేంద్రియ సారం తగ్గిపోతుండటంతో రసాయన ఎరువుల వాడకం పెంచి అధిక దిగుబడి పొందడానికి రైతులు ప్రైవేటు కంపెనీలు అందించే విత్తనాల వాడకం పెంచారు. పుణె, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి ప్రైవేటు కంపెనీలు సన్న రకాల విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రయోగాలతో అధిక దిగుబడినిచ్చే రకాలను సంక్రమనం చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. దాంతో పాటు ప్రభుత్వ పరిశోధనా స్థానాల నుంచి సైతం సన్న రకాల విత్తనాలు కొత్తవి విడుదలవుతున్నాయి. జగిత్యాల వరి, వరంగల్ సన్నాలు, సిద్ధి, కంపసాగర్, కూనారం సన్నాలు, ఆర్ఎన్ఆర్‌లో పలు సన్నాలు, మార్టేరు తదితర పరిశోధనా స్థానాల నుంచి విడుదల చేశారు. వ్యవసాయ శాఖ ప్రకారం ఎకరాకు 23.5 క్వింటాళ్ల సాధారణ దిగుబడి అంచనా కాగా ఇప్పుడు ఎకరానికి 28-32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ప్రభుత్వం ఐకేపీలు, సహకార సంఘాల ద్వారా ఇప్పటి వరకు సన్న రకాల ధాన్యం కేవలం 30 శాతమే కొనుగోలు చేసింది. సూర్యాపేట జిల్లాలో 7,14,185 మెట్రిక్ టన్నుల సన్న రకాల దిగుబడి రాగా ఇప్పటి వరకు కేవలం 47,087 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. నల్గొండ జిల్లాలో 4,00,778 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం దిగుబడి అంచనా కాగా.. ఇప్పటి వరకు 17,729 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

# వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం



ముస్తాబాద్: వనమహోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వర్షాకాలం సమీపిస్తుండటంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే లక్ష్యాన్ని నిర్దేశించుకొని జిల్లాలోని ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. జూన్‌లో వర్షాలను బట్టి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. 2025-26 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 6.77 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ఎంచుకున్నారు. మండలానికో 60 వేలు, గ్రామానికి 3 వేలు, గ్రామావ సరాలను బట్టి మొక్కలను నాటేందుకు నర్సరీల్లో పెంపకం చేపట్టి సంరక్షిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో, పాఠశాల ఆవరణల్లో కులసంఘ భవనాల సముదాయాల్లో వేప, చింత, గుల్మోహర్, రావి, పథోడియా వంటి మొక్కలను నాటనున్నారు. ఇంటింటా దానిమ్మ, నిమ్మ, జామ, ఉసిరితోపాటు పూల మొక్కలను అందించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయ సముదాయాలు, సామాజిక భవనాల చెంత ఇప్పటి వరకు 2.50 లక్షల మొక్కలు నాటినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో 95 శాతం వరకు మొక్కలు బతికి ఉన్నాయని.. ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**పచ్చదనం పెంపునకు కృషి**జిల్లాలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. వనమహోత్సవం కోసం ఇప్పటికే నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాము. ఈసారి ఉద్యాన శాఖ ద్వారా మామిడి, నిమ్మ, మునగ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్, తోటలు పెంచేందుకు చిన్న, సన్నకారు రైతులకు అవకాశం ఉంది. ఆసక్తిగల రైతులు జిల్లాలోని ఆయా గ్రామాల్లో తమ తమ గ్రామపంచాయతీ కార్యాలయాల, మండల పరిషత్ కార్యాలయాల ద్వారా ప్రతిపాదనలు సమర్పించి అనుమతి పొందాల్సి ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలి. -మాధవి, ఉపాధిహామీ జిల్లా ప్లాంటేషన్ అధికారి

# 'టీ'తోనే జీవితం



మిర్యాలగూడ : ప్రస్తుత రోజుల్లో అనేక మంది దినచర్య ప్రారంభమయ్యేది టీతోనే. ఉదయాన్నే కప్పు టీ తాగకపోతే ఆ రోజంతా వెలితిగానే ఉంటుంది అనేక మందికి. ఇంటికి వచ్చే అతిథులకు స్వాగతం చెప్పేది, పని ప్రదేశాల్లో మనసును కుదుటపరిచేది టీ. ఇంతగా మనుషుల జీవితాల్లో పెనవేసుకుపోయిన టీ శతాబ్దాల క్రితం నుంచే ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లుగా అనేక రకాలుగా రూపాంతరం చెందుతూ సరికొత్త రుచుల్లో లభ్యమవుతోంది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

టీ అనగానే తేయాకు మరిగించిన నీటిలో పాలు, పంచదార వేసి తాగడమే అనేక మందికి తెలుసు. కానీ గత కొన్నేళ్లుగా టీలో అనేక మార్పులు వచ్చాయి. నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి, చౌటుప్పల్, నార్కట్‌పల్లి వంటి ప్రాంతాల్లో పలు రకాల టీలు విక్రయించే దుకాణాలు మూడేళ్లలో సుమారు వెయ్యికి పైగా ఏర్పాటయ్యాయి. వీటిలో టీ టైమ్, టీ హౌస్ వంటివి వివిధ రకాల టీలతో అలరించాయి. అనంతరం బెల్లం చాయ్ రంగ ప్రవేశం చేసింది. ప్రస్తుతం ఎవరి నోట విన్నా బెల్లం టీ వినిపిస్తోంది. టికి తోడు గత ఏడాది కాలంలో వందకు పైగా కాఫీ షాప్‌లు వెలిశాయి. వీటిలో లభించే పలు రకాల టీలు ప్రజలను అలరిస్తున్నాయి.

**సరదాగా కాలక్షేపానికి..**


ఉమ్మడి జిల్లాలో వెలసిన టీ దుకాణాలు, కాఫీ షాపులకు అనేక మంది స్నేహితులు, సహోద్యోగులు, బంధువులు, మహిళా సంఘాల సభ్యులు ఇలా అనేక మంది సాయంత్రం వేళలో కలిసి సరదాగా కాలక్షేపం చేసేందుకు వెళ్తుంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 లక్షలకు పైగా జనాభా ఉండగా.. వీరిలో సుమారు 14 లక్షల మందికి టీ తాగే అలవాటు ఉంది. వీరిలో 10 లక్షల మంది నిత్యం ఒక్క టీ అయినా తాగేవారుండగా.. సుమారు 2 లక్షల మంది గత రెండేళ్లుగా టీలో పంచదారకు బదులు బెల్లం వాడుతున్నారు. మరో రెండున్నర లక్షల మంది గ్రీన్ టీ, లెమన్ టీ తాగుతుండగా, లక్ష మంది వరకు బ్లాక్ టీ తాగుతున్నారు. జాగ్గరి అడ్డా అనే బెల్లం టీ దుకాణాలు ఉమ్మడి జిల్లాలో 35 ఉండగా ఒక్కో దుకాణంలో సరాసరి రోజుకు నాలుగు వందల మంది టీ తాగుతున్నారు.

**రకాలు ఇవీ..**

ప్రస్తుతం అనేక రకాల టీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి అల్లం, లెమన్, గ్రీన్, బెల్లం, బ్లాక్, బాదం, మసాల. కొందరు వ్యక్తులకు వీటిలో నిత్యం ఏదో ఒక టీ తాగడం అలవాటు. టీ తాగే వారిలో 95 శాతం 15 ఏళ్లు పై బడిన వారే ఉండగా..గ్రామాల్లో పదేళ్ల లోపు పిల్లలకు సైతం కొందరు టీ తాగిస్తున్నారు.

150 మి.లీ కప్పు టీలో 30 నుంచి 60 మి.గ్రా కెఫిన్ ఉంటుందని, అందుకే రోజుకు 300 మి.గ్రాములకు మించి కెఫిన్ తీసుకోకూడదని, అంటే రోజుకు 5కు మించి టీలు తాగితే అనర్థమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మిగిలిన అన్ని టీల కంటే బ్లాక్ టీ, గ్రీన్ టీతో పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# అడుగంటుతున్న జలం.. పొదుపే మంత్రం




నల్గొండ : ఎండలు మండుతున్నాయి. భానుడి ధాటికి భూగర్భ జలాలు భారీగా పడిపోతున్నాయి. వేసవిలో నీటి అవసరాలకు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం ఏప్రిల్‌లో 8.46 మీటర్లకు చేరింది. గత నెలతో పోల్చితే 0.33 మీటర్ల దిగువకు పడిపోయింది. వేసవి నీటి అవసరాలు ఎక్కువగా ఉండటంతో జలాలు అడుగంటుతున్నాయి. గతేడాదితో పోలిస్తే 2.87 మీటర్లపైనే జలం ఉన్నా... నీటి పొదుపు అవసరమని అధికారులు చెబుతున్నారు. అవసరానికి మించి నీటి వృథా చేయకుండా.. వినియోగంలో మెలకువలు పాటిస్తే.. భూగర్భ జలాలను రక్షించినవారిమి అవుతామని సూచిస్తున్నారు.

గతేడాది ఏప్రిల్‌లో 11.34 మీటర్ల లోతులో భూగర్భ జలం ఉండగా.. ఈసారి 8.46 లోతులో ఉంది. గతంతో పోలిస్తే భూగర్భ జలాలు కాస్త ఫర్వాలేదనిపించినా.. ఇష్టారీతిన తోడేస్తే అడుగంటే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సమృద్ధిగా వర్షాలు పడాలంటే జులై, ఆగస్టు వరకు ఆగాలి. ఈ నేపథ్యంలో పంటల సాగుకు బోరుబావుల కింద సాగుచేసే రైతులు వర్షాల కోసం ఎదురుచూడకుండా భూగర్భ జలాలను వినియోగించే అవకాశం ఉంది. ప్రజలు కూడా ఇతర అవసరాలకు బోర్ల వినియోగంపై ఆధారపడుతున్నారు.

**మండలాల పరిస్థితి**

భూగర్భ జలాల లభ్యత పరిశీలిస్తే నాంపల్లి, దామరచర్ల, చింతపల్లి మండలాల్లో అట్టడుగున భూగర్భ జలాలు ఉన్నాయి. నాంపల్లిలో 12.62, దామరచర్లలో 11.65, చింతపల్లిలో 10.86 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయి.

**వాననీటిని సంరక్షించుకోవాలి**-కె.రేవతి డీడీ భూగర్భజలశాఖ నల్గొండ ఏప్రిల్‌లో భూగర్భజల మట్టం 8.46 మీ. నమోదు అయింది. మార్చిలో 8.13 మీ. ఉండగా.. 0.33 మీ. తగ్గింది. జిల్లా వాసులు ఇంకుడు గుంతలు నిర్మించి వాననీటిని సంరక్షిస్తే కొంత వరకు నీటి ఎద్దడిని ఎదుర్కోవచ్చు. రైతులు పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి.

# పెంచిన మెట్రో రైలు ఛార్జీల సవరణ

హైదరాబాద్: మెట్రో రైలు ఛార్జీలను సవరిస్తూ ఎల్ అండ్ టీ సంస్థ నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులంతా ఛార్జీలను తగ్గిస్తారని భావించగా సంస్థ మాత్రం ఇటీవల పెంచిన ఛార్జీలపై 10శాతం రాయితీ ప్రకటించింది. ఈ నెల 24 నుంచి రాయితీలు మొత్తం మూడు కారిడార్లలో వర్తించనున్నట్లు ఎల్ అండ్ టీఎమ్ఆర్‌హెచ్ఎల్ సంస్థ ఎండీ, సీఈవో కేవీబీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోపించిన స్పష్టతమెట్రో రైలు ఛార్జీలు ఇటీవల కనీస ధర రూ.10 నుంచి రూ.12, గరిష్ఠ ధర రూ.60 నుంచి రూ.75కి పెంచింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ సంస్థ పెరిగిన ఛార్జీలపై పునరాలోచన చేసి రాయితీ అంటూ ప్రకటించింది. తగ్గించిన డిస్కౌంట్ యథాతథంగా కొనసాగిస్తారా? ఎన్నిరోజుల వరకు అమలులో ఉంటుందనే విషయాలపై స్పష్టతనివ్వలేదు. పెంచిన ఛార్జీల వివరాల కోసం వెబ్‌సైట్‌ని సందర్శించాలని పేర్కొన్నా.. అందులో పెంచిన ధర వివరాల పట్టికే ప్రత్యక్షమవుతుంది. రాయితీ ప్రకారం చూసుకుంటే.. గరిష్ఠ ధర రూ.75లో 10శాతం అంటే రూ.67.5, కనిష్ఠ ధర రూ.12లో.. రూ.10.8 అవుతుంది. ఛార్జీలు తగ్గించకుండా రాయితీ ఇవ్వడంతో దీన్ని ఎప్పుడైనా ఎత్తేసే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

# సిమెంటు లైనింగే శరణ్యం

తుంగతుర్తి : జిల్లాలో 2.5 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే ఆలోచనతో ఎస్సారెస్పీ కాలువల తవ్వకాలు జరిపారు. నిర్మాణం, నిర్వహణలో లోపాలే రైతుల పాలిట శాపాలుగా మారాయి. ప్రధానంగా కాలువలకు సిమెంటు లైనింగ్ చేస్తేనే చివరాయకట్టుకు నీరందుతుంది. ఇదే విషయమై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అసెంబ్లీలో ప్రస్తావించారు.

ప్రధాన కాలువకు పడిన గండ్లు, లేచిపోయిన లైనింగ్‌కు పూర్తిగా మరమ్మతులు చేయాలి. ఆ కాలువకు అనుసంధానమైన 69, 71, 70-డీబీఎం కాలువలను పూర్తి స్థాయిలో తవ్వకం జరిపి వాటి మూడింటికీ చివరి ఆయకట్టు వరకు సిమెంటు లైనింగ్ చేయాలి. వాటితోపాటు వాటికి అనుసంధానంగా ఉన్న కుడి, ఎడమ ఉప కాలువలకు పడ్డ గండ్లు, కోతకు గురైన అక్విడెక్ట్‌లు, అపహరణకు గురైన తూములకు షెటర్లను ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అన్ని కాలువల్లోనూ పెరిగిన కంపచెట్లను తొలగించాలి. నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేస్తేనే చివరి ఆయకట్టు రైతులకు నీరందనుంది.

**69 డీబీఎం:** ఈ కాలువ సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంది. 600



క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే వెళ్లేంత పరిమాణంలో కాలువను తవ్వలేదు. పూర్తిస్థాయిలో నీటిని వదిలితే డీబీఎం కాలువ పైనుంచి నీరు పొర్లి పోయే పరిస్థితిలో కాలువ ఉండటంతో అంత మేర నీటి విడుదల జరగటం లేదు. దీంతో నూతనకల్ మండలంలోని గ్రామాల రైతులకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. మండలంలో ఇది టెయిలెండ్ కాలువ కావటంతో మొదటి తూములు మొత్తం మూసివేస్తే తప్ప కిందికి నీరు చేరదు.

**లష్కర్లు లేక..:** కాలువలకు నీటిని విడుదల చేసినపుడు లష్కర్లు పర్యవేక్షించాలి. వారు లేకపోవటంతో రైతులు కాలువలకు ఇష్టం వచ్చినట్లు గండ్లు పెట్టుకొని నీటిని అక్రమంగా తరలించుపోతున్నారు. దీంతో రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

**ఇలాగైతేనే లబ్ధి:** ఖరీఫ్‌కు నీటి విడుదల చేసే సమయానికి ముందే కాలువ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు జరిపిస్తేనే రైతులకు సాగునీరు సక్రమంగా అందనుంది.

ంత్రి సానుకూలంగా స్పందించారు- మందుల సామేల్, ఎమ్మెల్యే, తుంగతుర్తి జిల్లాలో శ్రీరాంసాగర్ రెండో దశ ద్వారా చివరి ఆయకట్టు వరకు ఉన్న ప్రతి రైతుకు సాగునీటిని అందించాలనేదే ప్రభుత్వం లక్ష్యం. ప్రస్తుత సమస్యల పరిష్కారానికి గాను ఇప్పటికే భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి చేయాల్సిన పనుల గురించి వివరించా. ఆయన వెంటనే సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పనులు, కావాల్సిన నిధుల గురించి నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు.

# నిలోఫర్‌లో ప్రైవేటు దందా!

హైదరాబాద్ : నిలోఫర్ ప్రభుత్వ చిన్న పిల్లల ఆసుపత్రిలో ప్రైవేటు మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. ఏకంగా ఆసుపత్రి లోపల ప్రభుత్వ స్థలంలో మందుల దుకాణం కోసం శాశ్వత నిర్మాణాలు చేపడుతుండటం విస్తుగొలుపుతోంది. ముఖ్యంగా పిల్లలు ఆడుకునే పార్కును తవ్వేసి అక్కడ ప్రైవేటు మెడికల్ స్టోర్ ఏర్పాటు చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఈ వ్యవహారంపై నాంపల్లి శాసనసభ్యుడు మహ్మద్ మాజిద్ హుస్సేన్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నిలోఫర్ ఆసుపత్రి పక్కనే ఒక ప్రైవేటు మెడికల్ స్టోర్ ఉండేది. అద్దె ప్రాతిపదికన



కొన్నాళ్ల కోసం అప్పట్లో కేటాయించారు. లీజు గడువు తీరిన తర్వాత నిర్వాహకులు అక్కడ నుంచి కదలకపోవడంతో వెంటనే ఖాళీ చేయాలని గతంలో నోటీసులు ఇచ్చారు. ఆ పని చేయకపోగా.. ఈ నోటీసులపై నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. కొన్నేళ్లపాటు కోర్టులో ఈ కేసు నడిచింది. ఇటీవలే కేసు నిలోఫర్‌కు అనుకూలంగా వచ్చింది. వెంటనే అక్కడ నుంచి షాపు తొలగించాలని సూచించడంతో తీసివేశారు. మళ్లీ నెలల వ్యవధిలోనే ప్రస్తుతం అదే ప్రైవేటు మెడికల్ స్టోర్ ఏకంగా ఆసుపత్రి లోపల ఏర్పాటు చేస్తుండటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా..కొన్నిసార్లు అర్ధరాత్రి మందుల కోసం తీవ్ర ఇబ్బందులు తలెత్తుతుంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సేవలు వినియోగించుకుంటామని, ఈ అంశం వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతస్థాయి దృష్టిలో కూడా ఉందని తెలిపారు.

# హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్‌పై కదలిక



హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధిలోని భూ సమీకరణ (ల్యాండ్‌పూలింగ్)పై కదలిక వస్తోంది. రైతుల నుంచి భూ సమీకరణ చేసి వాటిని భారీ లేఅవుట్లుగా తీర్చిదిద్దేందుకు తాజాగా హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మహానగరం చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతుల వ్యవసాయేతర భూములను వారి ఇష్టంతోనే సమీకరించి వాటిని అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ గతంలోనే శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత ఇమ్మల్‌నర్వలో 95.25 ఎకరాలు, లేమూరులో 83.48 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి పనులు ప్రారంభించింది. మిగతా ప్రాంతాల్లోనూ అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపారు. తర్వాత మధ్యలో ఈ కార్యక్రమానికి కొంత బ్రేక్ పడింది. తాజాగా మళ్లీ దీన్ని ముందుకు కదిలించేందుకు యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి చేసిన భూమిలో రైతులకు 60 శాతం బదిలీ చేస్తుంది. మిగతా 40 శాతం విక్రయిస్తారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి పరిధిలో దాదాపు 924.28 ఎకరాలను అధికారులు గతంలో పరిశీలించారు.

**ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల చుట్టే..**

ఇటీవల హెచ్ఎండీఏ పరిధి 7200 చదరపు కిలోమీటర్ల నుంచి 11 వేల చదరపు కిలోమీటర్లు దాటి పెరిగింది. మొత్తం విస్తరిత ప్రాంతానికి సంబంధించి 2050 అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన జరుగుతోంది. భవిష్యత్తులో నగర అభివృద్ధి మొత్తం ఓఆర్ఆర్, ప్రాంతీయ రింగు రోడ్డు చుట్టూ కేంద్రీకృతం కానుండటంతో ఆ మేరకు భారీ లేఅవుట్లకు డిమాండ్ ఉంటుందని హెచ్ఎండీఏ భావిస్తోంది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య నివాస సముదాయాలు, విల్లాలు, వాణిజ్య, వ్యాపార సముదాయాలు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణం తప్పనిసరి. అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయానికి పనికిరాని భూములను సమీకరించాలని యోచిస్తున్నారు. గతంలో హెచ్ఎండీఏ వేలం వేసినప్పటికీ ధరలు సామాన్యులకు అందనంత దూరంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి కొంత దూరంగా అవుటర్ రింగ్‌రోడ్డు, ప్రాంతీయ రింగురోడ్డుకు మధ్య లేఅవుట్లు అభివృద్ధి చేసి వేలం వేయడం ద్వారా మధ్యతరగతి ప్రజలు కూడా కొనుగోలు చేయడానికి ముందుకొచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

# నీళ్లు ఎత్తిపోసేదెన్నాళ్లకో..?

మేళ్లచెరువు : నాలుగు మండలాల పరిధిలోని దాదాపు 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం సుమారు రూ.1,933 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎత్తిపోతల పథకాల పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. 2022లో మంజూరైన ఎంబీసీ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఇంకా భూసేకరణ ప్రక్రియ సగం కూడా పూర్తవ్వలేదు. ఈ పథకానికి రూ.1,500 కోట్లు మంజూరయ్యాయి. కృష్ణానది తీరం వెల్లటూరు వద్ద ఈ ఎత్తిపోతల పంపు హౌస్, వేపలసింగారం సమీపంలో పైపులైను పనులు చేపట్టారు. అవి నత్తనడకనే తలపిస్తున్నాయి. దీనికి సంబంధించి మొత్తం 22 కిలోమీటర్ల మేర పైపులు వరవాల్సి ఉంది. ఇందుకు గాను దాదాపు 200 ఎకరాల భూమి అవసరం. ఈ భూ సేకరణ కూడా ఇప్పటి వరకు 80 ఎకరాలే సేకరించారు. ఈ పథకం నుంచి కృష్ణా జలాలను ఎంబీసీ 23 కిలోమీటరు వద్ద విడుదల చేయడం ద్వారా చింతలపాలెం, మేళ్లచెరువు, హుజూర్‌నగర్ మండలాల్లోని 53 వేల ఎకరాల సాగర్ ఆయకట్టును స్థిరీకరించాలన్నది సంకల్పం. ప్రస్తుతం పనుల్లో వేగం చూస్తే.. పథకం పూర్తవ్వాలంటే మరో ఏడాది పైనే సమయం పట్టేలా ఉంది.



**వానాకాలానికి కష్టమే..**

బుగ్గమాధారం వద్ద రాజీవ్ ఎత్తిపోతల పేరుతో కొత్తగా రూ.394.10 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకానిదీ ఇదే పరిస్థితి. దీనిద్వారా 14,100 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్నది లక్ష్యం. దీనికి 48 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నడుస్తోంది. ఈ పథకం నుంచి నల్లబండగూడెం వద్ద కృష్ణా జలాలను పంపింగ్ చేయడం ద్వారా ఎగువ ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం నెరవేరనుంది. సాగర్ కాల్వలకు కేటాయించిన భూమిలోనే పైపులైను వరుస్తారు. ఈ మధ్య ఈ పథకం పనుల్లో కాస్త కదలిక వచ్చింది. ఐనప్పటికీ.. వచ్చే సీజన్‌లో ఈ పథకం ఆయకట్టుకు నీరందించే పరిస్థితులు కన్పించడం లేదు. వీటితో పాటు 3,200 ఎకరాల ఆయకట్టుకు సరిపడా సాగునీరు అందించేందుకు రూ.37.70 కోట్లతో నక్కగూడెం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇవీ అనుకున్న స్థాయిలో జరిగేలా లేవని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వెరసి.. మూడు పథకాలూ వచ్చే వానాకాలం సీజన్‌లో ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించే పరిస్థితులు కన్పించడం లేదు. ఈ పనుల నత్తనడకపై అసంతృప్తితో ఉన్న మంత్రి ఉత్తమ్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు మళ్లీ రానున్నారు. ఈ పనులపైనే సమీక్ష జరపనున్నారు.

# ఖాళీలతో కలవరం..!

సూర్యాపేట : జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నా.. ఖాళీలు మాత్రం భర్తీ చేయటం లేదు. జిల్లాలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకుల పోస్టుల ఖాళీలతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రస్తుతం కేంద్రాలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో తిరిగి ప్రారంభించే నాటికైనా ఖాళీలు భర్తీ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

**సహాయకులే దిక్కు**

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చూసేది ఉపాధ్యాయులే. వీరి పోస్టులు ఖాళీ ఉన్నచోట్ల సహాయకులతోనే నెట్టుకొస్తున్నారు. వీరిలో ఇష్టం లేక కొందరు ఉద్యోగానికి రాజీనామా చేయడం, మరికొన్నిచోట్ల వివిధ కారణాలతో మరణించడం తదితర కారణాలతో ఖాళీలు ఏర్పడ్డాయి. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకుల పోస్టులు రెండేళ్లుగా భర్తీకి నోచుకోవటం లేదు. ఖాళీలు ఉన్నచోట కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**83 ప్రధాన కేంద్రాలుగా మార్పు..**

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలు రెండు రకాలుగా ఉండేవి. మెయిన్, మినీ కేంద్రాలుగా ఉన్న వాటిని ఇప్పుడు ఒకేరకంగా మార్చేశారు. జిల్లాలో 83 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా మారాయి. మినీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు అవన్నీ ప్రధాన కేంద్రాలుగా మారడంతో సహాయకులను నియమించాల్సి ఉంటుంది.

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం–** నర్సింహారావు, డీడబ్ల్యూవో, సూర్యాపేట జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల వివరాలు సేకరించాం. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి నుంచి ఆదేశాలు రాగానే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

# గిరి వికాసం.. సాగుకు సహకారం

సిరిసిల్ల: పోడు భూములను సాగులోకి తీసుకొచ్చి వాటిలో విభిన్న పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ప్రారంభించింది. గిరిజన రైతులను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లాలో 2005, 2022లో ప్రభుత్వం పోడు పట్టాలను పంపిణీ చేసింది. కాగా వాటిలో నీరు, విద్యుత్ వసతిలేక ఆరుతడి పంటలే పండించారు. మరికొన్ని బీడు భూములుగానే ఉంటున్నాయి. ఒక గిరిజన రైతుకు రెండున్నర ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్గా అంతకు





తక్కువ ఉంటే పక్కనున్న రైతులతో కలిపి గ్రూపుగా ఏర్పాటు చేసి బోరుబావిని మంజూరు చేస్తారు. ఈ పథకాన్ని గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్) అమలు చేస్తుంది. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 లోపు మండలాల వారీగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తిస్తారు. జూన్ 10 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. భూగర్భ జలాల సర్వే చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక జూన్ 25 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు తదితర పనులన్నీ పూర్తి చేస్తారు. ఉమ్మడి జిల్లాలో రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలో 3,867 ఎకరాల్లో 2181 మంది గిరిజన రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందనున్నారు.

# సంరక్షణ లోపం.. లక్ష్యాలపై ప్రభావం



పెద్దపల్లి : ఓవైపు వానాకాలం సమీపిస్తుండగా ఊరూరా నాటాల్సిన మొక్కలు సిద్ధం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వేసవి ఎండల తీవ్రతతో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో మౌలిక వసతులు కరవయ్యాయి. వన మహోత్సవంలో భాగంగా వివిధ శాఖల భాగస్వామ్యంతో ఈ ఏడాది జిల్లాలో 30.44 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు నాటడానికి స్థలాలు ఎంపిక చేస్తున్నారు. ఏటా పెద్ద పరిమాణం కలిగిన మొక్కలు నాటాలని భావిస్తుండగా ఎదగకపోవడం లక్ష్యాలపై ప్రభావం చూపుతోంది.

**నీడ, పండ్ల మొక్కలే అధికం**

జిల్లాలో రామగుండం నగరపాలిక, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికలు, 266 పంచాయతీల పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదం, నీడ, పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నారు. టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, కర్జూర, మందార, సన్నజాజి, మల్లె తదితర రకాల విత్తనాలు నాటి పెంచుతున్నారు. ఊరూరా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

**రక్షణ మృగ్యం**

గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలు, నగర/పురపాలికలు, సింగరేణి ఆధ్వర్యంలో వేర్వేరుగా నర్సరీలు ఏర్పాటు చేశారు.

మండుతున్న ఎండల నుంచి మొక్కలను రక్షించేందుకు పరదాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా పంచాయతీల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. చాలా చోట్ల నర్సరీల్లో రక్షణ వ్యవస్థ(ఫెన్సింగ్) లేక పశువులు సంచరిస్తున్నాయి.

ఎదుగుదల లోపమే ప్రధాన సమస్య

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 26.47 లక్షల మొక్కల పెంపకానికి విత్తనాలు నాటగా 22.54 లక్షల మొక్కలు బతికాయి. మొక్క ఎత్తు కనీసం మీటరున్నర ఉండాలి. పంచాయతీల్లో గతేడాది నాటిన 1.58 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

మున్సిపాలిటీలు, అటవీ శాఖ, సింగరేణి వేర్వేరుగా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నాయి. నాసిరకమైన విత్తనాలు నాటడంతో మొక్కల ఎదుగుదలలో లోపం కనిపిస్తోంది.

గ్రామాల్లో సామూహిక ప్రాంతాలు, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4.87 లక్షలు మొక్కలు నాటేందుకు 490 ప్రాంతాల్లో స్థలాలు గుర్తించారు. ఏటా వర్షాలు కురిసిన వెంటనే హడావుడిగా చిన్న మొక్కలను నాటుతుండటంతో చనిపోతున్నాయి. అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం లక్ష్యాలపై ప్రభావం చూపుతోంది.

స్థలాలు గుర్తిస్తున్నాం

జిల్లాలోని నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు ఎదిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీల్లో నీడ కోసం గ్రీన్‌షేడ్ పరదాలు ఏర్పాటు చేశాం. పెద్ద పరిమాణం కలిగిన మొక్కలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నాం. వర్షాలు కురిసిన వెంటనే నాటేలా స్థలాలను గుర్తిస్తున్నాం.

కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి

# మామిడి.. సమస్యల ఒరవడి



జగిత్యాల : జిల్లాలో మామిడిని పండించి జగిత్యాల బ్రాండ్ పేరిట దేశవ్యాప్తంగా ఎగుమతి చేస్తున్న సాగు ఇటీవల తీవ్ర ఒడుదొడుకులకు గురవుతోంది. చీడపీడలు, ప్రతికూల వాతావరణంతో పాటు కొనుగోళ్ల మాయాజాలం, ధరాఘాతంతో కునారిల్లుతున్న పరిస్థితి తలెత్తుతోంది.

**ధరాఘాతం**

ఈ సీజన్‌లో జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, మేడిపల్లి, రాయికల్‌లలో ఇప్పటి వరకు 2.25 లక్షల క్వింటాళ్ల మామిడికాయలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. 125 మంది లైసెన్స్ పొందిన వ్యాపారులుండగా సగం మందే కొనుగోలు చేస్తుండటం, కొందరు బహిరంగ వేలం పద్ధతి, మరికొందరు గ్రేడింగ్ విధానం అనుసరించటం, మండీపై అధికారులు పట్టుకోల్పోవడంతో ధరల్లో స్థిరత్వం లోపించింది. సీజన్ ఆరంభంలో క్వింటా బంగినపల్లి రూ.65 వేలు పలకగా.. ప్రస్తుతం రూ.20–40 వేలకు తగ్గటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కొందరు వ్యాపారులు నేరుగా రైతుల తోటల వద్దకు వెళ్లి కాయలను పెట్టెల్లో నింపి వాహనాల ద్వారా నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండటంతో మార్కెట్ యార్డుల అజమాయిషీ కొరవడి ధరాఘాతం.. మార్కెట్ ఫీజు చెల్లించకపోవటం.. తక్కువగా చెల్లించటం రివాజుగా మారింది. తరుగు, చిన్నకాయలు, కమీషన్ పేరిట నష్టపరుస్తున్న చర్యలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

**ఈ చర్యలు అవసరం**

వ్యాపారులందరూ ఒకేతీరుగా కాయల కొనుగోలు జరిపేలా చర్యలు చేపట్టాలి. యార్డుల వెలుపల, తోటల వద్ద క్రయ విక్రయాలన్నీ తక్‌పట్టీల ప్రకారమే జరిగేలా చూడాలి.

అన్ని ప్రాంతాల్లోనూ కాయల సేకరణను మార్కెటింగ్‌శాఖ పర్యవేక్షణలోకి తేవాలి. వ్యాపారులు కొనుగోలు చేసిన సరకు విలువకు సరిపడా తక్‌పట్టీ రాసి మార్కెట్ ఫీజు వసూలు చేయాలి.

రైతుల నుంచి కమీషన్ తీసుకుంటున్నారని.. అదనంగా తరుగు, చిన్నకాయల పేరిట 5–10 శాతం వరకు కోత విధిస్తున్నారని రైతుల అరోపణల నేపథ్యంలో దీన్ని అరికట్టాలి.

ధరలో స్థిరత్వం తెచ్చేలా అపెడా, ఉద్యానశాఖ, మహిళా సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా మామిడి కాయలను సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించాలి. ప్రకృతి విపత్తులతో వాటిల్లే నష్టానికి పరిహారం అందించాలి.

లైసెన్స్ పొందిన వ్యాపారులు కాయలను కొనేలా చూస్తున్నామని.. ఇతర పండ్ల మార్కెట్లలో పలికే ధరల ప్రదర్శన, యార్డుల్లో సదుపాయాల కల్పన, ప్రభుత్వ కాంటాలపై ఉచిత తూకం తదితరాలతో రైతులకు ఆసరాగా నిలుస్తున్నామని మార్కెటింగ్‌శాఖ అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు.

ధరలో స్థిరత్వం ఉండాలి

మామిడి ధరలో స్థిరత్వం ఉండేలా ప్రభుత్వరంగ సంస్థలు మధ్యవర్తిత్వం వహించాలి. ఏకమొత్తంగా కొనే కంపనీలు, ఎగుమతి చేసే సంస్థలకు కాయలను విక్రయించే వీలు కల్పించాలి.

సత్యనారాయణరెడ్డి, రైతు

కొనుగోలుపై అజమాయిషీ ముఖ్యం

లైసెన్స్ పొందినవారంతా బీటులో కాయలను కొనేలా, ఢిల్లీ వ్యాపారులు నేరుగా దిగుమతి చేసుకునేలా చర్యలుంటే లాభం ఉంటుంది. చల్‌గల్ మార్కెట్లోనే కాయల క్రయవిక్రయాలు జరపాలి.

బి.మల్లయ్య, రైతు

# క్వింటాకు 99 కిలోలే!

ఏదులాపురం : బియ్యం తరుగు.. రేషన్ డీలర్లపాలిట శాపంగా మారింది. బఫర్ పాయింట్ నుంచి కాటా వేసుకొని ఎంఎల్ఎస్ గోదాములకు తీసుకొచ్చి నేరుగా డీలర్లకు పంపిణీ చేస్తున్నారు. ఎక్కడ మతలబు జరుగుతుందో కాని డీలర్లు తమకు క్వింటాకు కిలో తరుగు వస్తోందని వాపోతున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులు మాత్రం తాము పక్కాగా తూకం వేసి డీలర్లకు అందిస్తున్నామని చెబుతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద తూకం వేస్తే తమకు న్యాయం జరుగుతుందని డీలర్లు వాదిస్తున్నారు. అనుమానం ఉంటే బఫర్ పాయింట్ వద్దకు వెళ్లి తనఖీ చేసుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారులు బదులిస్తున్నారు. డీలర్లు దుకాణంలో కాటా వేస్తే 50కిలోలు ఉండాల్సిన బియ్యం బస్తా 49.50 కిలోలు చూపిస్తోంది. అంటే క్వింటాకు ఒక కేజీ తరుగు కనిపిస్తోంది. ఈ తరుగును పూరించాలంటే డీలర్లు ఏదో మాయ చేయక తప్పని పరిస్థితి నెలకొంది. డీలర్ల వద్దనున్న కాటా మిషన్‌ను తనిఖీ చేయాల్సిన తూనికల కొలతల శాఖ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాటా యంత్రాలు సరిగా పనిచేయకపోతే ఇటు లబ్ధిదారులు, ఎంఎల్ఎస్ కేంద్రం వద్ద తమకు పక్కాగా కాటా వేసి 50 కిలోలు బస్తాలు సరఫరా చేయాలని జిల్లావ్యాప్తంగా డీలర్లు డిమాండ్ చేస్తున్నా సివిల్ సప్లయ్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన దుకాణంలో పరిధిలో ఎఫ్ఎస్‌సీ కింద 608 కార్డులు, ఏఎఫ్ఎస్



కింద 66 కార్డుదారులకు మే మాసానికి 132.52 క్వింటాళ్ల సన్నబియ్యం దిగుమతైంది. ఏప్రిల్, మే కలిపి దాదాపు 1.32 క్వింటాళ్ల తరుగు కనిపిస్తోంది. దీన్ని ఎలా పూరించాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ దుకాణాదారులున్నాయి. బీపీఎల్ కింద 4,11,990 కార్డులు, ఎఫ్ఎస్‌సీ కింద 27,253 కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా 7,618.457 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు.

డీలర్లకు అనుమానం ఉంటే వేబ్రిడ్జి కాటా వద్దకు వచ్చి తనిఖీ చేసుకోవచ్చు. పక్కాగా 50 కిలోలు ఉంటుంది. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను బఫర్ గోదాంలో పెట్టాం. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఇన్‌ఛార్జిలకు వేమెంట్ పెట్టుకొనేందుకు నగదు చెల్లిస్తున్నాం. గతంలో వేమెంట్ చూసుకొనే అవకాశం ఉండేది కాదు.సన్న బియ్యం వచ్చాక ఆ పరిస్థితి లేదు. శ్రీలత, పౌరసరఫరాలశాఖ డీఎం

# 'సర్వే'త్రా ఆసక్తి

ఖమ్మం: భూ భారతి చట్టం అమలులో భాగంగా భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ప్రధానంగా భూమి సర్వే చేయటం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయని ఉన్నతాధికారులు గుర్తించారు. ఇందుకు ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లను వినియోగించుకోవాలని నిర్ణయించారు. పాలిటెక్నిక్, ఐటీఐ సివిల్, బీటెక్ చదివిన వారికి సర్వే శిక్షణ అందించి క్షేత్రస్థాయిలో వినియోగించుకోనున్నారు. పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణ కోసం ఈ నెల 17 వరకు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఖమ్మం జిల్లాలో 647, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 426 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈనెల 26 నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లో శిక్షణ అందించనున్నారు. 50 పనిదినాల్లో శిక్షణ పూర్తి చేయనున్నారు. ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో తర్ఫీదు ఇవ్వాలని భావిస్తున్నారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నందున మరో భవనం లేదా ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు రెండు భవనాలు అవసరమని నిర్ణయించారు.

భూమి రిజిస్ట్రేషన్‌కు అధీకృత మ్యాప్ (పటం) జతచేయాలని ఇప్పటికే చట్టంలో మార్పులు తీసుకొచ్చారు. లైసెన్స్ పొందిన వారికి భవిష్యత్తులో ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే మున్సిపాలిటీల పరిధిలో ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నా వీరి సంఖ్య చాలా తక్కువ. దరఖాస్తు చేసుకున్న వారికి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమవారం నుంచి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఏడీ శ్రీనివాసులు తెలిపారు.

**విశ్రాంత సర్వేయర్లతో శిక్షణ**లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు విశ్రాంత సర్వేయర్లను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విశ్రాంత సర్వేయర్లు ఖమ్మం జిల్లాలో ఆరుగురిని, భద్రాద్రి జిల్లాలో ఒకరిని గుర్తించింది. వీరితో పాటు మరికొందరు అవసరమని ఆయా జిల్లాల అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్రాంత సర్వేయర్ల కొరత నెలకొంది. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ అందించేందుకు ఇంకా ఎవరిని వినియోగించుకోవచ్చు అనే అంశాన్ని హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నట్లు తెలిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి లైసెన్స్ సర్టిఫికెట్ ఇస్తారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు భవిష్యత్తులో భూమి సర్వే చేసి, మ్యాప్ (పటం) ఇస్తేనే వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ అవుతాయి.

# నైపుణ్యమే ఉద్యోగ సోపానం

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం పది ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వీటికి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించి ంది. దీంతో చాలామంది సరదాగా గడపాలని భావించడం సహజం. ఈ సెలవులను సద్వినియోగం చేసుకుని తమను తాము మెరుగుపరుచుకునే అవకాశముంటుందని పలువురు విద్యావేత్తలు సలహా ఇస్తున్నారు. నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యం కలిగిన యువత అవసరం పెరిగిన నేపథ్యంలో అదనపు జ్ఞానం, అనుభవాన్ని పొందటం కీలకం. ప్రతి విద్యార్థి వేసవిలో కనీసం ఒకటి లేదా రెండు కోర్సులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని, ఒక ఇంటర్న్‌షిప్‌నకు సైతం దరఖాస్తు చేసుకోవటం మంచిదంటు న్నారు. ఇప్పుడు తీసుకున్న చిన్న నిర్ణయం రాబోయే రోజుల్లో అపార అవకాశాలకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని ఉద్బోధిస్తున్నారు.

**స్వీయ అనుభవంతో నేర్చుకునేలా...**

ఈ కోర్సులను స్వీయ అనుభవంతో నేర్చుకునేలా రూపొందించారు. చివరి సంవత్సరం పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సంస్థ నుంచి సర్టిఫికెట్ సైతం లభిస్తుంది. ఇది విద్యార్థుల రెస్యూమ్‌లో, లింక్డెన్ ప్రొఫైల్‌లో విలువ పెంచుతాయి. పరిశ్రమల్లో వీటి ప్రాముఖ్యం పెరుగుతోంది. ఏఐసీటీఈ ఇంట్నర్షిప్ పోర్టల్ వంటి వేదికల ద్వారా ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లు లభ్యమవుతున్నాయి. ఇవి విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడమే కాకుండా, కమ్యూనికేషన్, టీమ్‌వర్క్, టైం మేనేజ్‌మెంట్ వంటి ముఖ్యమైన నైపుణ్యాలను పెంచుతాయి.

## దాయమ్మా.. ఇదేం పనమ్మా..?

రెడ్‌హిల్స్ : ఆమె చారిత్రక నిలోఫర్ ఆసుపత్రిలో దాయమ్మగా పని చేసే శాలిని. ప్రస్తుతం లిఫ్ట్ ఆపరేటర్‌గా చేస్తోంది. రెండు పెద్ద సంచులతో విధుల్లోకి వచ్చింది. లిఫ్ట్‌లో వెళ్లే క్రమంలో ఆమె ప్రవర్తనను గమనించిన ఆసుపత్రిలో విధుల్లో ఉండే పోలీసులకు అనుమానం వచ్చింది. ఆమెను అడ్డుకొని ప్రశ్నించారు. వారిపైనే చిందులు తొక్కింది. పోలీసులు మహిళా భద్రతా సిబ్బందిని పిలిపించి సంచులను తెరిచి చూశారు. రూ.6 వేలు, రూ.7 వేల ఖరీదు చేసే ఇంజెక్షన్లు, సిరంజీలు, ఖరీదైన మందులు బయటపడ్డాయి. మరో సంచిలో కరెన్సీ నోట్లు కనిపించాయి. మందులు ఎక్కడివని ప్రశ్నిస్తే కోఠి నుంచి కొనుక్కొని వచ్చానని చెప్పింది. శాలిని వద్ద దొరికిన



మందులన్నీ ఆసుపత్రిలోనివేనని వైద్యాధికారులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళలో ఆసుపత్రికి వచ్చే రోగులకు కొన్నిసార్లు మందుల్లేవని బయటకు పంపిస్తుంటారని రోగుల తాలుకు బంధువులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మందులకు మెడికల్ షాప్‌కు వెళ్లి వచ్చేసరికి సమయం మించిపోతోంది. అలాంటి వారిని లక్ష్యంగా చేసుకొని, రెట్టింపు డబ్బులు తీసుకొని మందులు అమ్ముతున్నట్లు కొందరు చెప్పారు. డ్యూటీ ఆర్ఎంఓ ఒకరు ఈ ఘటనపై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్పష్టంగా లేదని పోలీసులు చెప్పినట్లు సమాచారం. ఆమె దగ్గర దొరికిన మందులను స్వాధీనం చేసుకున్నారు. సూపరింటెండెంట్ ద్వారా ఫిర్యాదు పంపించాలని పోలీసులు సూచించినట్లు తెలిసింది.

## ముంపు ముప్పు.. ఏమేరకు ఉండొచ్చు..?

కొత్తగూడెం: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ అంశం మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఈ ప్రాజెక్ట్ వెనుక జలాల (బ్యాక్ వాటర్) వల్ల ముంపు ముప్పును అంచనా వేయటానికి తృతీయ పక్ష సర్వేకు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) అంగీకరించింది. పోలవరం ప్రాజెక్ట్ వెనుక జలాల ముంపు ప్రభావాన్ని అధ్యయనం చేయాలని కేంద్ర జలసంఘానికి తాజాగా లేఖ రాసింది. తృతీయపక్ష సర్వేకు ముందే హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ల బృందం భద్రాచలంలో పర్యటించనుంది. 'పోలవరం' ప్రభావం తెలంగాణపై ఏమేరకు ఉంటుందో తేల్చాలని.. భద్రాచలం రామాలయానికి ఏర్పడే ముప్పుపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈఏడాది జనవరిలో అధికారులను ఆదేశించారు. ఏటా వర్షాకాలంలో గోదావరి వరదల వల్ల భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం మండలాల ప్రజలు భయం గుప్పిట్లో జీవనం సాగిస్తుంటారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే ముంపు ముప్పు ఏమేరకు ఉంటుందనే దానిపై ఐఐటీ ప్రొఫెసర్ల బృందం అధ్యయనం చేయనుంది.

**సమగ్రంగా అధ్యయనం చేస్తేనే..**

ఇటీవల పీపీఏ భేటీలో తెలంగాణ తరఫున నీటిపారుదలశాఖ అధికారులు వాదనలు వినిపించారు. ప్రధానంగా పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యంపై ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు ఇతర ప్రవాహాలతో పాటు భద్రాచలం, బూర్గంపాడు పట్టణాలపై పోలవరం వెనుకజలాల ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద నీటి నిల్వపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అథారిటీని కోరారు.

పోలవరం ప్రాజెక్ట్ ఎత్తును 45.72 మీటర్లు (150 అడుగులు)గా రూపొందించారు. దీని నీటి విడుదల సామర్థ్యం 50లక్షల క్యూసెక్కులు. తెలంగాణ ప్రాంత నాయకులు ఈ ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించాలని కోరుతున్నారు. తద్వారా భద్రాచలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ముంపు ముప్పును తగ్గించవచ్చునని చెబుతున్నారు.

**తెరపైకి భిన్నవాదనలు**

భద్రాచలం ముంపునకు పోలవరం ప్రాజెక్ట్ కారణం కాదని కొందరు వాదిస్తున్నారు. గోదావరి నది సహజ భౌగోళిక స్థితి, పాపికొండల వద్ద గోదావరి నది వెడల్పు తగ్గటం, శబరి నది సంగమం వల్ల ముంపు ముప్పు ఏర్పడుతుందని చెబుతున్నారు. పోలవరం వెనుక జలాలు భద్రాచలం వద్ద వరద తీవ్రతను పెంచవచ్చునని, 1986 కంటే ఎక్కువ ముంపు ఉండవచ్చునని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈనేపథ్యంలో పోలవరం ప్రాజెక్ట్ వల్ల ముంపు సమస్య ఏమేరకు ఉంటుందనేదానిపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించాలని, వెనుక జలాలతో ఏర్పడే ముప్పుపై వాస్తవ వివరాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## పాలనలో పారదర్శకత.. అభివృద్ధికి పెద్దపీట

కొత్తగూడెం : పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. వాటి పురోగతితోనే అభివృద్ధి సాధ్యం. గ్రామాల స్వయం సమృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో 'నూతన పంచాయతీరాజ్ చట్టం-2018' మార్పులు తెచ్చింది. సంస్కరణల్లో భాగంగా అధికారాలు, బాధ్యతలతో పాటు ప్రత్యేక నిధులు దక్కడంతో సర్పంచులు కీలకంగా మారారు. జిల్లాలోని వివిధ గ్రామాలు ఉత్తమ పనితీరుతో అవార్డులను సాధించాయి. నేడు 'పంచాయతీరాజ్ వ్యవస్థాపక దినోత్సవం' సందర్భంగా ఆయా విశేషాలపై ప్రత్యేక కథనం. గల తండాలు, గూడేలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. 274 నుంచి 478కి సంఖ్య ఎగబాకింది. రాష్ట్ర ప్రభుత్వ, ఆర్థిక సంఘం నిధుల్ని నేరుగా కేటాయిస్తుండగా, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. జనాభా ప్రతిపాదికన గ్రామానికి రూ.5 లక్షలకు తక్కువ కాకుండా బడ్జెట్ విడుదలవుతోంది. బాధ్యతల్లో విఫలమైనా, నిధులు దుర్వినియోగమైనా సర్పంచుల్ని బాధ్యుల్ని చేయటం ద్వారా పాలనలో పారదర్శకత పెరిగింది. స్థానిక స్టాండింగ్ కమిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వీధి దీపాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డుల నిర్వహణ,పారిశుద్ధ్యం, హరితహారం కార్యక్రమాలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటవగా, వీటి పర్యవేక్షణ పాలకవర్గాల్లో పారదర్శకతను పెంచింది.

పౌర బాధ్యతలు ప్రతి కుటుంబం తమ ఆవరణలో కనీసం ఐదు మొక్కలు నాటాలి. చెత్తను రహదారులు, కాల్వల్లో వేయొద్దు. అనుమతి లేకుండా ఇష్టానుసారంగా చెట్లను నరికివేయొద్దు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయొద్దు. నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి.

అనుభవజ్ఞుల భాగస్వామ్యంజిల్లా, మండల పరిషత్, పురపాలికల తరహాలో కొత్తగా కో-ఆప్షన్ సభ్యుల్ని నియమిస్తున్నారు. ఈ పాత్రలో విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, గ్రామ సమాఖ్య మహిళా సంఘాల అధ్యక్షులు, ఎన్నారైలు, ఇతర ప్రముఖులు గ్రామాభివృద్ధికి పునరంకితమవుతున్నారు.

ఇదీ సంగతి..మండలాలు: 21 గ్రామ పంచాయతీలు: 478 వార్డులు: 4,232 జనాభా: 8,38,153 (2011 జనాభా లెక్కల ప్రకారం)

## ఒకే రకం పని.. నిబంధనలే వేర్వేరు



హైదరాబాద్ : పని విలువ సుమారు రూ.2.42 కోట్లు. గుత్తేదారుల అర్హతల్లో టర్నోవరు 200 శాతం అంటే.. రూ.4.84 కోట్లు చేసి ఉండాలి. 2025 ఏప్రిల్ వరకు ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించి ఉండాలి. గుత్తేదారుల అనుభవం కూడా రూ.4.84 కోట్లకు తగ్గకుండా ఉండాలి. సాల్వెన్సీ రూ.60 లక్షలు ఉండాలి. టెండర్ గడువు మూడు రోజులుగా నిర్దేశించారు. ఇవీ జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్‌లో ఇన్‌ఛార్జి ఎస్ఈగా ఉన్న సీఈ స్థాయి అధికారి పెట్టిన షరతులు.

పని విలువ రూ.2.90 కోట్లు. ఏప్రిల్ 16తోనే గడువు ముగిసింది. టర్నోవరు 100 శాతం అంటే రూ.2.90 కోట్లు ఉంటే చాలు. అనుభవం కేవలం 50 శాతం అంటే రూ.1.45 కోట్లు పని చేసి ఉంటే చాలు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ చలానాలు అవసరం లేదు. జీహెచ్ఎంసీ మూడో పార్టీకి ఇచ్చినందున ఈ నిబంధన వర్తించదు. టెండర్ దాఖలుకు ఇచ్చిన గడువు వారం రోజులు. ఇది సికింద్రాబాద్ జోన్‌లో పిలిచిన టెండర్ల నిబంధనలు.

రెండు పనులు ఒకటే. ఖైరతాబాద్ జోన్‌లో ఒక రకంగా.. సికింద్రాబాద్ జోన్‌లో మరో రకంగా షరతులు విధించారు. ఎందుకంటే.. అక్కడ అధికారి కొంతమంది గుత్తేదారులతో కుమ్మక్కై వారికే టెండర్లు దక్కేలా చక్రం తిప్పుతున్నారు. టెండర్లను మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

**కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా..**

అనుకూల గుత్తేదారులకు రూ.11.13 కోట్ల విలువైన పనులను అప్పగించేందుకు ఓ అధికారి చక్రం తిప్పారు. ఈ నెల 22 సాయంత్రం టెండర్ల నోటిఫికేషన్ ప్రకటించారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు గడువు ముగుస్తుంది. ఈలోగా నిబంధనలకు అనుగుణంగా టెండర్లను సమర్పించాల్సి ఉంది. 200 శాతం టర్నోవరు లేకుంటే అనర్హులు. కావాలనే ఈ విధంగా నిబంధనలను రూపొందించారు. పక్క జోన్లలో ఇలా పిలవలేదని ఆధారాలతో సహా జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంటమాలజీలో (మలేరియా సెక్షన్) ఒప్పంద కార్మికుల సరఫరా కోసం వీటిని కావాలనే ఆలస్యంగా పిలిచారు. ఒక యూనిట్‌లో 19 మంది ఉద్యోగులు ఉంటారు. మెదటి రెండు టెండర్లు రూ.2.42 కోట్ల విలువ. 95 మంది చొప్పున ఉద్యోగులను సరఫరా చేయాలి. మూడో టెండర్ రూ.3.39 కోట్లు. ఏడు యూనిట్లు.. 133 మందిని సరఫరా చేయాలి. నాలుగు, అయిదో టెండర్ విలువ ఒకొక్కటి రూ.1.45 కోట్లు. మూడు యూనిట్లు 27 మంది చొప్పున సరఫరా చేయాలి.

**ఆ నలుగురి కోసమే..**

జీహెచ్ఎంసీలో నలుగురు పెద్ద గుత్తేదారులు ఉన్నారు. ప్రజాప్రతినిధుల అండదండలతో పనులు దక్కించుకుంటున్నారు. వారు మాత్రమే అర్హత సాధించేలా ఎక్కడా లేని విధంగా 200 శాతం టర్నోవరు నిబంధన పెట్టారు. ఖైరతాబాద్ జోన్‌లో ఎస్ఈ లేరు. ఇన్‌ఛార్జిగా సీఈ వ్యవహరిస్తున్నారు. గుత్తేదారులు విజ్ఞప్తి చేసినా.. ఆయన ఏమాత్రం పట్టించుకోకపోగా..

22న ప్రకటన జారీ చేసి 25 గడువు ముగుస్తున్నట్లు ప్రకటించడం విశేషం. జీహెచ్ఎంసీలో ఈపీఎఫ్, ఈఎస్ఐ మూడో ఏజెన్సీకి అప్పగించిన తర్వాత ఒప్పంద ఉద్యోగుల సరఫరాకు చలానాలు ఎలా అడుగుతారని ప్రశ్నిస్తున్నారు. నడుస్తున్న ఏప్రిల్ నెలకు ముందస్తుగా ఎలా చెల్లిస్తామని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## యూపీఐ.. జరభద్రం భాయ్!




హైదరాబాద్ : ప్రైవేటు ఉద్యోగి ఫోన్‌పేలో రూ.2వేలు జమచేసినట్టు సందేశం వచ్చింది. లింక్‌పై క్లిక్ చేసి.. పిన్ ఎంటర్ చేయగానే ఖాతాలో రూ.లక్షన్నర సొమ్ము మాయమైంది. ఇంజినీరింగ్ విద్యార్థికి తెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మిత్రుడికి పంపబోయి పొరపాటున రూ.5వేలు ఖాతాలో జమయ్యాయన్నాడు. ఏపీకే లింక్ పంపి విత్‌డ్రా చేసుకోవచ్చని రూ.50వేలు కాజేశాడు. యూపీఐ వినియోగదారులే లక్ష్యంగా సైబర్ మాయగాళ్లు కొత్త తరహా మోసాలకు తెగబడుతున్నారు. అపరిచిత వ్యక్తులతో నగదు లావాదేవీలు నిర్వహించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని నగర సైబర్‌క్రైమ్ ఏసీపీ శివమారుతి స్పష్టంచేశారు. గంట వ్యవధిలో 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**ఇదోరకం.. మోసం**

సైబర్ మోసగాళ్లు సెల్‌ఫోన్ నంబర్లకు బ్యాంకు నుంచి వచ్చినట్టు సందేశం పంపుతున్నారు. ఆ లింక్‌లను క్లిక్ చేయగానే ఏపీకే ఫైల్స్ పంపి యూపీఐ వినియోగదారుల ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్‌కార్డు, ఓటీపీ తదితర వివరాలను సేకరించి నగదు స్వాహా చేస్తున్నారు. నకిలీ కాల్‌సెంటర్ ద్వారా ఫోన్ చేసి ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే ప్రతినిధులమంటూ ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు కోరతారు. యాప్‌లో సాంకేతిక సమస్యను అధిగమించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తున్నట్టు.. తాము పంపే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని సొమ్మంతా కాజేస్తున్నారు.

**హవాలా తరహా దందా**

కొన్ని కేసుల్లో హవాలా తరహాలో పౌరులకు తెలియకుండానే వారి బ్యాంకు ఖాతాలు, యూపీఐలను ఉపయోగించుకొని కాజేసిన సొమ్ము సొంతం చేసుకుంటున్నారు.

**ఏటీఎంల వద్ద..:** బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్దకు వచ్చి నగదు ఉపసంహరించుకునే ఖాతాదారులను గమనిస్తున్నారు. వారి వద్దకెళ్లి తమకు అత్యవసరంగా డబ్బు అవసరమని నగదు తీసుకొని వారి యూపీఐ ఖాతాకు అంతే సొమ్ము బదిలీ చేస్తున్నారు. పెద్దమొత్తంలో లావాదేవీలు నిర్వహించినప్పుడు 1-2శాతం కమీషన్ ఇస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో వీరితో నగదు లావాదేవీలు చేసినట్టు బయట పడటంతో కేసుల్లో ఇరుక్కుంటున్నారు. మాయగాళ్ల నుంచి జమ అయిన నగదును ఫ్రీజ్ చేయటంతో బ్యాంకులు, పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఫైనాన్సర్‌నంటూ నమ్మించిన ఒక వ్యక్తి నుంచి పాతికేళ్ల యువకుడు రూ.2.5లక్షలు అప్పుగా యూపీఐ ద్వారా తీసుకున్నాడు. తిరిగి నగదు రూపంలో పూర్తిగా చెల్లించాడు. తాను పనిచేసే సంస్థలో సొమ్ము కొట్టేసి ఇలా అప్పులిచ్చినట్టు బయటపడటంతో యూపీఐ ద్వారా నగదు తీసుకున్న యువకుడికీ పోలీసులు నోటీసులు పంపారు.

## అనుమతి తీసుకో.. వ్యాపారం చేసుకో..



వికారాబాద్ : పురపాలికల్లో వ్యాపార రుసుం (ట్రేడ్ లైసెన్స్) ద్వారా పురపాలికలకు ఆదాయం సమకూరుతుంది. ఆర్థిక సంవత్సరం చివర్లోనే వ్యాపార సముదాయాల వారు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి. అయితే 25 శాతం కూడా లైసెన్స్ ఫీజు వసూలు కాకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**రూ.77.69 లక్షలకు వచ్చింది రూ.21 లక్షలు**

వికారాబాద్ జిల్లా కేంద్రంలో 1460 వ్యాపార సముదాయాలున్నాయి. వీటిద్వారా రూ.77.69 లక్షల పన్ను వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం రూ.21 లక్షలు మాత్రమే వసూలు చేశారు. మరో 56 లక్షలు వసూలు కావాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి వ్యాపార లైసెన్స్ విధానాన్ని మార్చారు. రోడ్డు విస్తీర్ణంతో పాటు దుకాణ వైశాల్యాన్ని చ.మీలో కొలిచి పన్ను విధిస్తున్నారు. దీంతో పాటు హరితహారం కింద దుకాణానికి రుసుం విధిస్తున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లావాదేవీల నిర్వహణ కోసం మార్చి 31లోగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుని ఉండాలని చెప్పినా కొందరు వ్యాపారులు ముందుకు రాకపోవడం గమనార్హం.

**మూడు కేటగిరీలుగా విభజన**

జిల్లాలోని నాలుగు పురపాలికలు తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగిలో ఉన్న దుకాణాలను మూడు కేటగిరీలుగా విభజించారు. మొదటిది 20 అడుగుల రోడ్డు కంటే తక్కువ ఉంటే చదరపు అడుగుకు రూ.3 చొప్పున ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేస్తారు. 20-30 అడుగుల రోడ్డు ఉంటే రూ.4లు, 30 అడుగుల రోడ్డు కంటే ఎక్కువ ఉంటే చదరపు అడుగుకు రూ.5 వసూలు చేస్తారు. తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాంకొత్తగా దుకాణాలు ప్రారంభించే వారు సంబంధిత ధ్రువ ప్రతాలను పురపాలక కార్యాల యంలో సమర్పించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పట్టణంలో తనిఖీలు నిర్వహించి లైసెన్స్‌లు లేని దుకాణాలపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటాం.జాకీర్ అహ్మద్, కమిషనర్ పురపాలక సంఘం, వికారాబాద్.

## గంగమ్మా.. ట్యాంకర్లే దిక్కమ్మా

హైదరాబాద్: నగరంలో జలఘంటికలు మోగుతున్నాయి. క్రమేణా ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండే ఇందుకు నిదర్శనం. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడం ఆందోళన కలిగిస్తోంది. వచ్చే రోజుల్లో ట్యాంకర్లు బుక్ చేసుకునే వారి సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

ఈ నెల రెండు లక్షల ట్యాంకర్లను సరఫరా చేయగా నెలాఖరు నాటికి 2.80 లక్షలకు చేరుతుందని అంచనా.

గతేడాది ఏప్రిల్లో 2.36 లక్షల ట్యాంకర్లు సరఫరా చేశారు.

ఈ నెల 5, 16, 17, 18వ తేదీల్లో ప్రతి రోజు పదివేల ట్యాంకర్లు చొప్పున సరఫరా చేశారు. మరో నెలరోజులు గరిష్ఠ డిమాండ్‌ను జలమండలి అంచనా వేస్తోంది.

మే చివరి వారం వరకు డిమాండ్ కొనసాగుతుందని తర్వాత వర్షాల ఆధారంగా ట్యాంకర్లపై ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు.

లాగేస్తున్నారు.. అక్రమ కనెక్షన్లు, మోటార్లు బిగించి నీటిని లాగేయడం వంటి చర్యలతో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రభావం పడుతోంది.



దీంతో మోటార్ల వినియోగంపై జలమండలి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఇప్పటికే 500కుపైగా మోటార్లను సీజ్ చేయడంతో జరిమానాలు విధించడం, నీటి కనెక్షన్లు తొలగించడం వంటి కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, నిజాంపేట, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, అమీర్‌పేట, బంజారాహిల్స్, మూసాపేట తదితర ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ బాగా ఉంటోంది.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు**

నగరంలో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. వర్షపాతం సాధారణం కంటే ఎక్కువే నమోదైనా ఆ స్థాయిలో భూమిలోకి నీరు చేరలేదు. చాలా అపార్ట్‌మెంట్లలో బోర్లు అడుగంటిపోయాయి. దీంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది.

## పనులు మధ్యంతరం.. లేదు గత్యంతరం

ధర్మపురి: పది గ్రామాల ప్రధాన రహదారి ప్రమాదాలకు కేంద్రంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా తాత్కాలిక మరమ్మతులతో మమ అనిపిస్తున్నారు. ధర్మపురి నుంచి దమ్మన్నపేట, జైన మీదుగా ఆరెపల్లి వరకు గల రోడ్డుపై నిత్యం వందల వాహనాలు వెళ్తుంటాయి. సుమారు దశాబ్దం క్రితం నిర్మించిన రోడ్డు కావటంతో తారు లేచి గుంతలు ఏర్పడగా.. వాహనదారులు నరకయాతన పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కాగా ప్రభుత్వం మారటంతో పనులు నిలిచిపోయాయి.

**విద్యార్థులు, రైతులే అధికం**

ధర్మపురి, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్, ఆరెపల్లి వరకు రహదారి 19 కిమీల మేర విస్తరించి ఉంది. ధర్మపురి, దమ్మన్నపేట, రాజారం, జైన, మగ్గిడిల వద్ద రహదారి అధ్వానంగా మారింది. చాలా చోట్ల గుంతలు ఉన్నాయి. ఈ రోడ్డు గుండానే వివిధ గ్రామాల ప్రజలు ధర్మపురికి నిత్యం వచ్చి వెళ్తుంటారు. ప్రతిరోజు ఆర్టీసీ బస్సు మగ్గిడి ఆదర్శ పాఠశాల విద్యార్థులతో వెళ్తుంది. ఉదయం.. సాయంత్రం వరకు నాలుగు ట్రిప్పులతో బస్సు.. వందల ఆటోలు నడుస్తుంటాయి. ఇందులో విద్యార్థులు, రైతులే అధికంగా ఉంటారు.

**ప్రమాదకర స్పాట్లు**

దమ్మన్నపేట గ్రామంలో రోడ్డు అధ్వానంగా తయారైంది. వివేకానంద కూడలి, ప్రభుత్వ పాఠశాలల వద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాజారంలో మూలమలుపుల వద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. జైన



గ్రామం వద్ద మూడుచోట్ల రహదారి అధ్వానంగా ఉంది. దమ్మన్నపేట వద్ద విద్యార్థులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక పక్కకు ఒరగ్గా.. తృటిలో ప్రమాదం తప్పింది.

**10 కల్వర్టులు పూర్తి**

గత ప్రభుత్వంలో ఆర్అండ్‌బీ శాఖ ధర్మపురి నుంచి దొంతాపూర్ వరకు రోడ్డు పనులను రూ.30 కోట్లతో ప్రారంభించింది. 21 ఫీట్ల వెడల్పుతో రహదారిపై మట్టి పోసి విస్తరించారు. మధ్యలో 10కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేశారు.

**రాత్రిళ్లు వెళ్లాలంటే భయం**

నిత్యం ధర్మపురి నుంచి దమ్మన్నపేట, రాజారం, జైన ఆరెపల్లిలకు ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్తాను. అడుగడుగునా గోతులు ఉండటంతో రాత్రిళ్లు వెళ్లాలంటే భయమేస్తోంది. తరచూ ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రహదారిని బాగు చేసి ప్రమాదాలు నివారించాలి.

తిరుపతి, ఆటోడ్రైవర్, దమ్మన్నపేట

**నా కళ్ల ముందే ప్రమాదాలు**

ప్రతిరోజు నేను ద్విచక్రవాహనంపై ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటాను. గుంతలతో తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. నా కళ్ల ముందే ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ప్రాణాలు పోతున్నా అధికారులు దృష్టి నిలపటం లేదు. మిషన్ భగీరథ గుంతలు పూడ్చి వేయాలి. మురళి, దమ్మన్నపేట

చురకలు



# త్రిశంకు స్వర్గంలో 'ప్రసాద్' పథకం

సింహాచలం : సింహాచలం క్షేత్రంలో రూ.54కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యాటక శాఖ చేపట్టిన ప్రసాద్ పథకం పనులు త్రిశంకు స్వర్గంలో నిలిచిపోయాయి. గత నెల 30న చందనోత్సవం రోజున జరిగిన గోడ ప్రమాద ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందిన నేపథ్యంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అనంతరం జరిగిన పరిణామాల్లో ప్రభుత్వం గుత్తేదారును బ్లాక్ లిస్టులో పెట్టడంతో నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

**గడువు ముగిసినా సగంలోనే పనులు**

సింహాచలంలో ప్రసాద్ పథకం పనులు గత ఏడాది మార్చిలో ప్రారంభమయ్యాయి. దేశ ప్రధాని నరేంద్రమోదీ కశ్మీర్ నుంచి వర్చువల్ విధానంలో పనులకు శంకుస్థాపన చేశారు. అనాటి నుంచి ఏడాదిలోగా పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కనీసం అరవై శాతం కూడా పనులు పూర్తయిన దాఖలాలు కనిపించడం లేదు. దీనికి తోడు నిధుల విడుదలలో కూడా సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది. రూ.54కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.13కోట్లు మాత్రమే నిధులు విడుదలైనట్లు సమాచారం. ఈ జాప్యం కూడా పనులు కొనసాగింపునకు అవరోధంగా మారింది.

**మళ్లీ టెండరు పిలవాల్సిందేనా..?**

చందనోత్సవం ఘటన నేపథ్యంలో పర్యాటక శాఖ జిల్లా ఇంజినీరింగ్



అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వారి స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. దీంతో ప్రసాద్ పథకం పనులపై పర్యవేక్షణ కొరవడింది. అలాగే గుత్తేదారును బ్లాక్‌లిస్టులో పెట్టిన నేపథ్యంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల పురోగతిపై సందిగ్ధత నెలకొంది. మిగిలిన పనులకు మళ్లీ టెండర్లు పిలుస్తారన్న ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే పనులు మళ్లీ ప్రారంభం కావడానికి నెలల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**ఎప్పటికి పూర్తయ్యేనో..**

సింహాచలంలో ప్రసాద్ పథకం పనులు ఎప్పటికి పూర్తవుతాయోనన్న సందేహాల్లో భక్తులు వెలిబుచ్చుతున్నారు. ఆది నుంచి ఆగుతూ సాగుతూ వస్తున్న పనుల్లో పర్యాటక శాఖ, దేవస్థానం అధికారుల మధ్య తీవ్ర సమన్వయ లోపం పనుల జాప్యానికి కారణమైంది. దేవస్థానం బృహత్తర ప్రణాళికకు అనుగుణంగా ప్రసాద్ పనుల ప్రణాళికను రూపొందించక పోవడంతో పలుమార్లు మార్పులు, చేర్పులు చేయాల్సి వచ్చింది. ప్రసాద్ నిధులతో చేపట్టిన పనులకు అనుసంధానంగా దేవస్థానం నిధులతో చేయాల్సిన పనులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సి రావడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తేనే కనీసం ఏడాదిలో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు.

# సెజ్‌లో కంకర దొంగలు

రాంబిల్లి : కంకర దొంగలు చెలరేగిపోతున్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు సిద్ధం చేసిన పూడి పారిశ్రామిక నడవ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్లాట్లలో దర్జాగా కంకర తవ్వి లారీల్లో తరలిస్తున్నారు. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్), నాన్ సెజ్ ప్రాంతంలో పరిశ్రమలకు కేటాయించకుండా ఖాళీగా ఉన్న ప్లాట్లను ఏపీఐఐసీ అధికారులు పర్యవేక్షిస్తుండాలి. పూడి పారిశ్రామిక నడవ ప్రాంతంలో ఏషియన్ రంగుల పరిశ్రమకు సమీపాన ఏపీఐఐసీ స్థలంలో అక్రమంగా కంకర తవ్వకాలు సాగుతున్నాయి. కంకర దొంగలు బృందాలుగా ఏర్పడి రోజుకో ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. కొందరి నాయకుల అండదండలతో ఈ తవ్వకాలు సాగుతున్న నేపథ్యంలో సమాచారం అందినా అడ్డుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అచ్యుతాపురం సెజ్‌లో



ఏపీఐఐసీకి సంబంధించిన భద్రత సిబ్బంది 16 మంది వరకు ఉన్నారు. భద్రత సిబ్బందికి నెలకు సుమారు రూ. రెండు లక్షల వరకు ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. సెజ్ ఖాళీ స్థలాల్లో కంకర, మట్టి తవ్వకాలు చేసిన గుంతలు కళ్ల ముందే కనిపిస్తున్నా అక్రమ తవ్వకాల నిరోధానికి చర్యలు తీసుకోలేదు. ఎస్పీ ఆదేశాలతో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పోలీసు సిబ్బంది సెజ్‌లో గస్తీ నిర్వహిస్తున్నారు. కంకర దొంగలపై నిఘా ఉంచి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సెజ్ నిర్వాసితులు కోరుతున్నారు.

**బాధ్యులపై చర్యలు** సెజ్‌లో ఖాళీ స్థలాల్లో అక్రమంగా కంకర, మట్టి తరలింపుపై ఏపీఐఐసీ జోనల్ మేనేజరు నరసింహారావు వద్ద మంగళవారం ప్రస్తావించగా ఆ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఏపీఐఐసీలో భద్రత సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఉన్నా పనిభారంతో సెజ్‌లో ఖాళీ స్థలాలను పర్యవేక్షిం చలేక పోతున్నారని చెప్పారు. నిర్వాసితుల సమాచారం మేరకు దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సముద్రపు నాచు.. అ'ధర'హో..!

విశాఖపట్నం : నగరంలోని ఆర్కేబీచ్ తీరం సమీపంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సముద్రపు నాచు సాగులో తొలి దిగుబడి వచ్చింది. తమిళనాడు నుంచి విత్తనాలు తీసుకొచ్చి.. మొత్తం 50 యూనిట్లు ద్వారా నాచు పెంపకం చేపట్టారు. థాన్ ఫౌండేషన్ మహిళల పర్యవేక్షణలో సాగు చేయగా...తొలి విడతగా రెండు టన్నుల దిగుబడి వచ్చింది. ఇప్పుడు రెండో పంటకు ఏర్పాట్లు చేస్తున్నారు. సముద్రపు నాచు ధర కిలో రూ.21 వేల వరకు ఉందని, అయితే విశాఖలో పండించిన నాచుకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు తెలిపారు.

సముద్రపు నాచులో అధిక పోషకాలు ఉంటాయి. సీఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో అనేక ఆహార పదార్థాలు తయారు చేసి, మార్కెట్‌కు తరలిస్తున్నారు. జపాన్, కొరియా దేశాల్లో దీని వినియోగంగా అధికంగా ఉంటుంది. ఔషధాల తయారీలోనూ నాచును వాడుతుంటారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా సముద్రపు నాచు పంట వేశామని, విజయవంతమయితే తీర ప్రాంతం వెంబడి పెంపకం ప్రారంభిస్తామని జేడీ పి.లక్ష్మణరావు పేర్కొన్నారు.

# ఉత్తుత్తి దాడులు.. అందుతున్నాయ్ ముడుపులు!



హిందూపురం : నాటుసారా తయారీ, విక్రయాలు నిషేధం.. అయినా ఇష్టారాజ్యంగా అవి కొనసాగుతున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో మంచి నీళ్లైనా లభిస్తాయో లేదో? కానీ నాటుసారా దొరుకుతోంది. ఈ మహమ్మారి బారిన పడి ఎందరో పేదలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా అబ్కారీ యంత్రాంగం ఉత్తుత్తి దాడులతో సరిపెడుతోంది. విక్రయాలు చేస్తున్న వ్యక్తులపై నామమాత్రపు కేసులు నమోదు చేసి మమ అనిపిస్తున్నారని ఆరోపణలున్నాయి. గుంతకల్లు, వజ్రకరూరు, గుత్తి, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, కంబదూరు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సారా తయారీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**ఇదీ పరిస్థితి**

గుంతకల్లు-కర్నూలు జిల్లా సరిహద్దుల్లో, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజక వర్గాల్లో ఎక్కువగా నాటుసారా తయారు అవుతోంది. గుంతకల్లు శివారు కదిరిపల్లి, గుత్తి మండలం మామదూరు, వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండా, పాతకడమల కుంట, బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం, కణేకల్లు మండలం కణేకల్లు క్రాస్, పెనకలపాడు, పామిడి మండలం రామగిరి ఎగువ తండా, దిగువ తండా, కళ్యాణదుర్గం మండలం ముదినాయనపల్లి, పీఆర్‌పల్లి, బాలవెంకటాపురం, ఓబుళాపురం, కంబదూరు మండలం రాళ్లపల్లి, ఒంటారెడ్డిపల్లి, రాళ్ల అనంతపురం, ఐపార్శపల్లి, ఆత్మకూరు మండలం వేపచెర్ల ఎగువ, దిగువ తండాలు, ముట్టాల, డీకే తండాల్లో సారా ఎక్కువగా ఉంటోంది.

**మామూళ్ల మత్తులో..**

సారా నియంత్రించడంలో అబ్కారీ ఎన్‌ఫోర్సుమెంట్ వ్యవస్థ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న పది ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న కొందరు సిబ్బంది ముడుపులకు ఆశపడి సారాతయారీ, విక్రయదారులను వదిలేస్తున్నారని తెలిసింది. కళ్యాణదుర్గంలో ఓ అధికారి సారాతయారీ చేస్తున్న వారితో నెలవారీ ముడుపులు ఫిక్స్ చేసుకున్నట్లు విమర్శలున్నాయి. స్టేషన్ల వారీగా కొందరు సిబ్బందిని వసూళ్ల కోసమే నియమించుకుని మామూళ్లు దండుకుంటున్నట్లు సమాచారం.

**నవోదయం-2 అమలు చేస్తేనే**

నవోదయం-2 కింద తయారీ, విక్రయదారులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపుతామనే భరోసా ఇవ్వడంలో అధికారులు విఫలమవుతున్నారు. అబ్కారీ అధికారులు కేవలం ఉపన్యాసాలకే పరిమితమయ్యారు. 3 నెలలుగా జిల్లాలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా మార్పు రాలేదు. కేసులను నామమాత్రంగా పెట్టి వదిలేస్తున్నారు. పాత నేరస్థులను గుర్తించి వారిపై బైండోవర్ చేసినప్పటికీ నిందితుల్లో భయం లేకుండా పోయింది. నవోదయం-2 కార్యక్రమం ఎంచుకున్న గ్రామాల్లోనే అధికారులు హడావుడి చేస్తున్నారు.

**నాలుగు బృందాలతో పర్యవేక్షణ- రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్**

జిల్లాలో కళ్యాణదుర్గం, కంబదూరు, గుంతకల్లు ప్రాంతాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయి. అవి మా దృష్టిలో ఉన్నాయి. మా శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, సరిహద్దు టీం, స్థానిక ఎక్సైజ్ పోలీసులు ఇలా.. 4 టీంలు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నాం. నవోదయం-2లో భాగంగా జిల్లాలో దాడులు నిర్వహించి బట్టీలను ధ్వంసం చేస్తున్నాం.

# కొందరికే గుత్తే'ధారదత్తం'



అనంతపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నగరపాలకలో వైకాపా వాసన పోవడం లేదు. పాలకవర్గం వైకాపా వారే అయినా అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కావడంతో ఇప్పుడు కూడా తెదేపా మద్దతు గుత్తేదారులకు న్యాయం జరగడం లేదని గుర్రుమంటున్నారు. సాధారణంగా పనులు అయితే టెండరు ద్వారా ఎవరైనా దక్కించుకున్నా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం కొంత మేర వైకాపా గుత్తేదారుల వైపే మొగ్గు చూపడం సాధారణంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాజాగా వైకాపా హయాంలో ఎక్కువ పనులు చేసిన వారికే డిపాజిట్లు వెనక్కి చెల్లించడంపై అంతా వైకాపా వారికే గుత్తాధిపత్యం అప్పగించారన్న విమర్శలు పలువురు గుత్తేదారులు గుప్పిస్తున్నారు. కొందరు గుత్తేదారులు వివరాలను నమోదు చేయడానికి క్యాష్ బుక్కు తన ఆధీనంలో ఉంచుకొని వారికి సంబంధించిన ఈఎండీ సొమ్ము నమోదు చేసిన అనంతరం సంతకాలు చేయించి చెక్కు రూపంలో రాయించుకున్నట్లు కొందరు గుత్తేదారులు చెబుతున్నారు. ఈ అంశంపై నగరపాలకలో ఏ ప్రాతిపదికన పెద్ద మొత్తంలో చెక్కులు రాస్తారని ప్రశ్నించడంతో అప్పటికప్పుడు హడావుడిగా ఇంకొందరికి ఇస్తామంటూ దస్త్రం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**రూ.2 కోట్లకు పైగానే..**

నగరపాలకలో రూ.2 కోట్లకు పైగానే ఈఎండీ సొమ్ము ఉంటుంది. గతంలో చెల్లించలేదు. ఇటీవల గత వైకాపా హయాంలో టెండర్లు పిలిచి ప్రారంభం కాని పనులను రద్దు చేశారు. టెండరు దశలో ఉన్నవి కొన్ని, అగ్రిమెంట్ అయినవి ఇంకొన్ని ఉన్నాయి. 211 పనులు రూ.18.92 కోట్లు విలువ చేసే పనులు రద్దు అయ్యాయి. వాటి కోసం చెల్లించిన ఈఎండీ చెల్లించాలని ఒత్తిడి ఉంది. ఎలాగూ పనులు రద్దు చేశారు కాబటి మా సొమ్ము వెనక్కి ఇవ్వాలంటూ మూడు నెలలుగా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ఈఎండీ సొమ్ము వెనక్కి చెల్లిస్తే ఏవిధమైన విమర్శలు ఉండేవి కావని అభిప్రాయ పడుతున్నారు.

**ఈఎండీ సొమ్ముకు పాటించని క్రమపద్ధతి**

నగరపాలకలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు గుత్తేదారులు ఈఎండీ రూపంలో డిపాజిట్ చెల్లిస్తారు. టెండరు వేసే సమయంలో 1 శాతం, అగ్రిమెంట్ సమయంలో 1.5 శాతం, బిల్లు ఇచ్చే సమయంలో 2.50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా 5 శాతం ఒక్కో గుత్తేదారు సొమ్ము నగరపాలక ఖాతాలో ఉంటుంది. పనులు పూర్తయిన రెండేళ్ల తర్వాత సొమ్మును ఒక క్రమ పద్ధతిలో సీనియారిటీ ప్రకారం ఇవ్వాల్సి ఉంటుంది. కొందరు నాలుగు, ఐదేళ్ల నుంచి ఉన్న డిపాజిట్లు ఇప్పటిదాకా వెనక్కి ఇవ్వలేదు. వైకాపాకు అనుకూలంగా ఉన్న వారికే ఎక్కువ మందికి రాశారని ఇందులో ఓ గుత్తేదారునికే అందరి కంటే ఎక్కువగా రూ.6 లక్షలకు పైగానే ఇప్పటికే చెక్కు రూపంలో చెల్లించడంపై విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి సీఎఫ్‌ఎంఎస్ ద్వారా ఇవ్వాల్సి ఉన్నా చెక్కులు ఇవ్వడం కూడా నిబంధనలకు విరుద్ధం.

# ఇదంతా 'పన్నా'గమే!!

విశాఖపట్నం : జీవీఎంసీ ఆధీనంలో ఉన్న విలువైన స్థలాలను పరిరక్షించాల్సిన అధికారుల్లో కొందరు.. అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు తార్కాణమే మధురవాడ పరిధిలోని రూ.5 కోట్ల విలువైన స్థలంపై నిర్లక్ష్యం. 'జీవీఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసే సమయానికి అది ఖాళీ స్థలం. దానిలో అనధికారికంగా నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు కళ్లు మూసుకున్నారా? కట్టిన దుకాణాలు అనధికారం అని తెలిసి పన్ను ఎలా విధించారు? ఆ పన్నులు పట్టుకుని న్యాయస్థానానికి వెళుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? న్యాయస్థానాల్లో కౌంటర్ దాఖలు చేయకుండా ఎందుకు వ్యవహరించారు?'... అంటే సమాధానాల్లేవు.

**సముదాయం నిర్మించినా..**

కారు షెడ్డు కూడలి నుంచి మిథిలాపురం కాలనీకి వెళ్లే మలుపులో సర్వే సంఖ్య 248/10లోని స్థలంలో ప్లాన్ అనుమతులకు దరఖాస్తు చేశారు. 1080 గజాల స్థలంలో జాతీయ రహదారి విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ వంటి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని 672 గజాలు జీవీఎంసీకి గిఫ్ట్‌డీడ్ చేయాలని అధికారులు సూచించారు. నూకరాజు జీవీఎంసీకి గిఫ్ట్ డీడ్ చేశాకే 408 గజాల్లో ప్లాన్‌కు అనుమతులిచ్చారు. అనుమతులు పొందిన స్థలంలో జీప్లస్-3 భవన నిర్మాణం చేశారు. గిఫ్ట్‌డీడ్ చేసిన నూకరాజు చెల్లెలు తనకు హక్కులున్నాయంటూ, తన తల్లి ఇచ్చినట్లు అన్‌రిజిష్టర్డ్ వీలునామాతో కోర్టును ఆశ్రయించారు. తర్వాత ఆ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించారు. అయితే..ఆ నిర్మాణాలకే జీవీఎంసీ అధికారులు పన్నులు విధించడం గమనార్హం. జీవీఎంసీకి గిఫ్ట్‌డీడ్ ఇచ్చిన స్థలానికి విధించిన పన్ను ఇది. విచిత్రమేమంటే రసీదులో 2018 నుంచి 2023 వరకు రూ. 1.35 లక్షల బకాయిలున్నట్లు తెలుస్తుంది. అంటే అధికారులు ఐదేళ్లు పన్ను వసూళ్లకు ప్రయత్నమే చేయలేదా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**నాటి కమిషనర్ లేఖ**

'1955 సేల్‌డీడ్ ప్రకారం ప్లాన్‌కు దరఖాస్తు చేయగా, 672 గజాలు గిఫ్ట్‌డీడ్ తీసుకుని మిగిలిన స్థలానికి ప్లాన్ అనుమతులిచ్చాం. గిఫ్ట్‌డీడ్ తీసుకున్నప్పుడు అక్కడ ఖాళీ స్థలం ఉంది. స్థలానికి హక్కుదారుగా చెబుతున్న వ్యక్తి జీవీఎంసీ అనుమతి తీసుకుని నిర్మాణం చేపట్టాలి? ఆ దుకాణాలకు ఎలాంటి అనుమతుల్లేకుండా అనధికారికంగా నిర్మించారు. వీలునామా సరైంది కాదు. దుకాణాలు అనధికారికంగా కట్టారు కనుక స్టే ఎత్తి వేయాలి' అంటూ 2018లో అప్పటి కమిషనర్ హరినారాయణ కోర్టుకు తెలిపారు. ఈ కమిషనర్ బదిలీ అయ్యాక, కోర్టుకు ఎలాంటి నివేదికలివ్వకుండా, కౌంటర్ దాఖలు చేయకుండా అక్రమార్కులకు అధికారులే కొమ్ముకాశారన్న ఆరోపణలున్నాయి.

**ఆ రోజు హడావువే..:** జీవీఎంసీ స్థలంలో అనధికార నిర్మాణాలపై ఇటీవల కథనం ప్రచురితమవగా అధికారులు స్పందించినట్లు హడావుడి చేశారు. వాణిజ్య సముదాయంలో ఓ గోడకు రంధ్రం చేసి వదిలేశారు. త్వరలో నిర్మాణాలు తొలగిస్తామని చెప్పి..ఆపై చేతులెత్తేశారు. ఈ విషయంలో రాజకీయ ఒత్తిళ్లు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవాలు బయటకు వస్తే అప్పట్లో ఉన్న పట్టణ ప్రణాళిక అధికారులు, జీవీఎంసీ స్థలానికే పన్ను వేసిన అధికారుల బాగోతం బయటకొస్తుంది. జీవీఎంసీకి గిఫ్ట్‌డీడ్ చేసిన నూకరాజు కుటుంబం 'జీవీఎంసీకి ఇచ్చిన స్థలంలో అనధికారికంగా దుకాణాలు నిర్మించాం. వాటి తొలగింపులో మాకు ఎలాంటి అభ్యంతరాల్లేవు' అంటూ కోర్టుకు సమర్పించగా, జీవీఎంసీ అధికారులు మాత్రం ఎలాంటి సమాధానం కోర్టుకు ఇవ్వకుండా నిమ్మకుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ట్రాక్టర్ ఇచ్చేశాం.. ఇంతటితో సరి!

పాయకరావుపేట : లక్షల రూపాయల నిధులు ఖర్చుచేసినా పైసా ప్రయోజనం లేకుండా చేయడమెలాగో జగన్ సర్కారుకు తెలిసినంతగా ఇంకెకవరికీ తెలియదనే చెప్పాలి. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగులో భాగంగా చెత్త తరలించేందుకు గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్లు ఇవ్వాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా గతేడాది జనవరిలో జనాభా ప్రాతిపదికన జిల్లాలోని 27 పంచాయతీలకు కేటాయించేందుకు తీర్మానించారు. ఇంజిన్ సరఫరా చేసే కాంట్రాక్టు ఒకరికి, తొట్టెల తయారీ కాంట్రాక్టు మరొకరికి ఇచ్చారు. ముందుగా 2024 ఫిబ్రవరిలో ట్రాక్టర్ ఇంజిన్లు వచ్చేశాయి. తొట్టెలు ఇప్పటికీ పంచాయతీలకు చేరలేదు. ఒక్కో ఇంజిన్‌కు సుమారు రూ. 6 లక్షలకు పైగా వ్యయం



చేశారు. పాయకరావుపేట మండలం శ్రీరాంపురం, మంగవరం, పెదరామభద్రపురం, పెంటకోట, వెంకటనగరం, అరట్లకోట, పి.ఎల్.పురం, పాల్మన్‌పేట సహా జిల్లాలోని నక్కపల్లి, ఎస్.రాయవరం తదితర మండలాల్లోని 27 పంచాయతీలకు ఇంజిన్లు చేరాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. తొట్టెలు వస్తాయని ఎదురుచూసినా నిరాశే ఎదురైంది. దీంతో పంచాయతీల వద్ద నిరుపయోగంగా వదిలేశారు. నెలల తరబడి వీటిని పట్టించుకోవడం మానేశారు. తొట్టెలను సరఫరా చేస్తే వాటిపై గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించే అవకాశ ముంది. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణిని వివరణ కోరగా తొట్టెల సరఫరాపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ దృష్టికి రెండుసార్లు తీసుకు వెళ్లామన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ కోసం తొట్టెలను అద్దెకు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని వివరించారు.

# పర్యావరణంపై 'రాళ్లు'

కల్లూరు : కొండలు తవ్వుతున్నారు.. విలువైన ఖనిజాలు తరలిస్తున్నారు.. నిబంధనలకు పాతరేస్తూ పర్యావరణానికి హాని తలపెడుతున్నారు. ఖనిజాల తవ్వకాలకు పర్యావరణ అనుమతి (ఈసీ) తప్పనిసరి. ఒకప్పుడు మేజర్ ఖనిజాలకే ఉన్న పర్యావరణ అనుమతులను మైనర్ ఖనిజాలకు తప్పనిసరి చేశారు. లీజుదారులు తవ్వకాలు జరపాలంటే మైనింగ్ ప్లాన్‌తో పాటు పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు తీసుకోవాలి. ముందుగా పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. ఆ తర్వాత తవ్వకాల సమయంలో కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పొందాలి. కొత్త లీజుదారులకు పర్యావరణ అనుమతులుంటేనే తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. పాత లీజుదారులు అనుమతుల లేకుండానే తవ్వకాలు సాగిస్తున్నారు.

ఉలిందకొండను కూల్చేశారుఉలిందకొండ పరిధిలో సుమారు 11 వరకు క్వారీలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేస్తున్నారు. క్వారీల ప్రతినిధులు అటవీ ప్రాంతంలో గుట్టలు తవ్వేస్తున్నారు. ఆరు ఇంచుల వెడల్పు.. వంద అడుగుల లోతున బోరు ఘాతాలతో బ్లాస్టింగ్ చేస్తున్నారు. 50 అడుగులకుపైగా లోతున తవ్వేసి కంకర అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు.

కంకర క్వారీలకు క్యూబిక్ మీటరుకు రూ.90 లేదా టన్నుకు రూ.60 ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. వీరు ఇవేమి చెల్లించనవసరం లేదు. వాణిజ్య పన్నుల శాఖకు చెల్లించే జీఎస్టీనీ ఎగ్గొడుతున్నారు. ఇదే సమయంలో రాయల్టీ చెల్లింపులో 0.03 శాతం గ్రామ పంచాయతీలకు సెస్సు రూపంలో జమ అవుతుంది. అక్రమ తవ్వకాలతో అటు జీఎస్టీని ఎగవేయడంతో పాటు గ్రామ పంచాయతీలకు వచ్చే సెస్సు రావడం లేదు. నిత్యం భారీ వాహనాల్లో తరలిస్తుండటంతో ఉలిందకొండ తండా



రస్తా పూర్తిగా దెబ్బతింది. రహదారి నిర్మించాలంటూ జనం విన్నవించినా పట్టించుకోలేదు.

**కొండలు పిండి చేస్తున్నారు**

ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కొండలను తవ్వుతున్నారు. వీటికి ఈసీతో సహా ఎటువంటి అనుమతులు లేవు. కొన్ని లీజులకు సంబంధించి రాయల్టీలు, రెన్యువల్స్ జరుగుతున్నా పర్యావరణ అనుమతులపై మాత్రం అధికారులు దృష్టి సారించడం లేదు.పాణ్యం మండలం తమ్మరాజుపల్లె, సోమయాజులపల్లె, కాల్వబుగ్గ, ఓర్వకల్లు, కల్లూరు, కర్నూలు జగన్నాథగట్టు, ప్యాపిలి, బేతంచెర్ల ఎర్రమల కొండలతో పాటు ఇతర ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు సాగుతున్నాయి.

దేవనకొండ క్వారీల్లో పేలుడు పదార్థాలతో తవ్వకాలు జరుపుతున్నారు. ఓర్వకల్లు మండలం నన్నూరు, ఎయిర్‌పోర్టు సమీపంలో నాలుగు చోట్ల అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.

బోర్‌వెల్ యంత్రాలతో వంద అడుగులకు పైగా డ్రిల్లింగ్ చేస్తూ పేలుడు పదార్థాలతో భారీ పేలుళ్లకు పాల్పడుతున్నారు. పేలుళ్ల తీవ్రతకు బండరాళ్లు కి.మీల దూరం వరకు పడుతున్నాయి. దుమ్మూధూళితో సమీప గ్రామాల ప్రజలు రోగాల బారినపడుతున్నారు. భూమి పొరల్లో కదలికలతో వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి.

# మట్టిపోసి.. మాయజేసి

పత్తికొండ: హంద్రీనీవా విస్తరణ పనుల్లో భాగంగా ప్రధాన కాలువను తవ్వి కట్టను విస్తరిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న తేలిక పాటి వర్షాలకే కట్ట పలు చోట్ల పూర్తిగా కోతకు గురవుతోంది. సంబంధిత హంద్రీనీవా అధికారులు స్పందించారు. వెంటనే గుత్తేదారులు మట్టి తరలించి కోతకు గురైన ప్రాంతాల్లో చల్లుతున్నారు. ఇలా వేసిన ఈ మట్టి తేలికపాటి వర్షానికే కొట్టుకుపోతోందని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రోలింగ్ చేయకుండా.. పైన మట్టి చల్లి వెళ్లారని ఆరోపిస్తున్నారు. చేస్తున్న పనుల్లో నాణ్యత కొరవడితే రానున్న రోజుల్లో ప్రధాన కాల్వకు గండ్లు తప్పవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హంద్రీనీవా పంపుతో వాననీరు ఎత్తిపోత

అనంతపురం : హంద్రీనీవా ప్రాజెక్టులోనే అరుదైన ఘటన ఇది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాన నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలో మూడు రోజులుగా కురుస్తున భారీ వర్షాల మూలంగా హంద్రీనీవా ప్రధాన కాలువ నీటితో నిండిపోయింది. దీని కారణంగా ప్రధాన కాలువకు ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయి. వాగులు, వంకలు, పొలాల్లో నీరంతా ప్రధాన కాలువలోకి వచ్చి చేరుతోంది. కాలువలో నీరు ఎక్కువై గండ్లు పడుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించి హంద్రీనీవా అధికారులు అప్రమత్తమయ్యారు. ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ సారథ్యంలో ఆగమేఘాలపై ప్రధాన కాలువను రక్షించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించారు. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద ఉన్న పంపు–8 ద్వారా నీటిని ఎత్తిపోస్తు



న్నారు. ఒక పంపుతో 330 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి ప్రధాన కాలువ 181 కి.మీ. వద్ద ఉన్న యూటీ ద్వారా పీఏబీఆర్ జలాశయానికి మళ్లించారు. రాగులపాడు పంప్‌హౌస్ ముందు భాగంలో అనేక చోట్లా ప్రధాన కాలువకు గండ్లు పడ్డాయి. వీటిని పూడ్చివేయడమే కాదు.. అక్కడక్కడ మరమ్మతులు చేస్తున్నట్లు ఎస్ఈ స్వరూప్‌కుమార్ తెలిపారు. జిల్లాలో కురుస్తున్న భారీ వానల కారణంగా హంద్రీనీవా తొలి దశలో ప్రధాన కాలువ వెడల్పు, రెండో దశ లైనింగ్ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు అన్ని ప్యాకేజీల పనులు ఆగిపోయే పరిస్థితి నెలకుంది.

## భూసార విత్తనం.. రాయితీ వరం

శ్రీకాళహస్తి :సారవు పంటలుగా పిలిచే జనుము, జీలుగలను రైతులకు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు సిద్ధం చేస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో పంపిణీ బాధ్యతలు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్)కు అప్పగించింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించే వరకు రైతులు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి తద్వారా పొలాలను సారవంతం చేసుకుంటూ ఉంటారు. ఇక్కడి ఉమ్మడి జిల్లాల రైతులు ఎక్కువగా జనుము, జీలుగలు సాగు చేస్తారు. ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం కల్పించేలా వీటిని ప్రభుత్వం రాయితీపై అందజేస్తుంది

రైతులకు మేలు..: ఇప్పటికే రబీలో పండించిన పంటలకు ఆశించిన మేర గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు సారపు



పంటల విత్తనాలు రాయితీతో అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు 50 శాతం రాయితీతో జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు అందజేయనున్నారు. జిల్లాల వ్యవసాయశాఖ సూచనల మేరకు చిత్తూరుకు జీలుగలు 378, జనుములు 1,156 క్వింటాళ్లు, తిరుపతికి జీలుగలు 5,499, జనుములు 2,429, పిల్లిపెసర 1,287 క్వింటాళు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఏపీసీడ్స్ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు జిల్లా మేనేజరు సంపత్‌కుమార్ తెలిపారు.

**40 శాతం రాయితీతో వేరుసెనగ**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వేరుసెనగ విత్తనపు కాయలు పంపిణీ బాధ్యతనూ సైతం ప్రభుత్వం ఏపీసీడ్స్‌కు అప్పగించింది. అయితే దీనిపై 40 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఏటా రెండు రకాలు మాత్రమే అందుబాటులో ఉంచుతూ వస్తున్న వ్యవసాయ శాఖ ప్రస్తుతం ఐదు రకాలు పంపిణీ చేస్తోంది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తోంది. కే6 రకం 9300, టీసీజీఎస్ 1694 రకం 9300, ట్యాగ్–24 9300, నారాయణి 9500, లేపాక్షి రకం 8200 క్వింటాళ్ల మేర పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అయితే ధరల నిర్ణయంతో పాటు పంపిణీ ప్రారంభం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశిస్తారని తెలిపారు.

## వేతన బకాయిలు అందనున్నాయ్..!

కుప్పం : ద్రవిడ వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న పొరుగు సేవల ఉద్యోగులకు వైకాపా హయాంలో సకాలంలో జీతాలు అందకపోవడంతో నిరసనలు.. ధర్నాలు చేపట్టారు. అయినా సమస్యను పరిష్కరించలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పం పర్యటనకు



వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పొరుగు సేవల ఉద్యోగులు జీతాల సమస్య విన్నవించారు. స్పందించిన ఆయన మొదటి విడతగా గతంలో రూ.2.86 కోట్లు... తాజాగా రెండో విడతగా రూ.5.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి రోనాల్డ్ రోస్.డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ మొదటి వారంలో ఉద్యోగులకు జీతాలు అందించనున్నారు.

**ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంజినీరింగ్ విద్య:** ద్రవిడ వర్సిటీలో ఇంజినీరింగ్ విద్యను ప్రవేశపెట్టేందుకు సాధ్యాసాధ్యాలపై నియమించిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ క్రమంలో వర్సిటీ నిబంధనలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యను ప్రారంభించుకోవాలని ఉన్నత విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఈ విద్యాసంవత్సరం నుంచి బీటెక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) కోర్సులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ఒక్కో కోర్సులో 60 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు.

## బతుకు వేదనై.. వలసల దారులై..



రాయదుర్గం : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయని అధికారులు, పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. తప్పని పరిస్థితుల్లో పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి. రాయదుర్గం నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు వలసబాట పట్టారు. గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన వారు పెట్టాబేడా సర్దుకుని నగరాలకు వెళుతుండటంతో కొన్ని ఊర్లు బోసిపోతున్నాయి.

**పని దొరక్క.. ఆసక్తి చూపక**

ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తోంది. కుటుంబీకులు అందరూ వెళితే పని దొరకడం కష్టం. సొంత గ్రామంలో ఉపాధి పనులకు వెళితే రూ.300 కూడా రావడం లేదని ఆసక్తి చూపడం లేదు. ఇతర ప్రాంతాలకు వెళితే ఒక్కొక్కరికి రోజుకు రూ.500 నుంచి రూ.700 వస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు.

**ఊరిని చూసేది ఏడాదికి రెండుసార్లే**

కుటుంబాల్లో చిన్న పిల్లలు, వృద్ధులు ఉంటే వారిని ఇళ్ల వద్దే వదిలి వెళుతున్నారు. పింఛను సొమ్ముతోనే పిల్లల ఆలనాపాలనను వృద్ధులు చూసుకోవాల్సి వస్తోంది. బడికి వెళ్లే పిల్లల్లో ఎక్కువ మంది మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా వలసదారులు ఉగాది, మారెమ్మ పండగ చేసుకునేందుకు ఏడాదికి రెండుసార్లు మాత్రమే వస్తుంటారు. చిన్నారులు, వృద్ధులకు కావాల్సిన వస్తువులు, నగదు ఇచ్చి వెళుతుంటారు.

**వలస వెళ్తున్న నగరాలు**

కర్ణాకలోని బెంగళూరు, దాని పరిసర ప్రాంతాలు మైసూరు, ఉడిపి చెన్నై, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా

వారు చేసే పనులు ఏవంటే..

కేబుళ్ల ఏర్పాటుకు మట్టి తవ్వకాలు చేయడం

**ఎంత ఇస్తారు**

పురుషులకు : రోజుకు రూ.700 చొప్పున

మహిళలకు: రూ.500 చొప్పున కూలి చెల్లిస్తారు

**భోజనం, వసతి ఎలాగంటే..**

తవ్వకాలు చేస్తున్న చోటనే తాత్కాలికంగా టెంట్లు వేసుకుని.. అక్కడే వంటావార్పు.

ఉడిపిలో మట్టి పనులు –నాగభూషణ, గోనబావి

సొంత గ్రామంలో పనులు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో వెళుతున్నాం. ప్రస్తుతం భార్యాభర్తలం కర్ణాటకలోని ఉడిపి ప్రాంతంలో మట్టి పనులు చేసేందుకు వెళుతున్నాం. ప్రభుత్వం స్థానికంగా ఉపాధి కల్పిస్తే ఇక్కడే పనులు చేసుకుంటాం.

**సాగు నీరు ఉంటే..లక్ష్మన్న, పూలకుంట**

గత ఏడాది బీటీ ప్రాజెక్టులో నీరు ఉండటంతో పనులు లభించేవి. ఈసారి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు ఎక్కువగా వెళుతున్నారు. ఇప్పటివరకు గోనబావి, పూలకుంట గ్రామాల నుంచి సుమారు 400 కుటుంబాలకు పైగా వలసలు వెళుతున్నాయి.

**అడిగిన వారందరికీ ఉపాధి –సలీంబాష, డ్వామా పీడీ, అనంతపురం**

ప్రస్తుతం ఉపాధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సొంత గ్రామంలో నివాసం ఉంటే ఉపాధి పనులు కల్పించేందుకు ఎటువంటి అభ్యంతరం లేదు. అడిగిన వారందరికీ అవకాశం కల్పిస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకే పని రోజులు కల్పిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

## సరిహద్దు దాటుతున్న ఇసుక



హిందూపురం : దక్షిణాది మండలాలకు జీవనాడి అయిన పెన్నా, జయమంగళి, సువర్ణముఖి నదుల్లో ఇసుక అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి తరలిస్తుండటంతో వాటి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఈ నదుల వల్ల రైతులకు ప్రస్తుతం పెద్దప్రయోజనం లేకున్నా ఇసుకాసురుల జేబులు నింపుతున్నాయి. ప్రభుత్వం ఇసుక తరలింపు సులభతరం చేయటం అక్రమార్కులకు వరంగా మారింది. రాత్రిపూట అధికారుల కళ్లుగప్పి కర్ణాటక ప్రాంతానికి పెద్దఎత్తున ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక అధికార, ప్రతిపక్ష నాయకుల పాత్ర ఉండటంతో ప్రతి రోజూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో రాత్రుళ్లలో సులువుగా సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు.

**పరివాహక ప్రాంత రైతుల ఆందోళన**

నదీపరివాహక ప్రాంతాల్లో భూములు ఉన్న వందలాది మంది రైతులు ఈ నదులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నదులు ప్రతీఏటా ప్రవహించకున్నా మూడునాలుగేళ్లకు ఒకసారి ప్రవహించినా సమీప వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం నదుల్లోని ఇసుక తరలించటంతో నదిలో ప్రవహించే నీరు భూమిలో ఇంకే అవకాశం ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిల్వ చేసి..**

హిందూపురం గ్రామీణ మండలం సంతేబిదనూరు నుంచి చింతపల్లి, మ్యాల్య, పరిగి మండలం మోదా నుంచి ఐడీహళ్లి, శ్రీరంగరాజుపల్లి నుంచి విట్టాపురం, దాళ్వాటం, పైడేటి నుంచి దొడఘట్ట, దొమ్మితిమోరి, అగళి మండలం మధూడి నుంచి మద్దలూరు, తిమ్మసాగర, ఇరిగేపల్లి నుంచి హర్వేహళ్లి మీదుగా కర్ణాటక ప్రాంతానికి రాత్రి వేళల్లో దాదాపు 400 టన్నుల పైబడి ఇసుక తరలిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ట్రాక్టర్లలో ఇసుక తరలించి పెద్దఎత్తున నిల్వ చేసి అక్కడి నుంచి టిప్పర్లలో దూర ప్రాంతాలకు జాతీయ రహదారుల మీదుగా తరలిస్తున్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులు నిఘా ఉంచినా ఇప్పటి వరకు వీరు పట్టుబడకుండా జాగ్రత్తలు తీసుకొంటూ సొమ్ము చేసుకొంటున్నారు.

**సిబ్బందితో నిఘా పెంచుతాం – మహేశ్, డీఎస్పీ, హిందూపురం**

నదుల్లోని ఇసుకను రాత్రి వేళ కర్ణాటక ప్రాంతానికి తరలించరాదు. దీనిపై సిబ్బందితో నిఘా పెంచి డివిజన్ పరిధిలో ఏఏ గ్రామాల నుంచి తరలిస్తున్నారో గుర్తిస్తాం. దీని వెనుక ఎంతటి వారున్నా వదలం.

ఇసుక తరలిస్తున్న నదులు : పెన్నా, జయమంగళి, సువర్ణముఖి

ఎన్ని మండలాల నుంచి : హిందూపురం, పరిగి, రొద్దం, అగళి

రోజు ఎంత మేరకు : దాదాపు 400 టన్నులు

అక్రమ రవాణా: రాత్రి వేళల్లో

## చేపా చేపా.. ఎందుకు చచ్చావ్?



పుత్తూరు : వైకాపా హయాంలో నారాయణవనం మండలం కీళగరం పంచాయతీ పరిధిలో ఫార్మాస్యూటికల్ కంపెనీ ఏర్పాటు చేశారు. ఇందులోంచి విడుదలయ్యే వ్యర్థాల కోసం ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేశాక, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అయితే కంపెనీ ట్రీట్‌మెంట్ ప్లాంటు అనుమతులు తీసుకున్నా యథేచ్ఛగా వ్యర్థాలను పక్కనే ఉన్న అరుణానదిలోకి వదిలేస్తోంది. అప్పట్లో వైకాపా నాయకుల అండతో ఇదంతా జరిగింది. దీంతో బొప్పరాజుపాళెం పరిధిలో ఈ వ్యర్థాలు నదిలో కలవడంతో చేపలు మృత్యువాత పడ్డాయి.

చేపా.. చేపా.. ఎందుకు ఎండలేదంటే కథల్లో అయితే సమాధానం దొరుకుతుంది. ఇక్కడ ఎందుకు చనిపోయాయంటే.. మాత్రం ఇది కళ్లముందు నిష్ఠుర సత్యం కన్పిస్తున్నా ఎవరూ సమాధానం చెప్పడం లేదు. ఇందులో నారాయణవనం మండలంలోని అరుణానదిని రసాయన వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారుస్తున్న ఓ వైకాపా నేత స్వార్థం దాగుండటంతో ఆ వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు.

**విన్నవిస్తే వచ్చారు.. వెళ్లారు..**

పొలంలో ట్యాంకర్ల ద్వారా ఫార్మాస్యూటికల్ వ్యర్థాలు వదిలితే సమీప గ్రామాలు కాలుష్యం బారిన పడే అవకాశం ఉందని ప్రజలు ఎంపీడీవోకు ఇటీవల విన్నవించారు. దీంతో ఎంపీడీవో గ్రామానికి వచ్చి పరిశీలించి వెళ్లారు తప్ప నేటికీ పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

**కొత్త ఎత్తుగడ**

నదిలో చేపలు మరణించడంతో గ్రామస్థులు ఆందోళన చేశారు. దీన్ని తిప్పికొట్టేందుకు స్థానిక వైకాపా నేత ఓ కొత్త ఎత్తుగడ వేశారు. అరణ్యం కండ్రిగ సమీపంలో కైలాసకోనకు వెళ్లే దారిలో తనకున్న భూమిని కంపెనీకి లీజుకు ఇచ్చేశాడు. ట్యాంకర్లతో రసాయన వ్యర్థాలను అక్కడికి తెచ్చి భూమిలో కలుపుతున్నారు. వర్షాకాలంలో ఈ నీరు అరుణానదిలోకే వెళ్తాయని, తద్వారా భవిష్యత్తులో భారీనష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులొచ్చాయి.. తనిఖీ చేస్తాం**

నారాయణవనం పరిధిలోని ఫార్మా కంపెనీకి అనుమతులు ఉన్నాయి. ఆ కంపెనీ వ్యర్థాలను బయట ప్రాంతాల్లో వదులుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేశారు. తనిఖీ చేసి వాస్తవమని తేలితే వారిపై చర్యలు తీసుకుంటాం. విధిగా ట్రీట్‌మెంట్ చేసి వ్యర్థాలు బయటకు వదలాలి. లేకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

రాజశేఖర్, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి, తిరుపతి

## లోపాయికారీ పక్షం.. లాభాలే లక్ష్యం

పాకాల: వారంతా ఒకప్పుడు మామిడి రైతులే.. తోటల సాగులో కష్టనష్టాలు స్వయంగా చూసినవారే. దిగుబడులు అమ్ముకునేందుకు మార్కెట్‌కు వచ్చి ఇక్కడి దోపిడీని చూసి మథనపడినవారే. ఈ బాధలు పడలేమంటూ దిగుబడులను ట్రాక్టర్లలో పరిశ్రమలకు తరలించడానికి పడే కష్టాలన్నీ వారికి సుపరిచితమే. ఈ అనుభవాలతోనే వారిలో కొందరు మెల్లగా వ్యాపారులు, సప్లయర్లుగా మారారు. ఇక తమ కష్టాలు తీరి ఊరట దక్కుతుందని సహచర రైతులంతా ఊపిరిపీల్చుకున్నారు. కానీ రైతు ముసుగులో వచ్చినవారే రాబందులవుతారని ఊహించలేకపోయారు.

కాయలు తెచ్చే రైతులు, సప్లయర్లకు గుజ్జు పరిశ్రమలు వేర్వేరుగా గుర్తింపు కార్డులు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ఈ వివక్ష రైతు పాలిట శాపంగా మారింది. సాధారణంగా టేబుల్ రకం మామిళ్లను మార్కెట్‌లోని మండీలకు తెస్తే దింపుడు కూలీ, లోడింగ్ ఛార్జీలు, కాటా కూలీ, మండీ కమీషన్, తూకాల్లో మోసాలు ఉంటాయి. ఈ దోపిడీ నుంచి ఉపశమనం దొరుకుతుందని భావించిన రైతులు వారే నేరుగా పరిశ్రమలకు తరలిస్తున్నారు. తొలినాళ్లలో పరిశ్రమలకు కాయలు తెచ్చే రైతుకు ఇచ్చే ధరకన్నా సప్లయర్‌కు కిలోపై 50 పైసలు అదనంగా చెల్లించేవారు. తర్వాత రూపాయి చొప్పున ఇస్తూ వచ్చారు. ఈసారి ఆ మొత్తాన్ని కనీసం రూ.2కు పెంచాలని సప్లయర్లు పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో 'సూట్' పేరుతో టన్నుకు 25 కిలోల కాయలు రైతు నుంచి అదనంగా తీసుకుంటున్నా



రు. ఇలా ఐదు టన్నులకుగాను 4.875 టన్నులకే రసీదు ఇస్తున్నారు. ఇదేమంటే రవాణాలో నలిగిపోయే కాయల నష్టాన్ని భర్తీ చేసుకోవడానికంటూ ముక్తాయిస్తున్నారు. ఇంకొందరు వ్యాపారులు రైతుల తోటల వద్దకే వచ్చి పక్వానికి వచ్చిన కాయలు కోస్తూనే ఏకంగా టన్నుకు 50 కిలోలను సూట్ కింద తగ్గించేస్తుండటం గమనార్హం.

**సిండికేట్ల కట్టుబాటు.. కర్షకులకు గ్రహపాటు**

సప్లయర్లుగా మారిన వారంతా బృందంగా ఏర్పడి ఫోన్లలోనే సమాచారం పంచుకుంటూ ఎప్పటికప్పుడు ధరలను కట్టడి చేస్తున్నారు. గుజ్జు పరిశ్రమల యజమానులు సైతం వీరికే సహకరిస్తుండటంతో వీరి ఆటలు సాగుతున్నాయి. పొరపాటున సప్లయర్ ఎవరైనా రైతుకు అదనంగా చెల్లించినట్లు తెలిస్తే మిగతా వారంతా అతనిపై ఒత్తిడి తెచ్చి నిలదీస్తున్నారు. బయటి రాష్ట్రాల వ్యాపారులనూ నియంత్రిస్తున్నారు. రెండేళ్ల కిందట బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రైతుల నుంచి అదనపు ధర పెట్టి కాయలను కొనగానే స్థానిక వ్యాపారులు, సప్లయర్లు వారిపై దాడి చేసిన ఘటనే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం క్రియాశీలకంగా లేకపోవడంతో మామిడికి గిట్టుబాటు ధర కలగానే మారుతోంది. **కిం కర్తవ్యం:** ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటేగానీ ఆరుగాలం కష్టపడిన తమకు ఫలితం దక్కే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఇదే సమయంలో ఉద్యానశాఖ అధికారులు కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశ్రమల యజమానులతో చర్చించి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

## దేవాలయాలకు మహర్దశ

అనకాపల్లి : తక్కువ ఆదాయంతో దీపధూప నైవేద్యాలకు ఇబ్బంది పడుతున్న దేవాలయాలకు మహర్దశ పట్టనుంది. దీపధూప నైవేద్యాలతోపాటు అర్చకుల జీతాల నిమిత్తం గ్రామాల్లోని పురాతన దేవాలయాలకు దేవాదాయ శాఖ ప్రతినెలా కొంత నగదు అందిస్తుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో నెలకు కేవలం రూ. 5 వేలు ఇచ్చేవారు. అదికూడా కేవలం 74 దేవాలయాలకే అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దేవాలయాలకు ఇచ్చే డబ్బును రూ. 10 వేలు చేసింది. దీనిలో అర్చకుని జీతంగా రూ.7 వేలు, దీపధూప నైవేద్యాలకు రూ. 3 వేలు కేటాయించారు. మరిన్ని దేవాలయాలకు ఈ పారితోషికం అందివ్వాలని నిర్ణయించారు. ఆలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తి కావాలి. గ్రామీణ ప్రాంతంలో ఉండాలి. ఆలయానికి



భూమి అయిదు ఎకరాలలోపు ఉండాలి. ఆదాయం రూ. లక్షకు మించరాదు. ఇటువంటి దేవాలయాలకు అండగా ఉండాలని నిర్ణయించారు. పెంచిన డబ్బును గత నవంబరు నుంచి అందిస్తున్నారు. సహాయం అందించాలని 12 దరఖాస్తులు వివిధ ప్రాంతాల నుంచి దేవాదాయశాఖకు వచ్చాయి. వీటిని పరిశీలించి తొమ్మిదింటిని అర్హత ఉన్నట్లు గుర్తించారు. వీటిలో మాడుగుల నియోజకవర్గంలో ఏడు ఉండగా చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలో ఒక్కొక్కటి ఉన్నాయి. ఆలయ భూములను బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇచ్చి వాటి ద్వారా వచ్చే ఆదాయం పెంచాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో దేవాలయాలకు 5,746 ఎకరాల భూమి ఉంటే దానిలో 1,350 ఎకరాలు కౌలుకు ఇస్తున్నారు. గత ఏడాది కౌలుద్వారా రూ. 1,64,94,583 ఆదాయం వచ్చింది. దీన్ని కనీసం రూ. 1.90 కోట్లకు పెంచాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం భూములు కౌలుకు ఇచ్చే ప్రక్రియ సాగుతోందని దేవాదాయశాఖ జిల్లా అధికారి కె.ఎల్.సుధారాణి తెలిపారు.

# ఊరూరా మృత్యు గండాలు

పొదిలి : వేసవి సెలవులు వచ్చేశాయి..ఇక విద్యార్థులు చెట్లు, చేమలు..వాగులు, వంకల వద్దకు పరుగులు పెడుతుంటారు. ఈత రాని చిన్నారులు వాటిలో మునిగి మృత్యువాత పడుతున్నారు. దీంతో బిడ్డలు ఇళ్లకు వచ్చిన సంతోషం కాస్తా ఆవిరై..విషాదం అలముకుంటోంది. జిల్లాలో చెరువులు, సాగర్ కాలువలే కాకుండా గ్రానైట్, మట్టి గుంతలు చిన్నారుల పాలిట మృత్యు గండాలుగా మారుతున్నాయి. మార్కాపురం ప్రాంతంలోని గుండ్లకమ్మ నది, పొదిలిలోని ముసి వాగు, చిన్నచెరువులకు నీరు చేరే కాలువల వద్ద ఏటా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో ఎక్కువగా వాటర్‌షెడ్, ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన చెక్‌డ్యామ్‌లున్నాయి. వర్షాలు పడినప్పుడు అందులో నీరు చేరడంతో విద్యార్థులు సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు.

**సాగర్ కాలువలతో..**

త్రిపురాంతకం, చీమకుర్తి, దర్శి ప్రాంతాల్లోని సాగర్ కాలువల్లో దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చీమకుర్తి మండలంలోని ఓబీసీ కాలువలో గ్రానైట్ కార్మికులు స్నానాలకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. త్రిపురాంతకం మండలంలోని సాగర్ ప్రధాన కాలువ వంతెన వద్ద ముప్పు పొంచి ఉంది. గతంలో ఇక్కడ ఈతకు దిగిన పలువురు మృత్యువాత పడ్డారు.

**ఎన్నో ఘటనలు..**

పొదిలి చిన్నచెరువు అలుగు వాగులో గతంలో ఈతకు వెళ్లిన యువకు



డు ఊపిరి ఆడక చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయి ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. స్థానికంగా రైల్వేకట్టల నిర్మాణం నిమిత్తం గుత్తేదారులు చిన్నచెరువు కాలువలో భారీ లోతున తవ్వేసి గ్రావెల్ తరలించారు. పొదిలిలోని నీటి గుంతల్లో పడి ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

పొదిలి మండలం యేలూరు సమీపంలోని ముసి వాగులో అక్రమార్కుల ఇసుక దోపిడీతో భారీ గుంతలు పడ్డాయి. రెండేళ్ల క్రితం అందులో ఈతకు దిగి ఇద్దరు పిల్లలు దుర్మరణం చెందారు. ఇక్కడ అనధికారిక ఇసుక తవ్వకాలకు అడ్డుకట్టపడటం లేదు.

**సూచికలు, రక్షణ చర్యలతో కొంత మేలు**

గ్రామాల్లోని చెరువులు, కాలువల వద్ద నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి. వేసవి కాలంలో ఆయా ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పోలీసుల బీట్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను కొంతైనా నివారించే అవకాశముంది. లోతు ఎక్కువగా ఉండే సాగర్ కాలువలు, చెరువుల్లో ఈత సాధన ప్రమాదకరం. శిక్షకుల సమక్షంలో ఈత కొలనుల్లో మాత్రమే నేర్చుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిత్యం వారు ఎక్కడకు వెళుతున్నారన్న దానిపై ఓ కన్నేసి ఉంచాలి. తమ ప్రాంతాల్లో ముప్పు పొంచివున్న చెరువులు, నీటి గుంతల వద్దకు వెళ్లకుండా కట్టడి చేస్తే ఫలితముంటుంది.

# ఉన్నారా..? కళ్లు మూసుకున్నారా?

అమరావతి: కుక్కలు జనంపై దాడి చేస్తుంటే.. జీఎంసీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉంది. ఈ నెల 6న నాలుగేళ్ల చిన్నారి ఐజక్ శునకాల దాడిలో మరణించినప్పుడు హడావుడి చేసిన అధికారులు.. అవి దాడులు చేయకుండా నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఫలితం.. ఒక్కరోజే 20 మంది కుక్కకాట్లకు గురవ్వడం. వాటికి సంతతి నియంత్రణ శస్త్రచికిత్స (ఏబీసీ)లు చేయించకుండా చేష్టలుడిగి చూస్తున్నారు. ఒప్పంద సంస్థ నిర్వహణలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవాలని భారత జంతు సంక్షేమ బోర్డు సూచించాక గత జనవరి 9 నుంచి ఈ శస్త్రచికిత్సలు ఆగిపోయాయి. తిరిగి ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

నిర్మాణాత్మక చర్యలేవీ?

దాదాపు పది లక్షలకుపైగా జనాభా ఉన్న నగరంలో కుక్కల నియంత్రణ వ్యవస్థ పక్కాగా ఉండాలి. ఇందుకు పశువైద్య విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. జీఎంసీ ఈ పని చేయకుండా పశుసంవర్ధక శాఖ నుంచి ఒక పశువైద్యుడిని వర్క్ అరేంజ్‌మెంట్ కింద తీసుకుంది. ఇలా వస్తున్న వైద్యులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతో ఇబ్బందులొస్తున్నాయి.

ఏబీసీ శస్త్రచికిత్స చేశాక కుక్కలను రెండురోజులపాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంచాలి. శస్త్రచికిత్స చేసినట్టు ట్యాగ్ కట్టాలి. నగరంలో ఇవేమీ జరగడం లేదు.

హరియాణాకు చెందిన ఓ సంస్థ కుక్కలకు శస్త్రచికిత్సలు చేయడానికి జీఎంసీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు ఒక్కో శునకానికి రూ.1,500 చెల్లించాలి. 3,144 కుక్కలకు శస్త్రచికిత్స చేశాక ఆ సంస్థ ఆపేసింది. ఈ ప్రక్రియ పరిశుభ్రమైన వాతావరణంలో జరగడం లేదని జంతు సంక్షేమ బోర్డుకు ఫిర్యాదు వెళ్లడంతో.. లోపాలను సరిదిద్దాలని ఆదేశాలొచ్చినాచర్యలూ తీసుకోలేదు.

ఇటీవల సంఘటనల నేపథ్యంలో జీఎంసీ వినతి మేరకు పశుసంవర్ధన శాఖ నలుగురు పశువైద్యులను తాత్కాలికంగా పంపింది. జీఎంసీ పశువైద్యుడు మిగిలిన వారిని సమన్వయం చేసుకుని యుద్ధప్రాతిపదికన కుక్కల సంతతి నియంత్రణ చర్యలు చేపట్టాల్సి ఉన్నా.. అంతులేని జాప్యం చోటుచేసుకుంటోంది.

వారానికి 40 చొప్పున నెలకు 160 కుక్కలకు సంతతి నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని ప్రణాళిక రూపొందించారు. నిర్ణయం తీసుకుని 15 రోజులైనా.. ఇప్పటికీ అది పట్టాలకెక్కలేదు. ఎట్టకేలకు సొమ్ము విడుదల చేసిన నాలుగురోజుల తర్వాత రూ. 3 లక్షలతో సామగ్రి కొనుగోలు చేశారు. శస్త్రచికిత్సలు ఎప్పుడు ప్రారంభిస్తారో వేచిచూడాల్సిందే.

రోడ్లపైనే ఆవుల సంచారం

నగరంలోని ప్రధాన రహదారులపై ఆవులు తిరుగుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా పరిణమించాయి. ఇటీవల ఏటుకూరు రోడ్డులో హైకోర్టు న్యాయమూర్తి చూస్తుండగానే.. ఓ ద్విచక్రవాహనదారుడు ఆవును ఢీకొట్టారు. ఆవుకు కాలు విరిగిపోవడంతో న్యాయమూర్తి చొరవ తీసుకుని వైద్యం చేయించిన సంగతి తెలిసిందే. జీఎంసీ ప్రత్యేకంగా వెంగళాయపాలెంలో గోశాల నిర్వహిస్తోంది. రోడ్లపై తిరుగుతున్నవాటిని మున్సిపల్, పోలీసుల సహకారంతో వాటి యజమానులకు కౌన్సెలింగ్ చేసి అప్పగించాలి. లేదంటే గోశాలకు తరలించి సంరక్షించాలి. జీఎంసీ యంత్రాంగం ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

# ఉన్నత విద్యకు చిరునామా.. తితిదే విద్యాసంస్థలు



తిరుపతి : పదోతరగతి వరకు ఒక ఎత్తయితే.. ఇకపై చదివే విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉంది. భవిష్యత్తును నిర్ణయించే విద్య ఇదే. మంచి కోర్సులను ఎంపిక చేసుకుని చేరాలి. ఇంటర్ స్థాయిలో తితిదే విద్యాసంస్థలు వివిధ కోర్సులతో నాణ్యమైన విద్యనందిస్తున్నాయి. శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల అందులో ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లో ఎన్నో కార్పొరేట్ కళాశాలలు, ఇతర కళాశాలలు ఉన్నా.. తితిదే విద్యాసంస్థలకు ప్రత్యేక డిమాండ్ ఉంది.

**జూనియర్ కళాశాలలు**

శ్రీపద్మావతి, ఎస్వీ జూనియర్ కళాశాలలు ఇంటర్‌లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, సీఈఎల్ కోర్సులు అందిస్తున్నాయి. ఆంగ్ల, 4 తెలుగు మాధ్యమాల్లో 11 సెక్షన్లు నడుస్తుండగా.. 968 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీరిలో 500 మందికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. 14,779 పుస్తకాలు, జర్నల్స్‌తో గ్రంథాలయం ఉంది. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి తెలిపారు.

**చదువుతోపాటు ఆధ్యాత్మిక విలువలు నేర్పించడం తితిదే కళాశాలల ప్రత్యేకత.**

విద్యనందించడంతోపాటు క్రమశిక్షణ నేర్పిస్తూ, చక్కటి బోధన అందిస్తుంది.నిరంతర పర్యవేక్షణతోపాటు క్రీడలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, భగవద్గీత శ్లోక పఠనం, ధ్యానం, యోగాలో శిక్షణ ఉంటుంది.

**ప్రత్యేక తరగతుల నిర్వహణ**

మూడేళ్లుగా కళాశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఎయిడెడ్ కళాశాలల్లో జిల్లాకే తలమానికంగా నిలుస్తోంది. విద్యార్థినుల స్థితిగతులను అంచనా వేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షలు, ఒత్తిడిని అధిగమించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు కళాశాలలో స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థినుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. చదువుతోపాటు విద్యార్థినులకు క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, యోగా, కరాటేలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

**ఉచిత వసతి**

కళాశాలలో విద్యనభ్యసించే దూర ప్రాంత విద్యార్థినులకు ఉచిత భోజన, వసతి సదుపాయాన్ని కల్పిస్తున్నారు. సుమారు వెయ్యి మందికిపైగా విద్యార్థినులు వసతి పొందుతున్నారు. వీరికి రోజూ రాత్రి 8 గంటల నుంచి 10వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. ఇక్కడి విద్యార్థినులపై ప్రిన్సిపల్, వార్డెన్, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

**సీట్లు పెంచితే మరింత ఉపయోగం**

తితిదే కళాశాలల్లో ఏటా సీట్ల కోసం విద్యార్థినులు పడే పాట్లు అన్నీఇన్నీ కావు. కళాశాలలో సీట్ల సంఖ్య పెంచాలని కళాశాల అధికారులు వైకాపా హయాంలో పలుమార్లు తితిదే అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. కూటమి పాలనలో అయినా సీట్ల సంఖ్య మరింత పెంచాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

**పాలిటెక్నిక్ విద్యకు..**టెక్నికల్ విద్యలోకి ప్రవేశించాలనుకునే విద్యార్థులకు శ్రీపద్మావతి మహిళా, ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలు టెక్నికల్ విద్యను అందిస్తున్నా యి. డీఈసీఈ, డీసీసీపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం వంద సీట్లున్నాయి.

# పల్లెసీమలో ప్రగతి కొమ్మలు



కర్నూలు : గ్రామ స్వరాజ్యానికి మూలస్తంభంలాంటి పంచాయతీ వ్యవస్థ వైకాపా హయాంలో పతనమైంది. పంచాయతీలకు సర్వాధికారాలు కల్పించిన 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి తూట్లు పొడిచారు. పల్లె నిధులు ఇతర పథకాలకు మళ్లించి ప్రగతిని దూరం చేశారు.. కూటమి ప్రభుత్వం రాకతో పల్లెలకు మంచిరోజులొచ్చాయి. గ్రామాలకు పెద్దఎత్తున నిధులు సమకూరుతున్నాయి. అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉపాధి నిధులతో చక్కటి రహదారులు ఏర్పాటవుతున్నాయి. తాగునీటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**పంచాయతీలకు 'రాజ'మార్గం**

కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది. ఉపాధి హామీ నిధులతో గ్రామీణ రహదారులు సొబగులు దిద్దుకుంటున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నడిచేందుకు కూడా వీలుకాని పరిస్థితుల నుంచి ప్రస్తుతం అందమైన మార్గాలుగా ఏర్పడుతున్నాయి. పల్లె పండగలో భాగంగా ఉపాధి నిధులతో చేపట్టిన రహదారుల పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. జిల్లాలో 1,357 పనులకుగాను 1,091 వరకు పూర్తి చేశారు. 141.83 కి.మీ. మేర రహదారులు నిర్మించారు. నంద్యాల జిల్లాలో 1,019 పనులకుగాను 951 వరకు పూర్తయ్యాయి. 141 కి.మీ. విస్తీర్ణం మేర నిర్మించారు.

**సంపద సృష్టించి**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 గ్రామ పంచాయతీలు ఉండగా.. 2024-25లో 15వ ఆర్థిక సంఘం మొదటి విడత కింద రూ.51 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేసింది. 620 ప్రాంతాల్లో సంపద సృష్టి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాలను తడి పొడి చెత్తగా వేరు చేసి వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నారు. ఈ విధానం అమలుచేయడం ద్వారా పంచాయతీలు శుభ్రంగా ఉండటంతోపాటు ఆదాయం సమకూరుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

**వీధుల్లో కాంతులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఈడీ వీధి దీపాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు. ఉమ్మడి జిల్లాలో 1,81,503 స్తంభాలకు 1,68,430 ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటుచేశారు. గత వైకాపా పాలనలో వీధిదీపాలు నిర్వహించే ఏజెన్సీని రద్దు చేశారు. ఫలితంగా పల్లెల్లో చీకట్లు అలుముకున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈఈఎస్ఎల్ కంపెనీకి బాధ్యతలు అప్పగించడంతో పల్లెల్లో 'వెలుగులు నిండాయి.

**జలసత్వాలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.856 కోట్ల విలువైన 2,269 జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టింది. పల్లె ప్రజల దాహార్తి తీర్చేందుకు జలాశయాల నుంచి నీటిని పంపింగ్ చేసి ప్రణాళికాబద్ధంగా పనులు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లాలో 721 ఆవాసాలకు 2.140 టీఎంసీల నీటిని గోరుకల్లు, పులికనుమ, గాజులదిన్నె, పందికోన జలాశయాల ద్వారా అందించనున్నారు.

**4,700 నీటి కుంటలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధి నిధులతో 4,700 నీటి కుంటలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. దీనిద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెందేలా చర్యలు చేపట్టారు. 1,657 పశువుల నీటి తొట్టెలు ఏర్పాటుకుగాను ప్రభుత్వం నిధులు కేటాయించింది. రూ.19 కోట్ల వ్యయంతో 854 గోకులం షెడ్లకుగాను 587 పనులు పూర్తయ్యాయి. వ్యవసాయానికి సైతం ప్రభుత్వం చేయూతనిస్తూ పల్లెల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోంది.

# ఎకరం రూ.7వేలకు తీసుకుని.. నాలుగురెట్లు దోపిడీ!

సీతానగరం : మఠానికి చెందిన పంటభూములకు బహిరంగ వేలం నిర్వహించకుండా కొంతమందికి నామమాత్రపు ధరలకు అప్పగిస్తూ రూ.లక్షల ఆదాయానికి గండికొడుతుండటం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ సమీపంలోని గోడాడ గోషాయ్ మఠానికి చెందిన విలువైన భూములు సీతానగరం మండలం కాటవరంలో 51.68 ఎకరాల్లో ఉన్నాయి. ఏటా బహిరంగ వేలం నిర్వహించకుండా ఎకరం రూ. 7వేలు చొప్పున కొంతమందికి ఈ భూములను దేవాదాయశాఖ అప్పగిస్తోందని స్థానిక రైతులు వాపోతున్నారు. ఎకరం రూ. 7వేలు చొప్పున తీసుకున్న వారిలో కొంతమంది.. రూ. 25వేలు నుంచి రూ. 35వేలకు చిన్న, సన్నకారు రైతులకు కౌలుకు ఇస్తుండటం ఇక్కడ చర్చనీయాంశమైంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బహిరంగ వేలం నిర్వహించాలని కలెక్టర్‌కు వినతులు అందిస్తున్నా ప్రయోజనం లేకపోయిందంటున్నారు. వేలం పెట్టడం వల్ల ప్రభుత్వానికి ఆదాయంతో పాటు సన్నకారు రైతులకు నిర్దేశించిన కౌలుకు భూములు దొరుకుతాయంటున్నారు. ఈనెలలో బహిరంగ వేలం పెడుతున్నట్లు కరపత్రాలు పంపిణీ చేయడం, గ్రామపంచాయతీ వద్ద నోటీసు బోర్డులో పెట్టి మమ అనిపించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం మఠం భూములకు సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్లు మరోసారి ప్రచారం చేయడంతో రైతులంతా అక్కడకు చేరామని.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూసినా అధికారులు మొహం చాటేశారన్నారు. ఈ ఏడాది మఠం భూములకు ఎట్టిపరిస్థితుల్లోనూ వేలం



నిర్వహించాల్సిందేనని భాజపా సీనియర్ నాయకులు గూడపాటి జయరామ్ స్పష్టం చేశారు. రైతుల ఆందోళన, భూముల వేలంపై రాజమహేంద్రవరం దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యనిర్వహణాధికారి వి.శ్రీకృష్ణదేవిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఎకరం రూ. 7వేలు కౌలు వాస్తవమన్నారు. ఈ ఏడాది బహిరంగ వేలం నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు.

# అపరాల సాగుకు చేయూత

నరసరావుపేట: ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటల సాగు సమయంలోపు వేసవిలో అపరాలు సాగు చేస్తే అదనపు ఆదాయం పొందే వెసులుబాటు ఉంది. దీంతోపాటు పచ్చిరొట్ట పైర్లుగా ఉపయోగించుకునే అవకాశం లభిస్తుంది. దీనివల్ల భూసారం వృద్ధి చెందుతుంది. ప్రధాన పంటల సాగుకు ఎరువుల అవసరం కూడా తగ్గుతుంది. బహుళ ప్రయోజనాలు ఉన్నందున ప్రభుత్వం వేసవిలో అపరాల సాగును ప్రోత్సహిస్తోంది. 50 శాతం రాయితీతో విత్తనాలు రైతులకు అందిస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో స్వల్పకాలిక పంటలైన నువ్వు, రాగి, కొర్రలు సాగు చేసుకునే అవకాశం ఉన్నందున ఆయా పంటల విత్తనాలు రాయితీతో పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు లక్ష్యాలు నిర్దేశించి రైతులు సాగు చేసేలా వ్యవసాయశాఖ అవగాహన కల్పిస్తోంది. ఇందుకు అవసరమైన విత్తనాలను ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా పంపిణీ చేస్తున్నారు. వేసవి అపరాల



సాగును ప్రోత్సహించడం ఐదేళ్ల తర్వాత మళ్లీ మొదలైంది. వైకాపా పాలనలో అటకెక్కిన పథకాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కించింది. విచ్చలవిడి రసాయన ఎరువుల వాడకంతో దెబ్బతిన్న భూములను బాగు చేసుకునేందుకు ఈ పంటల సాగు తోడ్పడుతుంది. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలన్నా లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, సాగు మొదలవగా తాజాగా వేసవి అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు పంటలను రైతులకు సూచిస్తోంది. తొలకరి జల్లులకు భూములు దున్ని దుక్కులు చేసుకున్న భూముల్లో వర్షం వచ్చిన వెంటనే విత్తనాలు చల్లితే మంచి ప్రయోజనాలు ఉంటాయి

# ఎత్తిపోయిన పథకం.. ఎండిపోయిన పొలం

ఎమ్మిగనూరు : తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టును స్థిరీకరించి పశ్చిమ ప్రాంత రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో రూపొందించిన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని వైకాపా 'నీరు'గార్చింది. మోటార్లు, పంప్‌హౌస్‌లు, విద్యుత్తు నియంత్రికలు, పైపులైన్లు నిర్వహణ చేపట్టకపోవడంతో పథకం ఎత్తిపోయింది. మోటార్లు బాగు చేసి ఐదేళ్లు బీళ్లుగా మారిన పొలాలకు నీళ్లు మళ్లించాలని అన్నదాతలు 'కూటమి' ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

**పైసా ఇవ్వని వైకాపా**

తుంగభద్ర నుంచి నీటిని తోడి ఆయకట్టుకు మళ్లించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు పునాది వేశారు. రూ.180 కోట్లు వెచ్చించారు. ఏటా 5.373 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 40 వేల ఎకరాల ఆయకట్టు, 10 వేల ఎకరాల ఆరుతడి పంటలకు సాగునీరు ఇవ్వాలి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వహణకు పైసా ఇవ్వలేదు.

రైతులే స్వయంగా ఎకరానికి రూ. 1,000 నుంచి రూ. 2 వేల చొప్పున విరాళాలు సేకరించి మోటార్ల మరమ్మతులు, కాల్వలు, ఇతర పనులకు ఖర్చు చేశారు. సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు పారేలా



రైతులు స్వయంగా ఏటా నిర్వహణకు రూ. 3 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. 15 కోట్లకుపైగా ఖర్చు చేయడం గమనార్హం. కానీ కొన్ని పథకాల్లో మోటార్లు సక్రమంగా పని చేయకపోవడంతో దిగుబడులొచ్చే సమయానికి నీరు లేక ఎండిపోయి రూ.కోట్లలో నష్టపోయారు.

దొంగల పాలయ్యాయి

సోగనూరు ఎత్తిపోతల పథకంలో ఆరు మోటార్లకు మూడు పని చేస్తున్నాయి. స్టేజ్-2 పంపుహౌస్ వద్ద రెండే పని చేయడంతోపాటు జలాశయంలో ముళ్లపొదలు, రాతిపరుపు కదిలింది. నాలుగు మోటార్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చిలకలడోణ ఎత్తిపోతల స్టేజ్-1 తుంగభద్ర నది ఒడ్డున నదికైరవాడి వద్ద స్టేజీ-1 ఏర్పాటు చేశారు. ఇందులో 1,250 కేవీ (33 కేవీ) విద్యుత్తు నియంత్రిక బిగించారు. నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసి రాగితంతిని అపహరించారు.

పూలచింత స్టేజ్-1 గంగవరం వద్దనున్న ఎత్తిపోతల నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసి రూ. 7.50 లక్షల విలువైన 750 కిలోల రాగితంతిని చోరీ చేశారు. వీటిలో మోటార్లకు అరకొరగా మరమ్మతులు చేయించారు.

మాధవరం స్టేజ్-1 పంపుహౌస్‌లో రెండు నియంత్రికలు, మూడు స్టార్టర్లు, ఇన్సులేటర్లు, బ్రేకర్లు, బ్యాటరీలు, 9 కాపర్ షీట్లను ఎత్తుకెళ్లారు. చిలకలడోణలో మెకానిక్‌లు, అవసరమైన సామగ్రికి సుమారు రూ. 20 లక్షల వరకు ఖర్చు చేయాల్సిందే. బసలదొడ్డి ఎత్తిపోతల పథకంలో రెండు పంప్‌హౌస్‌లో మోటార్లు అరకొరగా నడుస్తున్నాయి.

**రూ.17.50 కోట్లతో ప్రతిపాదనలు**

భాస్కర్‌రెడ్డి, ఈఈ

మోటార్ల మరమ్మతులు, ఇతర పనులకు సుమారు రూ. 17.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఏడు ఎత్తిపోతల పథకాలకు అవసరమైన మోటార్లు, పైపులు, ఇతర నిర్వహణకు సిద్ధం చేశాం. పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాల నిర్వహణకు గుత్తేదారులకు గడువు ఉంది. వీటి నిర్వహణ వారే చూస్తారు. వచ్చే సీజన్‌లోపు అన్ని పథకాల ద్వారా రైతులకు సాగునీరు పారించాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేశాం.

# కరవు తీర్చేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళిక

తిరుపతి: సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పురోగతిపై సమీక్షిస్తున్నారు. గాలేరు- నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సన్నద్ధమయ్యారు. తక్కువ ఖర్చుతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించారు. సంబంధిత అంచనాలు, డిజైన్లను ఉన్నతాధికారులకు పంపారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తూర్పు ప్రాంతాలకు జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ముఖ్యం. తిరుపతి నగరం, తిరుమలతో కలిపి ఐదు లక్షల మందికి తాగునీరు అందించవచ్చు. అదేవిధంగా వెంకటగిరి, శ్రీకాళహస్తి, నగరి నియోజకవర్గాల్లోని 1.05 లక్షల ఎకరాలు సస్యశ్యామలమవుతాయి. గతంలో ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట జలాశయం నుంచి నీరు తీసుకోవాలని ప్రణాళికలు రూపొందించినా అటవీ శాఖ అనుమతుల్లో జాప్యం జరిగింది. ఈ క్రమంలోనే ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కండలేరు రిజర్వాయర్ నుంచి తరలించాలని భావించారు.



వైకాపా హయాంలో పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి జలాశయానికి ప్రత్యేకంగా అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు తగ్గట్టుగానే జీఎన్ఎస్ఎస్ అధికారులు రూ. వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మూడు రిజర్వాయర్లు పూర్తయిన తర్వాత నగరి నియోజకవర్గంలోని వేణుగోపాలసాగర్, వేపగుంట, అడవికొత్తూరు రిజర్వాయర్లకు నీటిని తరలిస్తారు. అల్లూరుపాడు రిజర్వాయర్‌కు సంబంధించి 52 ఎకరాల అటవీ భూమి సమస్య తేలాలి.

జీఎన్ఎస్ఎస్‌తో సాగుకానున్న ఆయకట్టు 1.05 లక్షల ఎకరాలు
తాగునీరు 5 లక్షల మందికి
మల్లెమడుగు రిజర్వాయర్ అంచనా వ్యయం రూ.280 కోట్లు
బాలాజీ రిజర్వాయర్ అంచనా వ్యయం రూ.320 కోట్లు

# బాడుగకు ఇచ్చేలా... భారం తొలగించేలా!

విజయనగరం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్‌లు)కు బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు గుదిబండగా మారాయి. నిరుపయోగంగా మారడంతో వీటిపై తీసుకున్న రుణాలు చెల్లించడం సొసైటీలకు భారమవుతోంది. ఈ నేపథ్యంలో వీటిని అద్దె లేదా లీజుకిచ్చేందుకు సహకార అధికారులు సన్నద్ధమవుతున్నారు. మార్క్‌ఫెడ్, పౌర సరఫరాల శాఖల అవసరాలకు వినియోగించే విషయమై సంబంధిత అధికారులతో ఇప్పటికే చర్చించారు. తక్కువ పరిమాణం కావడంతో ప్రైవేటు సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇప్పటికే రిలయన్స్, టాటా వంటి సంస్థల ప్రతినిధులతో చర్చించారు.

**నెలకు రూ.40-50 వేలు**

జిల్లాలో 44 సొసైటీలకు గోదాములు మంజూరయ్యాయి. 500, 1000 టన్నుల పరిమాణంలో నిర్మాణం చేపట్టారు. ఇందులో గుషిణి, తమ్మాపురం, వేపాడ-2 వెయ్యి టన్నులవి. మిగిలినవి 500 టన్నుల పరిమాణం కలవి. ఇప్పటివరకు 24 మాత్రమే పూర్తయ్యాయి. 500 టన్నుల గోదామును రూ.40 లక్షల వ్యయంతో చేపట్టారు. ఇందులో రూ.36లక్షలు రుణం, మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. వెయ్యి టన్నుల గోదామును రూ.70 లక్షలతో చేపట్టగా, రూ.63లక్షలు రుణం, మిగిలిన రూ.7లక్షలు ప్రభుత్వం ఇస్తుంది. వీటికి రెండేళ్ల మారటోరియం ఉంటుంది. ఆ తర్వాత నుంచి రుణంపై వడ్డీ, అసలు చెల్లించాలి. అయిదేళ్లలోపు రుణం తీర్చాలి. ఇప్పటికే నిర్మించి రెండేళ్లవుతున్నందున రుణం చెల్లించాలి. నెలకు ఒక సొసైటీ రూ.40-50 వేలు చెల్లించాల్సి ఉంది. నిరుపయోగంగా మారడంతో సొసైటీలకు ఆర్థిక భారం కానున్నాయి.



**భారం పడకుండా ..**

రైతులు పంటలను గోదాముల్లో నిల్వచేసుకుని, రుణం పొందొచ్చనే ఉద్దేశంతో ఈ నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో పంటలను వెంటనే కొనుగోలు చేయడంతో నిల్వ చేయడం లేదు. గోదాములు నిరుపయోగంగా మారాయి. రుణాలు చెల్లించేందుకు సొసైటీలపై భారం పడకుండా ప్రైవేటు సంస్థలకు అద్దె లేదా లీజుకిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 6-7 సంస్థల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి.

**ఇదీ పరిస్థితి...**

మంజూరైన గోదాములు : 44
నిర్మాణం పూర్తయినవి : 24
పనులు జరుగుతున్నవి : 14
ప్రారంభించనవి : 06

**ఎక్కడెక్కడ ఎలా..**

జొన్నవలస సొసైటీ పరిధిలో కోరుకొండ, లక్కిడాం సిరిపురం, గంట్యాడ కొత్తవెలగాడ, పీఎస్ఆర్‌పురం బురదపాడు, బొబ్బిలి దిబ్బగుడివలస, బాడంగి, తెర్లాం, కొట్టక్కి, వేపాడ సొసైటీ పరిధిలో జాకేరు-2, రాజాం పొగిరి, తెట్టంగి అచ్యుతాపురం, గూడేం, సోమలింగాపురం గాతాడ, బొండపల్లి సొసైటీల పరిధిలో గోదాములు నిర్మాణ దశలో ఉన్నాయి. బొండపల్లి మండలం బిల్లలవలస-2, అన్నమరాజుపేట అట్టాడ-2, సతివాడ సీతారామునిపేట-2, కె.ఎం.పురం ముషిడిపల్లి-2, కెల్ల వల్లాపురం-2, గూడేం గోషాడ-2 స్థల సమస్యతో ప్రారంభానికి నోచుకోలేదు. పి.రమేష్, జిల్లా సహకార అధికారి, విజయనగరం

# ఖరీఫ్ సాగాలంటే.. కబ్జాలు తొలగాల్సిందే



అమలాపురం : వైకాపా అయిదేళ్ల పాలనలో సాగునీటి వ్యవస్థ దుర్భరంగా మారింది. ఏటా ప్రకృతి విపత్తులు, భారీ వర్షాల కారణంగా ముంపు సమస్యతో కోనసీమ జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో దాదాపు 22 వేల ఎకరాలు సాగుకు దూరమవుతోంది. 15 రోజులపాటు చేలన్నీ ముంపులో ఉండి నష్టాలు తప్పడం లేదు. సాగునీటి సంఘాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కాలువల నిర్వహణ, ఆక్రమణల తొలగింపుపై దృష్టిసారిస్తే రైతులకు ఇక్కట్లు తప్పే అవకాశముంది.

**పూడిక తీస్తేనే..** జిల్లాలో 16 ప్రధాన, 36 మధ్య తరహా, 200కు పైగా చిన్న తరహా డ్రెయిన్లు ఉన్నాయి. అమలాపురం, రాజోలు సబ్ డివిజన్ల పరిధిలో 845 వరకు ఆక్రమణలున్నట్లు గుర్తించారు. వీటిని తొలగించి అధ్వానంగా ఉన్న మురుగుకాలువల వ్యవస్థను సరి చేయాలి. డ్రెయిన్ల ఆక్రమణల వల్ల నీరు దిగువకు వెళ్లక ముంపు సమస్య తలెత్తి ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అల్లవరం, ఉప్పలగుప్తం, సఖినేటిపల్లి, రాజోలు తదితర మండలాల్లో 2022లో పంట విరామం ప్రకటించారు. - జిల్లాలో దాదాపు 22 వేల ఎకరాలు సాగుకు దూరమవడంతో రూ.105.95 కోట్ల విలువ చేసే 46,200 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కోల్పోవాల్సి వస్తోంది. ఆక్వా చెరువుల్లోని వ్యర్థాలనూ డ్రెయిన్లలోకే విడిచిపెడుతున్నారు.

**కాలువ కప్పేసి నిర్మాణాలు..**

ముమ్మిడివరం మండలం అయినాపురంలో ఇరుమండ డ్రెయిన్ ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. ఏటా వరిచేలు ముంపుబారిన పడుతున్నాయి. - ఐ.పోలవరం మండలం కేశనకుర్రులోని పెరుమాళ్లరాజు డ్రెయిన్ ఆక్రమణలతో ఉంది. ఇరువైపులా రెండు కి.మీ. మేర ఆక్వా చెరువులు ఉండడం.. సిల్టును డ్రెయిన్‌లోకి మళ్లించడంతో పూడిపోయింది. 1,500 ఎకరాలపై ముంపు ప్రభావం ఉంది. - శంకరగుప్తం, వాసాలతిప్ప, వృద్ధ గౌతమి, కూనవరం ప్రధాన మురుగుకాలువల్లో పూడిక సమస్య ఉంది. డ్రెడ్జర్లతో తీయాల్సి ఉంది. కూనవరం కాలువకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రూ.3.55 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు కొంత వరకు చేపట్టారు. - ఉప్పలగుప్తం మండలంలోని డ్రెయిన్లలో పూడికలు తొలగించక ఏటా 2 వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. చల్లపల్లి, జగ్గరాజు, కూనవరం, సరిపల్లిలో ముంపునీరు తరలించే రాచకోడు కాలువలో పూడిక పెరిగింది. గోపవరంలోని సౌత్, నార్త్ పీకలేర్లు, ఉప్పలగుప్తంలో గొరగనమూడి, పాయకరావుకోడు తదితర డ్రెయిన్లదీ ఇదే పరిస్థితి. కూనవరం స్ట్రెయిట్ కట్ నుంచి సముద్రపు నీరు వానపల్లిపాలెం, కూనవరం వరి చేలల్లోకి చొచ్చుకొస్తోంది. గ్రోయిన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

# విద్యుత్తు వెతలకు కూటమి చెక్



కాకినాడ : తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలోని సుమారు 50 గ్రామాల ప్రజలు 30 ఏళ్లుగా విద్యుత్తు సమస్యలు ఎదుర్కొంటున్నారు. తుని మండలం, హంసవరం వద్ద ట్రాన్స్‌కో 132కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసినా, సరఫరాలో అంతరాయాలు, లోవోల్టేజీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని చామవరం ఫీడర్ నుంచి చామవరం, రాజుపేట, తేటగుంట, అన్నవరం, అన్నవరం దేవస్థానం, కత్తిపూడి 33కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్తు సరఫరా అవుతోంది. 30 కిలోవాట్స్ వరకు లోడ్ వినియోగిస్తున్న నేపథ్యంలో సరఫరాలో అంతరాయాలు తప్పట్లేదు.

కూటమి ప్రభుత్వం దీని పరిష్కారానికి చర్యలు చేపట్టింది. 50 గ్రామాల్లోని 60వేల గృహ అవసరాల విద్యుత్తు కనెక్షన్లకు నాణ్యమైన సరఫరాతో పాటు అంతరాయాలు, లోవోల్టేజీ, బ్రేక్‌డౌన్ల కట్టడికి ఏపీఈపీడీసీఎల్ కొత్త లైన్లు మంజూరు చేసింది. దీనికి రూ.4.83 కోట్లు ఇవ్వగా, పనులు ప్రారంభించారు. కొత్తగా నాలుగు లైన్లు మంజూరు చేయగా, రెండు 33కేవీ ఫీడర్లు ఏర్పాటు కానున్నాయి.

**ప్రతిబంధకాలు వీడితేనే..**

కొత్తగా మంజూరైన నాలుగులైన్లు రైల్వే ట్రాక్, 16వ నంబరు జాతీయ రహదారి వెంబడి వెళ్తున్నాయి. అన్నవరం-కత్తిపూడి మధ్య లైన్ల ఏర్పాటుకు జాతీయ రహదారుల విభాగం సుముఖత చూపినా, తేటగుంట-అన్నవరం మధ్య లైన్ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వట్లేదు. కలెక్టర్ చొరవ చూపినా, ఎన్‌హెచ్ విభాగం నుంచి స్పందన రావట్లేదు. రైల్వేశాఖ నుంచి సత్వరం అనుమతులు వస్తే త్వరగా పనులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

**అన్నవరం కొండపై తీరనున్న సమస్య..**

అన్నవరం దేవస్థానంపై 33కేవీ సబ్‌స్టేషన్ ఉంది. అయినా లోవోల్టేజీ సమస్య ఎదురవుతుంది. కొత్తలైన్ల ఏర్పాటుతో సరఫరాలో ఒత్తిడి తగ్గి, ఇక్కడ లోవోల్టేజీ సమస్య తీరుతుందని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 50 గ్రామాల పరిధిలో విద్యుత్తు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టామన్నారు.

# పొలాలకు జలాభిషేకమే

రైతు ప్రభుత్వంగా గొప్పలు చెప్పుకొన్న గత వైకాపా ప్రభుత్వం ఉత్తరాంధ్రకు జీవనాడి అయిన జలాశయాల ఉసురు పోసుకుంది. కనీస నిర్వహణకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. రూ.4949.88 కోట్లు విడుదల చేస్తే అన్ని ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పర్యటనలో ఆ నివేదిక అందించారు.

**ఏ ప్రాజెక్టుకు ఎంతెంత అవసరం (రూ.కోట్లలో..)**

తోటపల్లి కుడి, ఎడమ కాల్వల ఆధునికీకరణ- 154.12, తోటపల్లి ఆధునికీకరణ-300, గజపతినగరం బ్రాంచి కెనాల్ - 211.41, నాగావళి-చంపావతి నదుల అనుసంధానం- 21.53, వంశధార-నాగావళి నదుల అనుసంధానం- 50.23, హిరమండలం ఎత్తిపోతల పథకం-176.35, వంశధార ప్రాజెక్టు స్టేజ్-2లో ఫేజ్-2-188.20, ఆరు మధ్యతరహా ప్రాజెక్టులు-1488.79, జైకా నిధులతో ఏడు మేజర్, మధ్యతరహా ప్రాజెక్టుల ఆధునికీకరణ-289.25, వంశధార, నాగావళి వరద కట్టలు -2070

తోటపల్లి పాత రెగ్యులేటర్ కింద 7.536 టీఎంసీల నీటిని 55,286 ఎకరాలకు సరఫరా చేస్తున్నారు. పాత ఆయకట్టులో 3.566 టీఎంసీలతో 43,542 ఎకరాలు తడుపుతున్నారు. ఇంకా 20,493 ఎకరాలకు అందించాల్సి ఉంది.

వంశధార-నాగావళి నదుల అనసంధానం పూర్తి చేస్తే 5 వేల ఎకరాలకు నీరందే అవకాశం ఉంటుంది.

గజపతినగరం బ్రాంచి కెనాల్ పూర్తి చేస్తే 15 వేల ఎకరాలను సస్యశ్యామలం చేయవచ్చు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9,183 చెరువుల కింద 2,79,991 ఎకరాలు, 43 ఎత్తిపోతల పథకాల కింద 9,651 ఎకరాలకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నారు. బావులు, బోర్ల కింద 51,318 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు.

తాటిపూడి నుంచి 1.820 టీఎంసీలను 15,366 ఎకరాలు.. ఆండ్ర కింద 0.882 టీఎంసీలను 9,426 ఎకరాలు.. డెంకాడ ఆనకట్ట కింద 0.650 టీఎంసీలను 5,203 ఎకరాలు.. వెంగళరాయసాగర్ కింద 3.366 టీఎంసీలను 24,700 ఎకరాలు, పెద్దగెడ్డ నుంచి 0.747 టీఎంసీలను 12.221 ఎకరాలు.. పెదంకలాం ద్వారా 1.030 టీఎంసీలను 8,257 ఎకరాలు, వట్టిగెడ్డ జలాశయం ద్వారా 1.676 టీఎంసీలను 26,684 ఎకరాలు, జంఝావతి కింద 1.9 టీఎంసీలను తొమ్మిది వేల ఎకరాలకు ప్రస్తుతం ఇస్తున్నారు.



వంశధార ప్రాజెక్టు స్టేజ్-1 ఎడమ ప్రధాన కాల్వ కింద 17.841 టీఎంసీలను ప్రస్తుతం 1,48,230 ఎకరాలకు ఇస్తున్నారు. ఫేజ్-1లో స్టేజ్-2 కుడి ఎడమ ప్రధాన కాల్వ కింద 7.353 టీఎంసీలు 63,286 ఎకరాలకు విడుదలవుతుంది. ఇవి కాకుండా మరో 40 వేల ఎకరాలకు నీరందాలి.

మడ్డువలస రిజర్వాయరు స్టేజ్-1 కింద 24,877 ఎకరాలకు 5.33 టీఎంసీలు ఇస్తున్నారు. పాత ఆయకట్టు కింద 1.12 టీఎంసీల ద్వారా 5,200 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు.

**నిధులిస్తాం.. నీరందిస్తాం**

ఉత్తరాంధ్రలో పనుల పూర్తికి అవసరమైన నిధులు విడుదలకు తొలి ప్రాధాన్యం ఇస్తాం. ఈ నెల 22న 'ఈనాడు'లో 'నిమ్మలంగా నిధులు ఇవ్వండి సారూ..' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై చర్చించా. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధుల అంచనా వ్యయంతో నివేదిక అందజేశారు. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిధులు విడుదల చేస్తాం.

నిమ్మల రామానాయుడు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి


# ఈ-కార్డులతో వృద్ధాప్యానికి గౌరవం

అర్థవీడు: వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులు ఓ వరం కానున్నాయి. వృద్ధాప్యం గౌరవంగా కొనసాగాలనే యోచనతో కూటమి ప్రభుత్వం ఈ-కార్డులను అందిస్తోంది. అందుకు గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. సదరు కార్డును వినియోగించుకుని అనేక సేవలు, రాయితీలు అందుకోవచ్చు. పురుషులు(60 ఏళ్లు), మహిళలు(58 ఏళ్లు) వీటిని పొందే అవకాశం పొందవచ్చు. టికెట్ల నుంచి కోర్టు కేసుల వరకు సులువు:

సీనియర్ సిటిజన్ కార్డు ఉంటే ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలు సులువుగా పొందవచ్చు.

ఈ-కార్డుంటే ఇతర గుర్తింపు కార్డుల అవసరం అంతగా ఉండదు. ఆర్టీసీ బస్సుల్లో 25 శాతం రాయితీ లభిస్తుంది.

రైళ్లలో కింద బెర్తులు కేటాయిస్తారు. బ్యాంకింగ్, తపాలా శాఖల్లోని డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ పొందడానికి వీలుంటుంది. కోర్టు కేసుల తేదీల కేటాయింపు, పన్ను మినహాయింపులకు ఉపయోగపడుతుంది.




పాస్‌పోర్ట్ పొందాలంటే అయ్యే రుసుంలో 10 శాతం రాయితీతో పాటు ప్రత్యేకంగా టోకెన్లు ఇచ్చి పని త్వరగా పూర్తి చేస్తారు.

జిల్లాలో మండలాలు: 38
పంచాయతీలు: 729
గ్రామ సచివాలయాలు: 719
60 ఏళ్లు దాటినవారు: 3.41 లక్షలు

దరఖాస్తు ఇలా చేసుకోవచ్చు: సీనియర్ సిటిజన్ కార్డు పొందడానికి స్థానిక సచివాలయంలో ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, రూ.40 నగదుతో డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలి. పది నిమిషాల్లో కార్డును రూపొందించి అందిస్తారు. కార్డుపై సంబంధిత వ్యక్తి ఫోన్ నంబరు, చిరునామా, ఆధార్ వివరాలు, బ్లడ్ గ్రూపు తదితర వివరాలు పొందుపరుస్తారు. అత్యవసర సమయాల్లో ఈ వివరాలు కూడా ఎంతగానో ఉపయోగపడతాయి.

# రెక్కల కష్టానికి రానున్న రొక్కం

కొత్తపట్నం : జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలకు నెలల తరబడి పేరుకుపోయిన బకాయిలను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కూలీల ఖాతాల్లోకి నగదు జమ కానుంది. ఈ నెల 15వ తేదీలోపు బకాయిలున్న వరకు నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ పూర్తి కావడంతో కూలీలు ఉపాధి పనులపై ఆధారపడుతున్నారు. రోజుకు సరాసరిన 1.50 లక్షల మంది పనులకు వెళ్తున్నారు. మార్గదర్శకాల మేరకు వారం రోజులకోసారి వేతనాలు చెల్లించాల్సి ఉండగా.. ఈ ఏడాది జనవరి 16 నుంచి నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బకాయిలు విడుదల కావడం వారికి ఊరట కానుంది.

**జారీ చేసిన కార్డులు: 4.42 లక్షలు**



పనికి వస్తున్న కుటుంబాలు: 3.81 లక్షలు
మొత్తం కూలీల సంఖ్య: 6.80 లక్షలు
వేతన బకాయిలు (2024-25): రూ.25 కోట్లు
వేతన బకాయిలు (2025-26): రూ.10.11 కోట్లు

12 వారాలుగా ఇబ్బందులు: ఏటా ఆర్థిక సంవత్సరం ముగింపులో వేతనాల చెల్లింపు కొంతమేర జాప్యం అవుతుంటుంది. కేంద్రం నుంచి నిధులు సకాలంలో రాకపోవడంతో గత 12 వారాలుగా చెల్లింపులు నిలిచిపోయాయి. ఫలితంగా కూలీలు ఇబ్బందులు పడ్డారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్య పనుల కింద గ్రామాల్లో పంట కుంటలు, పశువుల నీటి తొట్టె నిర్మాణ పనులతోపాటు.. చెరువుల అభివృద్ధి, ఫీడర్ ఛానల్, పంట కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు కూలీలకు రోజుకు గరిష్ఠంగా రూ.300 ఇస్తుండగా.. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం రూ.307కు పెంచింది. తాజాగా పెండింగ్ వేతనాలు విడుదల కావడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులకు వచ్చే కూలీల సంఖ్య కూడా పెరగనుంది.

# గుడివాడ కొండ గుల్ల


రావికమతం : గుడివాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు.338-2లోని కొండపై అనధికారికంగా బ్లాక్ మెటల్ తవ్వకాలు మొదలయ్యాయి. మెటల్ వెలికితీసి, వెంటనే తరలించేందుకు అవసరమైన యంత్రాలు, వాహనాలను తవ్వకందారులు సిద్ధం చేశారు. ఈ కొండపై బ్లాక్ మెటల్ తవ్వకాలకు గతంలో కంపెనీ అనుమతులు పొందింది. ప్రస్తుతం క్వారీ లీజు గడువు ముగిసింది. ఈ క్వారీలో తవ్వకాలకు మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి తదుపరి ఉత్తర్వులు లేకుండానే నుంచి



బ్లాక్ మెటల్ తవ్వేస్తున్నారు. దీనిపై స్థానికులు తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేయడంతో ఆర్.ఐ. సతీష్‌ను విచారణకు పంపించారు. ఆర్ఐ బుధవారం అక్కడికి వెళ్లే సమయానికి పొక్లెయిన్‌ను వదిలేసి డ్రైవర్, యజమాని అక్కడి నుంచి జారుకున్నారు. పొక్లెయిన్ స్వాధీనం చేసుకుని సమీపంలోని మెటల్ క్వారీకి తరలించామని తహసీల్దార్ చెప్పారు. అనధికారిక తవ్వకాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి తదుపరి చర్యలకు జిల్లా అధికారులకు నివేదిస్తామని వివరించారు.

# మతి పోగొట్టే జాన్వీ అందాల షో

జాన్వీ కపూర్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయింది. బాలీవుడ్‌లో ఈమె నటించిన ఒక్క సినిమా కూడా ఆశించిన స్థాయిలో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయాయి. అయినా ఇన్నాళ్లు ఇండస్ట్రీలో ఈ అమ్మడు కొనసాగడంకు కారణం అందం అనడంలో సందేహం లేదు. బాలీవుడ్‌లోనే చాలా మంది జాన్వీ కపూర్ అందం వల్ల, శ్రీదేవి కూతురు కావడం వల్ల కెరీర్‌లో నెగ్గుకు వస్తుందని అంటూ ఉంటారు. ఆ విషయం పక్కన పెడితే జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసే ఒక్కొక్క ఫోటో షూట్ చూపు తిప్పుకోనివ్వకుడా మతి పోగొడుతూ ఉంటుంది. తాజాగా మరోసారి జాన్వీ కపూర్ అందాల షో తో, ఆకట్టుకునే స్కిన్ షో తో పిచ్చెక్కిస్తోంది. ఇటీవల జాన్వీ కపూర్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్ పై హొయలు పోతూ హంస నడక నడిచింది. ఆ సమయంలో అందరి దృష్టిని ఆకర్షించిన జాన్వీ కపూర్ చూపు తిప్పుకోనివ్వలేదు. లైట్ పింక్ కలర్ ఔట్ ఫిట్ లో జాన్వీ కపూర్ చేసిన రెడ్ కార్పెట్ వాక్‌కి అంతా ఫిదా అయ్యారు. కానీ ఆ సమయంలో జాన్వీ కపూర్ అస్సలు స్కిన్ షో చేయక పోవడంను కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. అలాంటి ప్రఖ్యాత రెడ్ కార్పెట్ పై జాన్వీ కపూర్ గ్లామర్ షో చేసి ఉంటే బాగుండేది అంటూ కామెంట్ చేస్తున్నారు. ఆ సమయంలో చేయని గ్లామర్ షో ఫోటోలను తాజాగా జాన్వీ కపూర్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది. తాజా ఫోటో షూట్‌తో మరోసారి జాన్వీ కపూర్ మతి పోగొడుతోంది. వైట్ కలర్ డ్రెస్‌లో నడుము అందం చూపిస్తూ, థైస్‌ను చూపించి చూపించకుండా భలే చక్కగా కనిపించిన జాన్వీ కపూర్‌కి అంతా



ఫిదా అవుతున్నారు. ఇంతటి అందగత్తె కనుకే జాన్వీ కపూర్‌కి హిట్ లేకున్నా ఆఫర్లు వస్తున్నాయని మరోసారి అభిమానులు, నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. జాన్వీ కపూర్ ఈ స్థాయిలో అందాల ఆరబోత ఫోటో షూట్స్ చేస్తే ఇన్‌స్టాగ్రామ్‌లో త్వరలోనే ఇన్‌స్టాలో అత్యధిక ఫాలోవర్స్ ఉన్న బాలీవుడ్ ముద్దుగుమ్మగా నిలవడం ఖాయం అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీ కపూర్ షేర్ చేసే ఏ ఫోటో షూట్ అయినా కచ్చితంగా మంచి స్పందన దక్కించుకుంటూ ఉంటుంది. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా స్కిన్ షో ఉ ందనే కామెంట్స్ వస్తున్నాయి. ఇక జాన్వీ కపూర్ సినిమాల విషయానికి వస్తే తెలుగులో దేవర సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే ఆ సినిమాలో జాన్వీ పాత్ర విషయంలో విమర్శలు వచ్చాయి. ఇంకాస్త ఎక్కువ సీన్స్ జాన్వీ కపూర్ చేసి ఉంటే బాగుండేది అని, ఆమె నటకు ఆస్కారం లేదనే విమర్శలు వచ్చాయి. దేవర విషయంలో జరిగిన తప్పిదం రిపీట్ కాకుండా పెద్ది సినిమాతో జాన్వీ కపూర్ రాబోతుంది. బుచ్చిబాబు కచ్చితంగా మంచి పాత్రను జాన్వీ కపూర్‌కి ఇచ్చి ఉంటాడు. రామ్ చరణ్ వంటి స్టార్‌తో సినిమాను చేసేందుకు రెడీ అయిన నేపథ్యంలో కచ్చితంగా జాన్వీ కపూర్ ఓ రేంజ్‌లో టాలీవుడ్‌లో పెద్ది తర్వాత స్టార్‌డం దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు బాలీవుడ్‌లోనూ జాన్వీ కపూర్ బిజీగా ఉంది.

# రష్మిక మళ్లీ ఉల్లాసంగా ఉత్సాహంగా!

సినిమా ప్రచారమంటే కొందరు హీరోయిన్లు ఎలా స్కిప్ కొట్టాలా? అని చూస్తుంటారు. ఆ ఛాన్స్ ఏ రూపంలో వస్తుందా? ఎస్కేప్ అయిపోదామా? అని చూస్తుంటారు. తమ పార్ట్ షూటింగ్ పూర్తయిన తర్వాత పారితో షికం తీసుకుని చెక్కేయాలనే చూస్తుంటారు. చాలా కొద్ది మంది మాత్రమే సినిమా మొదలు నుంచి రిలీజ్ వరకూ ఎరకూ అంకిత భావంతో పనిచేస్తుంటారు. ప్రచార సమయంలో దర్శక, నిర్మాతలకు తమ వంతు సహకారం అందిస్తుంటారు. అలాంటి వాళ్లలో ముందున్నది ఎవరు? అంటే నేషనల్ క్రష్ రష్మికా మందన్నా అనడంలో ఎలాంటి సందేహం లేదు. రష్మిక సినిమాలో హీరోయిన్ అయినా రిలీజ్ వరకూ ప్రచారాన్ని కూడా తన భుజాలపై వేసుకుని మోస్తుంది. సినిమాని జనాల్లోకి వెళ్లేలా తన వంతు ప్రయత్నం చేస్తుంటుంది. ఇటీవల రిలీజ్ అయిన 'ఛావా' ప్రచారానికి ఎలాంటి స్టేజ్ లో వచ్చిందో



తెలిసిందే. నడవలేని పరిస్థితుల్లో ఉన్నా..వీల్ చైర్ కి అంకితమైనా? 'ఛావా' సినిమాని దగ్గరుండి ప్రమోట్ చేయాలనే కృత నిశ్చయంతో వీల్ చైర్ లోనే ప్రచార కార్యక్రమానికి హాజరైంది. అప్పుడే మరోసారి ప్రచారం విషయం లో రష్మిక ఎంత కమిట్ మెంట్ తో ఉంటుందన్నది అర్దమైంది. ఈ నేపథ్యంలో రష్మిక నంటిచన 'సికిందర్' కూడా రిలీజ్ కి రెడీ అవుతుంది. ఇటీవల ముంబైలో 'సికిందర్' నుండి ఒక కొత్త పాట లాంచ్ సందర్భంగా కనిపించింది. దీంతో వచ్చే వారం నుంచి రష్మిక 'సికిందర్' రిలీజ్ అయ్యే వరకూ ప్రచారం పనుల్లోనే నిమగ్నమ వుతుందని తెలుస్తోంది. అన్ని ఇంటర్వ్యూలు, ఈవెంట్‌లు , ఇతర ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటుంది. 'ఛావా' తర్వాత మళ్లీ వెంటనే బాలీవుడ్ మీడియా ముందుకు వెళ్లడం కోసం రష్మిక కూడా అంతే ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తోంది.




# 'ఓజీ' ఐటెం.. ఇంట్రస్టింగ్ అప్‌డేట్!



పవన్ కళ్యాణ్ రాజకీయాలు, పరిపాలనతో బిజీగా ఉండటం వల్ల సినిమాలకు సమయం కేటాయించలేక పోయాడు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. పవన్ ఏడాది కాలం పాటు చాలా బిజీగా ఉంటూ వచ్చారు. ఎట్టకేలకు ఆయన ఫ్యాన్స్ కోరుకుంటున్న విధంగా సినిమాలకు సమయం ఇచ్చేందుకు సిద్ధం అయ్యాడు. దాదాపు ఐదేళ్లుగా పవన్ ఫ్యాన్స్‌ను ఊరిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా షూటింగ్‌ను ఇటీవలే పూర్తి చేశాడు. సినిమా షూటింగ్ పూర్తి అయిందని చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 12 వీరమల్లు థియేటర్ల ద్వారా రాబోతున్న విషయం తెల్సిందే. పవన్ కళ్యాణ్ అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సినిమా 'ఓజీ'. ఈ సినిమాకు సాహెూ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నాడు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ కార్యక్రమాలు ఎప్పుడో ప్రారంభం అయ్యాయి, గత ఏడాదిలోనే సినిమా విడుదల కావాల్సి ఉండగా ముందుగా చెప్పుకున్నట్లు పవన్ కళ్యాణ్ రాజకీయాలతో బిజీగా ఉండటం, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలనతో బిజీగా ఉండటం వల్ల వీరమల్లు తరహాలోనే ఓజీ సినిమాను పక్కన పెట్టారు. దాంతో ఓజీ సినిమా ను ఎప్పుడు ఎప్పుడు పూర్తి చేస్తారా అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పవన్ అభిమానుల్లో కొందరు వీరమల్లు కంటే ఓజీ సినిమా కోసం ఎక్కువగా ఎదురు చూస్తున్నారు. స్టైలిష్ మాఫియా బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో పవన్ కనిపిస్తే చూడాలని అభిమానులు చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాంటి స్టైలిష్ మాఫియా మూవీని సాహెూ సుజీత్ తీయగలడని అంతా నమ్ముతున్నారు. అందుకే ఓజీ సినిమాపై అంచనాలు పెరిగాయి. భారీ అంచనాలు ఉన్న ఓజీ సినిమా కోసం ఐటెం సాంగ్‌ను దర్శకుడు సుజీత్ ప్లాన్ చేస్తున్నాడట. ఆ ఐటెం సాంగ్ చాలా ప్రత్యేకతలను కలిగి ఉండనుంది. తమన్ సంగీతం అందిస్తున్న ఓజీ ఐటెం సాంగ్‌ను తమిళ స్టార్ నటుడు శింబు పాడబోతున్నాడు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇటీవల శింబు హైదరాబాద్ ప్రెస్ మీట్‌లో ఆ విషయాన్ని ధృవీకరించాడు. తమన్ సంగీత సారధ్యంలో శింబు పాడబోతున్న ఓజీ ఐటెం సాంగ్‌లో మిల్కీ బ్యూటీ తమన్నా కనిపిస్తుందనే వార్తలు వస్తున్నాయి. అయితే తమన్నాతో పవన్ కళ్యాణ్ ఆడిపాడేది అనుమానమే. ఎందుకంటే కథ అనుసారం విలన్‌లతో ఐటెం సాంగ్ ఉంటుందని, కనుక తమన్నా, పవన్ కళ్యాణ్ కాంబో డాన్స్ మూవ్స్ ఉండక పోవచ్చు అంటూ చాలా మంది కామెంట్ చేస్తున్నారు. అసలు విషయం ఏంటి అనేది తెలియాల్సి ఉంది. ఓజీ సినిమాను ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా దర్శక నిర్మాతలు ప్రయత్నాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ కూడా అందుకు సహకరించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. బ్యాక్ టు బ్యాక్ వీరమల్లు, ఓజీ సినిమాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# ధనుష్ 'కుబేర' - అనుమానాలకు ఎండ్ కార్డ్!



ధనుష్, శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో రూపొందుతున్న 'కుబేర' సినిమా టాలీవుడ్, కోలీవుడ్‌లో భారీ క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ డిఫరెంట్ థ్రిల్లర్ లో నాగార్జున, రష్మిక మందన్న, జిమ్ సర్భ్, దలీప్ తాహిల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ సినిమా తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతోంది. 'ఫిదా', 'లవ్ స్టోరీ' లాంటి హిట్స్‌తో అలరించిన శేఖర్ కమ్ముల ఈసారి కంప్లీట్ గా జానర్ మార్చేశాడు. ఈ సినిమా సందేశాత్మక కథతో ఆడియన్స్‌ను మెప్పించనుందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే విడుదలైన 'కుబేర' గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ సినిమాపై భారీ బజ్‌ను క్రియేట్ చేశాయి. గ్లింప్స్‌లో ధనుష్ ఒక బిచ్చగాడి పాత్రలో, నాగార్జున ఒక పోలీస్ ఆఫీసర్ గా, రష్మిక మిడిల్ క్లాస్ అమ్మాయిగా కనిపించారు. ఈ సినిమా సంపద, ఆశ, నైతిక సందిగ్ధతల చుట్టూ తిరుగుతుందని, పాత్రల మధ్య ఎమోషనల్ డ్రామా హైలైట్‌గా ఉంటుందని అంటున్నారు. త్వరలో మరో టీజర్ రిలీజ్ కానుందని, ఇది సినిమాపై అంచనాలను మరింత పెంచనుందని మేకర్స్ చెబుతున్నారు. అయితే 'కుబేర' విడుదల వాయిదా పడే అవకాశం ఉన్నట్లు ఇటీవల పలు రకాల వార్తలు వైరల్ అయ్యాయి. ఇక ప్రచారంలో నిజం లేదని మూవీ యూనిట్ స్పష్టం చేసింది. అంతే కాకుండా అఫీషియల్ గా డేట్ పై క్లారిటీ ఇచ్చేసింది. ముందుగా ప్రకటించిన జూన్ 20వ తేదీనే సినిమాను రిలీజ్ చేస్తామని తెలిపింది. అసలైతే గత ఏడాది డిసెంబర్ లోనే రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ అనుకున్నట్లు షూటింగ్ ఫినిష్ కాలేదు. ఇక సమ్మర్ లో కూడా ప్లాన్ వర్కౌట్ కాలేదు. దీంతో జూన్ లో పర్ఫెక్ట్ ప్లాన్ తో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్, ముంబై, బ్యాంకాక్, గోవా, తిరుపతి వంటి ప్రాంతాల్లో జరిగింది. పోస్ట్-ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి, ఈ సినిమా అన్ని భాషల్లో ఒకేసారి గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. సినిమాలో ధనుష్ ఒక బిచ్చగాడి నుంచి మాఫియా కింగ్‌గా మారే పాత్రలో కనిపించనున్నాడని, నాగార్జున ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌గా నటిస్తున్నాడని సమాచారం. రష్మిక మందన్న పాత్ర కూడా మిడిల్ క్లాస్ నేపథ్యంతో ఆకర్షణీయంగా ఉంటుందని అంటున్నారు. మొత్తంగా, 'కుబేర' సినిమా శేఖర్ కమ్ముల మార్క్ ఎమోషనల్ డ్రామాతో అభిమానులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఇక బాక్సాఫీస్ వద్ద విడుదల అనంతరం ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి.

# అనుష్క అలా డిసైడ్ అయితే వాళ్లకి పండగే..!

స్వీటీ అనుష్క సినిమాలకు గ్యాప్ ఇవ్వడం వల్ల ఆమె ఫ్యాన్స్ అంతా కూడా ఆమెను ఎంతో మిస్ అయ్యారు. నిశ్శబ్దం తర్వాత కెరీర్ లో కూడా సైలెన్స్ మెయింటైన్ చేస్తూ వచ్చిన అనుష్క 3 ఏళ్ల గ్యాప్ తర్వాత నవీన్ పొలిశెట్టితో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా చేసింది. ఆ సినిమాలో అనుష్కని చూసి తెలుగు ఆడియన్స్ ఖుషి అయ్యారు. ఇక ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ కాబట్టి స్వీటీ ఫ్యాన్స్ అయితే ఆమెను చూసేందుకే రిపీటెడ్ గా సినిమాకు వెళ్లారు. ఐతే ఆ సినిమా తర్వాత మళ్లీ కథల ఎంపికలో లేట్ చేసింది అనుష్క. ఫైనల్ గా క్రిష్ డైరెక్షన్ లో ఘాటితో రాబోతుంది. ఈ సినిమా ఈపాటికి రిలీజ్ అవ్వాల్సింది కానీ ఇంకా షూటింగ్ పూర్తి కాలేదని వాయిదా వేశారు. అనుష్క ఘాటి రిలీజ్ ఎప్పుడు అన్నది క్లారిటీ రాలేదు. క్రిష్ కూడా ఘాటి విషయం లో సైలెంట్ గా ఉంటున్నాడు. ఇదిలా ఉంటే తనపై ఫ్యాన్స్ చూపిస్తున్న ఈ ప్రేమని దృష్టిలో ఉంచుకుని అనుష్క ఒక క్రేజీ డెసిషన్ తీసుకుందని తెలుస్తుంది. ఇక మీదట కెరీర్ లో గ్యాప్ తీసుకోకూడదని అనుష్క నిర్ణయం తీసుకుందని తెలుస్తుంది. అంతేకాదు ఒకప్పటిలా కమర్షియల్ సినిమాల్లో కూడా ఆమె నటించాలని అనుకుంటుందట. అనుష్క కమర్షియల్ సినిమాలు చేయాలని అనుకుంటే మాత్రం ఆమెకు వరుస ఛాన్స్ లు వస్తాయని చెప్పొచ్చు.



కమర్షియల్ సినిమాలు చేస్తూనే అనుష్క ఫిమేల్ సెంట్రిక్ సినిమాలతో స్టార్ ఇమేజ్ సంపాదించింది. అనుష్క తిరిగి మళ్లీ కమర్షియల్ సినిమాలు చేస్తే మాత్రం మిగతా హీరోయిన్స్ కి గట్టి షాకే తగిలే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. అనుష్క ఘాటి రిలీజ్ తర్వాత పెద్దగా గ్యాప్ తీసుకోకుండానే మరో సినిమా చేయాలని అనుకుంటుందట. ప్రభాస్ తో మరోసారి అనుష్క జత కడితే చూడాలని ఫ్యాన్స్ అంతా ఎదురుచూస్తున్నారు. ఐతే ఆ కాంబినేషన్ కుదరలాంటే అలాంటి ఒక కథ సెట్ అవ్వాలి. ప్రభాస్ మాత్రమే కాదు అనుష్క తను చేసిన మిగతా స్టార్స్ అందరితో కలిసి చేస్తే మాత్రం ఆమె ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే అని చెప్పొచ్చు. మరి కెరీర్ పట్ల అనుష్క నిజంగానే సీరియస్ గా ఆలోచిస్తుందా లేదా మళ్లీ గ్యాప్ తీసుకునే ఆలోచనలో ఉందా అన్నది తెలియాల్సి ఉంది. ఘాటి రిలీజ్ ప్రమోషన్స్ టైంలో అనుష్కని ఫ్యాన్స్ కూడా వరుస సినిమాలు చేయాలని రిక్వెస్ట్ చేయాలని ఫిక్స్ అయ్యారు.

# కీర్తి సురేష్.. ఈసారి మరింత రొమాన్స్

తెలుగు సినీ ప్రియులకు జెట్ స్పీడ్ లో దగ్గరైన స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్, గత కొంతకాలంగా తన కెరీర్‌ను భిన్నమైన ట్రాక్ లో హైలెట్ చేసుకుంటోంది. సౌత్‌లో పలు సక్సెస్‌ఫుల్ ప్రాజెక్టులు చేసిన తర్వాత, ఆమె బాలీవుడ్ వైపు అడుగులు వేస్తోంది. 'మహానటి' వంటి క్లాసిక్ హిట్ తర్వాత కీర్తి కెరీర్‌కు భారీ మార్పు వచ్చింది. ముఖ్యంగా, సౌత్ ఇండస్ట్రీలోనే కాకుండా ఇతర పరిశ్రమల్లోనూ తన పరిధిని విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కీర్తి హిందీలో క్రేజీ ప్రాజెక్టులలో నటిస్తోంది. అందులో గత ఏడాది వచ్చిన 'బేబీ జాన్' అంతగా హిట్ కాలేదు, ఈ సినిమా అట్లీ నిర్మాణంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ నష్టాలను మిగిల్చింది. మరోవైపు 'అక్క' అనే సినిమాలో నటిస్తోంది. ఇందులో రాధికా ఆప్టే, తను ఆజ్మి, దీప్తి సాల్విలతో కలిసి ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రం సౌత్ ఇండియన్ బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న మహిళా గ్యాంగ్‌స్టర్స్ కథగా హైలెట్ అవుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి వచ్చిన టీజర్ కీర్తి పాత్రకు మంచి హైప్ క్రియేట్ చేసింది. ఇదిలా ఉంటే, కీర్తి ఇప్పుడు బాలీవుడ్‌లో



కొత్త కోణాన్ని ఎక్స్‌ప్లోర్ చేయడానికి సిద్ధమవుతోంది. రీసెంట్‌గా ఆమె ఒక రొమాంటిక్ కామెడీ సినిమాలో నటించేందుకు చర్చలు జరుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. గతంలో ఆమె 'నేను శైలజ', 'నేను లోకల్', 'రంగ్‌దే' వంటి సినిమాల్లో లవబుల్ పాత్రలు పోషించి, ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో కూడా అలాంటి ఫన్ అండ్ లైట్‌హార్టెడ్ పాత్రను చేయబోతోందని తెలుస్తోంది. సినిమా కథ, ఇతర నటీనటుల వివరాలు ఇంకా రివీల్ చేయలేదు కానీ, ఇది ఆమెకు హిందీ మార్కెట్‌లో మంచి అవకాశంగా మారవచ్చనే అంచనా లు ఉన్నాయి. గతంలో కంటే ఈసారి రొమాంటిక్ డోస్ కాస్త ఎక్కువగానే ఉంటుందట. కీర్తి కెరీర్‌లో లేటెస్ట్ మార్పులు చూస్తుంటే, ఆమె తెలుగులోనే కాకుండా తమిళం, హిందీలోనూ తన స్థాయిని పెంచుకోవడానికి కృషి చేస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో మరోకొన్ని సౌత్ సినిమాలు కూడా ఉన్నాయి. సౌత్‌లో మంచి కమర్షియల్ సినిమాలే కాకుండా, కంటెంట్ బేస్డ్ ఫిల్మ్స్‌పై కూడా ఫోకస్ పెట్టింది. బాలీవుడ్‌లో తనకు సరైన స్థానం సంపాదించుకోవాలంటే, వరుసగా మంచి కథల్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. ఈ కొత్త ప్రయోగం కీర్తి సురేష్‌కి ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. ఇప్పటికే బాలీవుడ్‌లో హిట్ హీరోయిన్ల మధ్య హెల్తీ కాంపిటేషన్ ఉంది. కానీ కీర్తి తన మల్టీ టాలెంటెడ్ పెర్ఫార్మెన్స్‌తో అక్కడ సక్సెస్ అవుతుందా అనే ప్రశ్నకు సమాధానం రాబోయే రోజుల్లో తెలుస్తుంది. మొత్తానికి, రొమాంటిక్ కామెడీతో బాలీవుడ్ ప్రేక్షకులకు కొత్త కీర్తిని పరిచయం చేసే ప్రయత్నం ఆమె చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536